
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 181
గురువారం 21-9-2023




'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'



సిరాజ్ మళ్లీ నంబర్‌వన్

ఐసీసీ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి భారత పేసర్ - 12లో



20 వేల దిగువకు నిఫ్టీ

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్ల పతన ప్రభావం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఎర్డోగన్ నోట.. కశ్మీర్ మాట

తుర్కియే అధ్యక్షుడు రెసిప్ తయ్యిప్ ఎర్డోగన్ మళ్లీ కశ్మీర్ అంశాన్ని పనిగట్టుకుని అంతర్జాతీయ వేదికపై ప్రస్తావించారు.
- వివరాలు 6లో



పతకానికి విజయం దూరంలో...

ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో సెమీస్‌లో ఓడిన అంతిమ్. నేడు కాంస్య పతక బౌట్‌లో గెలిస్తే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత.
- వివరాలు 12లో



ఇంటి ప్రేమే అసలు వైద్యం

టీనేజర్లలో ఆత్మహత్యల ధోరణి పెరిగిన నేపథ్యంలో వారిని డిప్రెషన్ బారి నుంచి కాపాడుకోవడంపై కథనం
- వివరాలు 11లో



టోటల్ ఎనర్జీస్ భారీ పెట్టుబడి

అదానీ గ్రూప్‌తో ఏర్పాటు చేయనున్న శుద్ధ ఇంధన జేవీలో రూ. 2,500 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు టోటల్ ఎనర్జీస్ వెల్లడించింది.
- వివరాలు 13లో

మహిళా బిల్లుకు జై

'నారీశక్తి వందన్ అధినియమ్'కు లోక్‌సభ ఆమోదం

బిల్లుకు అనుకూలంగా 454, వ్యతిరేకంగా 2 ఓట్లు

- పార్టీలకు అతీతంగా దాదాపు ఏకగ్రీవంగా మద్దతు
- దిగువ సభలో బిల్లుపై 8 గంటలపాటు సుదీర్ఘ చర్చ
- అనంతరం మాన్యువల్ విధానంలో ఓటింగ్
- బిల్లును వ్యతిరేకించిన ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్
- ఇక రాజ్యసభ ముందుకు మహిళా రిజర్వేషన్ బిల్లు
- ఎగువ సభలో నేడే చర్చ, ఓటింగ్.. ఆమోదం లాంఛనమే

న్యూఢిల్లీ: లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభ దాదాపు ఏకగ్రీవంగా ఆమోదించింది. రాజ్యాంగ సవరణ బిల్లుకు సంబంధించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 368(2) ప్రకారం ఈ బిల్లు ఆమోదం పొందింది. దీనిప్రకారం సభలోని మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది మద్దతు తెలపాల్సి ఉంటుంది. పార్టీలకు అతీతంగా సభ్యులు బిల్లుకు జై కొట్టారు. పార్లమెంట్ నూతన భవనంలో ఆమోదం పొందిన మొట్టమొదటి బిల్లు ఇదే కావడం విశేషం. 'నారీశక్తి వందన్ అధినియమ్' పేరిట కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ నెల 19న లోక్‌సభలో ప్రవేశపెట్టిన 'రాజ్యాంగ(128వ సవరణ) బిల్లు–2023'పై బుధవారం దాదాపు 8 గంటలపాటు సుదీర్ఘంగా చర్చ జరిగింది. కేంద్ర మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ ఎంపీ సోనియా గాంధీ సహా వివిధ పార్టీలకు చెందిన దాదాపు 60 మంది సభ్యులు మాట్లాడారు. కొందరు బిల్లుకు మద్దతుగా ప్రసంగించారు. మరికొందరు మహిళా రిజర్వేషన్లలో మిగతా 6వ పేజీలో ▶



పార్లమెంటు నూతన భవనాన్ని తిలకించేందుకు వచ్చిన మహిళా సందర్శకులు



ప్రస్తుతం రాజీవ్ గాంధీ కల సగమే నెరవేరింది. బిల్లు చట్టరూపం దాల్చాకే ఆయన కల నెరవేరుతుంది. నాదో ప్రశ్న. మహిళలు తమ రాజకీయ బాధ్యతలు నెరవేర్చుకునేందుకు గత 13 ఏళ్లుగా వేచిచూస్తున్నారు. ఇంకా మనం వాళ్లని రెండేళ్లు, నాలుగేళ్లు, ఆరేళ్లు, ఎనిమిదేళ్లు వేచి ఉండండని చెబుదామా? భారతీయ మహిళల పట్ల ఇలా ప్రవర్తించడం సముచితం కాదు. ఈ బిల్లు వెంటనే అమల్లోకి రావాల్సిందే. కుల గణన తర్వాత ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళలకు రిజర్వేషన్లలో ప్రాతినిధ్యం దక్కాలి.
- సోనియా



మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణం అమల్లోకి తేవాలన్న విపక్షాల డిమాండ్ సరికాదు. ఒకవేళ రాహుల్ ప్రాతినిధ్యం వహిస్తున్న వయనాడ్, అసదుద్దీన్ ఒవైసీ (మజ్లిస్ అధినేత) ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ లోక్‌సభా స్థానాలు మహిళలకు రిజర్వ్ అయితే మా ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందంటూ అందుకు మళ్లీ మోదీ సర్కారునే నిందిస్తారు. అందుకే నియోజకవర్గాల పునర్విభజనను సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి సారథ్యంలోని కమిషన్ పూర్తి పారదర్శకంగా చేపడుతుంది. రాబోయే సార్వత్రిక ఎన్నికల తర్వాత కేంద్రంలో వచ్చే నూతన ప్రభుత్వం వెంటనే జన గణన, నియోజకవర్గాల పునర్విభజన చేపడుతుంది. లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ల కలను సాకారం చేస్తుంది.
- అమిత్ షా

ఇంకెంతకాలం నిరీక్షణ

లోక్‌సభలో గళం విప్పిన మహిళా ఎంపీలు.. బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ - 6లో

న్యూస్‌రీల్

విశాఖలోనూ ఏపీ సీఎం క్యాంపు కార్యాలయం



విశాఖపట్నంలోనూ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి, దసరా నుంచి పరిపాలన ప్రారంభిద్దామని మంత్రులతో భేటీలో ఏపీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు.
- వివరాలు 10లో

నా సీటు కోల్పోవాల్సి వచ్చినా సిద్ధమే!




'మహిళా బిల్లు అమలులోకి వస్తే మరింత మంది మహిళా నేతలు ప్రజాజీవితంలోకి వస్తారు. నేను నా సీటు కోల్పోవాల్సి వచ్చినా దానికి సిద్ధమే. మనందరివీ చాలా చిన్న జీవితాలు, అందులో నా పాత్ర పోషించాననే అనుకుంటున్నా' అని కేటీఆర్ అన్నారు.
- వివరాలు 5లో

రోజుకు రెండు విడతలుగా టీఆర్టీ



టీఆర్టీ నవంబర్ 20 నుంచి రోజూ రెండు సెషన్లలో ఉంటుందని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు ఒక సెషన్.. మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు రెండో సెషన్ ఉంటుంది.
- వివరాలు 14లో



మబ్బులు చెదిరి.. నిప్పులు కురిసి..

రాష్ట్రవ్యాప్తంగా పెరిగిపోయిన ఉష్ణోగ్రతలు

- సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు అధికంగా నమోదు
- మళ్లీ వానలు మాయం.. ఎండాకాలం తరహాలో ఉక్కపోత
- మరో నాలుగైదు రోజులు ఇదే తరహా వాతావరణం
- ఈ నెల 28 తర్వాత వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ

- వివరాలు 14లో

అతివేగానికి ఐదుగురు బలి

కారు, బైక్ ఢీ.. ఐదుగురి దుర్మరణం

- మృతుల్లో ముగ్గురిది ఒకే కుటుంబం
- నల్లగొండ జిల్లాలో ఘటన

- వివరాలు 5లో

కలెక్టరేట్ల ముట్టడి ఉద్రిక్తం

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె

- డిమాండ్లు పరిష్కరించాలంటూ బైఠాయింపు
- పలుచోట్ల లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నం
- పోలీసుల అడ్డగింత, అరెస్టులతో ఉద్రిక్తత

3లో



బుధవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఎస్సై ధనశ్రీని జుట్టు పట్టుకుని లాక్కెళ్తున్న అంగన్‌వాడీలు



బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

విచారించే పరిధి మాకు లేదు



కృష్ణా ట్రిబ్యునల్–2 కీలక తీర్పు

- 'పాలమూరు'పై ఏపీ కేసు కొట్టివేత
- సరైన వేదికను ఆశ్రయించే స్వేచ్ఛ ఏపీకి ఉందని స్పష్టీకరణ
- పాలమూరు పాత ప్రాజెక్టే అన్న తెలంగాణ వాదనలకు తిరస్కృతి
- జీవో 246తో ప్రాజెక్టుకు 90 టీఎంసీలను కేటాయించిన రాష్ట్రం
- జీవో నిలుపుదలకు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన ఏపీ

సాక్షి, హైదరాబాద్

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయిస్తూ గత ఏడాది ఆగస్టు 18న తెలంగాణ రాష్ట్రం జారీ చేసిన జీవో 246ను సవాలు చేస్తూ ఏపీ రాష్ట్రం వేసిన కేసు (ఇంటర్‌లొక్యూటరీ అప్లికేషన్)ను జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 కొట్టేసింది. రెండు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు నిర్దిష్ట జల కేటాయింపులపై కృష్ణా ట్రిబ్యునల్–2 తుది నిర్ణయం తీసుకునే వరకు ఈ జీవో అమలును నిలిపివేసి తమ రాష్ట్రానికి మధ్యంతర ఉపశమనం కల్పించాలంటూ ఏపీ వేసిన కేసును విచారించే పరిధి తమకు లేదని తేల్చి చెప్పింది. చట్టానికి లోబడి ఉపశమనం కోసం మరో వేదికను ఆశ్రయించే స్వేచ్ఛను ఏపీకి కల్పించింది. ఈ మేరకు జస్టిస్ బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని జస్టిస్ ఎస్ తలపాత్ర, జస్టిస్ రామ్‌మోహన్‌రెడ్డితో కూడిన కృష్ణా ట్రిబ్యునల్–2 బుధవారం కీలక తీర్పు వెలువరించింది. మరోవైపు మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ వరస



ఓఆర్‌ఆర్ లీజుపై విచారణ వాయిదా

- అక్టోబర్ 10వ తేదీకి వాయిదా వేసిన హైకోర్టు
- సర్కారుకు నిధుల బదిలీ ఆపాలన్న పిటిషనర్
- ఆ నిధులు హెచ్‌ఎండీఏకే చెందుతాయని వాదన
- ప్రభుత్వం వద్ద నిధులు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయన్న ఏజీ
- తుది ఉత్తర్వుల మేరకే నిధుల బదిలీ: హైకోర్టు



3లో

'బోరు'మంటున్న సాగర్ ఆయకట్టు

- పైనుంచి రాని కృష్ణమ్మ
- డెడ్ స్టోరేజీకి దగ్గరలో నాగార్జునసాగర్
- 3,81,022 ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా లక్షన్నర ఎకరాల్లోనే సాగు..
- ఆ పంటను కాపాడుకునేందుకే అన్నదాతల సాగునీటి గోస!

- వివరాలు 2లో

కెనడాను వదిలేసి భారత్‌కు వెళ్లిపోండి

- అక్కడి హిందువులకు హెచ్చరికలు జారీచేసిన నిషేధిత ఖలిస్తానీ ఉగ్ర సంస్థ చీఫ్
- ఎన్‌ఆర్‌ఐలు కెనడా రాజ్యాంగాన్ని అనుసరించట్లేదని మండిపాటు

కెనడాలో జాగ్రత్తగా ఉండండి

- అక్కడి భారతీయులకు కేంద్ర ప్రభుత్వం సూచన

- వివరాలు 6లో

వేలిముద్ర వేస్తేనే రేషన్

కోటా బియ్యం, సరుకుల పంపిణీ ఈ కేవైసీ తప్పనిసరి చేసిన సర్కార్

రేషన్‌కార్డులో పేర్లున్న వారంతా ఈ–పాస్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి

ఈ నెల 5 నుంచే మొదలైన ప్రక్రియ.. కిటకిటలాడుతున్న చౌక దుకాణాలు



సాక్షి, హైదరాబాద్: చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేసే బియ్యం, ఇతర సరుకులతో కూడిన కోటాకు లబ్ధిదారుల 'ఈ– కేవైసీ' (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) పునరుద్ధరణను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. రేషన్ కార్డులో పేరున్న కుటుంబసభ్యులందరి వేలిముద్రలు తీసుకోనుంది. ఆహార భద్రత (రేషన్) కార్డులోని లబ్ధిదారులంతా 'ఈ–కేవైసీ' కింద వివరాలు నమోదు చేసుకుంటేనే ఇక నుంచి సరుకులు పొందనున్నారు. డీలర్ల వద్ద గల ఈ–పాస్ యంత్రంలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా ఇందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. రేషన్‌కార్డులో పేరున్న కుటుంబ పెద్దతో పాటు మిగిలిన లబ్ధిదారులందరూ ఈ–పాస్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల 5వ తేదీ నుంచి మొదలైన ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేవిధంగా డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. మూడు నెలల లోపు ఈ–కేవైసీ నమోదుకు ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, ఈనెలాఖరు లోగానే పూర్తి చేయాలని జిల్లా అధికారులకు పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో రేషన్ దుకాణాల వద్ద ప్రజలు క్యూ కడుతున్నారు. ఈకేవైసీ నేపథ్యంలో రేషన్‌కార్డులో పేరుండి, ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల్లో పనిచేసుకుంటున్న వారు గ్రామాలు, పట్టణాలకు తిరిగి వచ్చి ఈకేవైసీ నమోదు చేసుకుంటున్నారు.

అనర్హుల పేర్లు తొలగించేలా...

రాష్ట్ర వ్యాప్తంగా 90.94 లక్షల రేషన్ కార్డులున్నాయి. వాటిలో సుమారు 2.82 కోట్ల లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో సుమారు 20 శాతం పైగా లబ్ధిదారులు అందుబాటులో లేకున్నా, బియ్యం మాత్రం పూర్తిస్థాయిలో పంపిణీ జరుగుతున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. కార్డులోని లబ్ధిదారులు వృద్ధాప్యం, ఇతర కారణాల వల్ల మరణించడం, కుటుంబంలోని యువతులకు పెళ్లిళ్లు జరిగి వెళ్లిపోవడం, కుటుంబాలు విడిపోవడం వంటి కారణాలతో రేషన్ కార్డులో పేరున్నప్పటికీ, వారు పూర్తిస్థాయిలో బియ్యం, ఇతర సరుకులు పొందడం లేదు. కానీ యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున బియ్యం మాత్రం తీసుకుంటున్నట్లు డీలర్ల వద్ద లెక్కలు చెపుతున్నాయి. దీంతో కార్డులో పేరుండి, అందుబాటులో లేని వారి పేర్లను తొలగించాలని నిర్ణయించింది.

కేవైసీ పునరుద్ధరణ ఇలా..

రేషన్ కార్డులో పేర్లు గల కుటుంబ సభ్యులందరూ చౌక ధరల దుకాణానికి వెళ్లి ఈ పాస్ యంత్రంలో వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. వేలిముద్ర వేయగానే రేషన్ కార్డు నంబరుతోపాటు అతని ఆధార్ కార్డు నంబరు చూపిస్తుంది. ఆకుపచ్చ లైటు వెలగడంతో సదరు వినియోగదారుని కేవైసీ పునరుద్ధరించబడుతుంది. ఒకవేళ కేవైసీలో ఈ పాస్ యంత్రంలో ఎరుపురంగు వెలుగు వస్తే సదరు వినియోగదారుని రేషన్‌కార్డుతో ఆధార్ నంబర్ సరిపోలేదని అర్థం. అదే జరిగితే రేషన్‌కార్డులోని సంబంధిత సభ్యుడి పేరు తొలగించబడుతుంది. రేషన్‌కార్డులోని యూనిట్ల కేవీసీ ప్రక్రియ పూర్తి తర్వాతనే కొత్త సభ్యుల అప్‌డేషన్‌కు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం.

ఇప్పటికే 20 లక్షల వరకు యూనిట్ల తొలగింపు!

రేషన్‌కార్డుల్లోని లబ్ధిదారుల్లో సుమారు పది శాతానికి పైగా సభ్యులు మృతి చెందినట్లు పౌరసరఫరాల అధికారులు గుర్తించారు. ఈ–కేవైసీ ప్రక్రియ ద్వారా ఇప్పటివరకు 10 నుంచి 20 లక్షల యూనిట్లను అనర్హులుగా గుర్తించి, తొలగించినట్లు సమాచారం.

క్లుప్తంగా...

మహిళా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలి: కవిత



సాక్షి, హైదరాబాద్: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో కేంద్రం తీసుకొచ్చిన బిల్లును రాజకీయ ఎత్తుగడగానే భావించాల్సి ఉంటుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేవలం 12వ రోజునే 14 జూన్ 2014లో సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్లలో సామాజిక న్యాయం ఉండాలని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి చేసిన ప్రతిపాదన తరహాలో.. ఓబీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించడంపై కేంద్ర ప్రభుత్వం ఆలోచించాలన్నారు. తద్వారా అన్ని వర్గాల మహిళలకు రిజర్వేషన్ల ఫలాలు అందుతాయన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును స్వాగతిస్తూనే బీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ తో పోరాటాన్ని కొనసాగిస్తామని కవిత ప్రకటించారు. కాగా మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం కృషి చేసిన కల్వకుంట్ల కవితకు రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్, మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు పలువురు నాయకులు, వివిధ కాలేజీల విద్యార్థినులు ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా బిల్లులో బీసీ మహిళ సబ్ కోటా అమలు చేయాలి

జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్



అంబర్‌పేట (హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం అంబర్‌పేట మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం చౌరస్తాలో మహిళా రిజర్వేషన్ బిల్లులో సబ్‌కోటా లేకుండా అమలు చేస్తే దేశంలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించి ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాజుల మాట్లాడుతూ ఒక బీసీ ప్రధానమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ సమగ్రమైన మహిళా బిల్లును ప్రవేశ పెట్టకపోవడం శోచనీయమన్నారు. సబ్ కోటా లేని మహిళా బిల్లును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత మహిళా బిల్లు అమలైతే అగ్రవర్ణాలకే లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

బీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ సంఘాలు, అఖిలపక్ష నాయకుల డిమాండ్

పంజగుట్ట (హైదరాబాద్): కేంద్రం తీసుకొచ్చిన మహిళలకు 33 శాతం రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పలు బీసీ సంఘాలు, అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఏదో ఒక్కరోజు మహిళా బిల్లు కోసం ప్రశ్నించిన ఎమ్మెల్సీ కవిత మహిళా బిల్లు తన వల్లే వచ్చిందని ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని, ఇది సామాజిక ఉద్యమకారుల విజయమే అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ఫోరం వ్యవస్థాపకుడు వంగ రాములు గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేంద్ర్‌గౌడ్, బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు పాలూరి రామకృష్ణయ్య, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్‌లు మాట్లాడు తూ మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, అదే సమయంలో బీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించకపోవడం దారుణమని విమర్శించారు. 1996లో ప్రవేశపెట్టి విరిగిపోయిన బిల్లునే ఎలాంటి సవరణలు, మార్పులు లేకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు కోటా కల్పించకుండానే ప్రవేశపెట్టడాన్ని ఖండిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు సంగెం సూర్యారావు, షేక్ సత్తార్, బెక్కం వెంకట్, సోగరాబేగం, బత్తుల సిద్దేశ్వర్, రోజాశ్రీ నేత, నాగుల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

ఉద్యమకారులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్‌ది

తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్ఎస్ తెలంగాణను లూటీ చేసింది: అర్వింద్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ప్రధాని మోదీ మాట్లాడిన మాటలను కాంగ్రెస్, బీఆర్ఎస్ వక్రీకరిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ ఇస్తామని ప్రకటన చేసిన కాంగ్రెస్, అనంతరం ఎందుకు వెనక్కి తీసుకుందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం జరిగిన ఆత్మహత్యలకు కారణం కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. గతంలో బీజేపీ మూడు రాష్ట్రాలు ఏర్పాటు చేస్తే ఎక్కడా ఎటువంటి గొడవలు, ఆందోళనలు జరగలేదన్న విషయాన్నే మోదీ పార్లమెంట్‌లో చెప్పారన్నారు. బుధవారం ఢిల్లీలో పార్లమెంట్ సమీపంలో ఎంపీ అర్వింద్ మీడియాతో మాట్లాడుతూ, తొమ్మిదిన్నరేళ్లలో తెలంగాణను లూటీ చేశారన్నారు.

‘బోరు’మంటున్న సాగర్ ఆయకట్టు



ఈయన మజ్జిగపు నాగిరెడ్డి. నల్లగొండ జిల్లా త్రిపురారం గ్రామంలో నాగిరెడ్డికి 18 ఎకరాలు ఉంది. నాగార్జున సాగర్ నీటిపై ఆశలు సన్నగిల్లడంతో ఒక్కొక్కటిగా 8 బోర్లు వేయించారు. రూ.3 లక్షలు ఖర్చు చేశారు. ఎడమ కాలువ ద్వారా నీరు వస్తే బోర్లు వేయకుండా సాగు చేసుకునే వాడినని, అదనపు ఖర్చుతో సాగు చేయాల్సి వస్తోందని నిట్టూరుస్తున్నాడు.

- పైనుంచి రాని కృష్ణమ్మ
- డెడ్ స్టోరేజీకి దగ్గరలో నాగార్జునసాగర్
- 3,81,022 ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా కేవలం లక్షన్నర ఎకరాల్లోనే సాగు.. ఆ పంటను కాపాడుకునేందుకే అన్నదాతల సాగునీటి గోస!
- పాత బావుల్లో పూడిక తీయిస్తున్న రైతులు
- కొత్తగా బోర్లు, పైపులైన్లు వేయిస్తున్న మరికొందరు
- భారీగా పెరిగిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు



మేళ్లచెరువు మండలం వేపల మాదారంలో పొలంలో బోరు వేస్తున్న దృశ్యం



ఈయన సూర్యాపేట జిల్లా మేళ్ల చెరువు మండలం వేపలమాదారం గ్రామానికి చెందిన రైతు మర్ల మల్లయ్య. తనకున్న రెండెకరాల పొలంలో బోరు ఉండటంతో వరి వేశారు. ఇటీవల బోరు ఎండిపోయింది. సాగర్ కాలువలో నీరు లేదు. పంటను కాపాడుకునేందుకు పొలం చుట్టూ ఆరు చోట్ల బోరు వేయించారు. అయినా చుక్క నీరు పడలేదు. బోర్లు వేయించేందుకు రూ. 1.80 లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోవడంతో వాన నీటి కోసం ఆకాశం వైపు చూస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆయకట్టులో కరువు ఛాయలు అలముకున్నాయి. ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజీకి దగ్గరలో ఉండటంతో నీటి విడుదల లేదు. కాలువల ద్వారా నీరు రాకపోవడంతో చాలా వరకు భూమినే సాగు చేయకపోగా, జూన్‌లో కురిసిన కొద్దిపాటి వర్షాలకు కొన్ని చోట్ల సాగు చేసిన వరి పొలాలు ఇప్పుడు ఎండిపోతున్నాయి. దీంతో పెద్ద ఎత్తున బోర్లు వేస్తున్నారు. ఈ మూడు నెలల్లో నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో వేల సంఖ్యలో బోర్లు వేశారు. మరికొంత మంది ఏళ్లతరబడి వాడకుండా వదిలేసిన పాత బావుల్లో పూడిక తీయిస్తున్నారు. పంటలను కాపాడుకునేందుకు సాగునీటి కోసం జిల్లా రైతులు భగీరథ ప్రయత్నం చేయాల్సి వస్తోంది.

20 ఏళ్ల నాటి పరిస్థితులు పునరావృతం?

సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలో 2001లో తీవ్ర కరువు నెలకొంది. ప్రాజెక్టులో నీళ్లు లేకపోవడంతో ఎడమ కాలువకు నీటిని విడుదల చేయలేదు. ఆ సమయంలో ఆయకట్టు ప్రాంతంలోని రైతులు అనేక బావులను తవ్వించారు. బోర్లను వేశారు. ప్రస్తుతం సాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్‌స్టోరేజీకి దగ్గరగా ఉంది. నాగార్జునసాగర్‌లో డెడ్ స్టోరేజీ 510 అడుగులు కాగా ప్రస్తుతం 524 అడుగుల నీరుంది. దానిని సాగునీటికి ఇచ్చే పరిస్థితి లేదు. పైనుంచి చుక్క నీరు రావడం లేదు. ఇప్పట్లో కాలువలకు నీటిని వదిలే పరిస్థితి లేదు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో సాగర్ ఆయకట్టు కింద 3,81,022 ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉన్నా, లక్షన్నర ఎకరాలే సాగైంది. ప్రస్తుతం వాటిని కాపాడుకునేందుకు రైతులు బావులు, బోర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ కనెక్షన్లన్నీ బోర్ల కోసమే!

➤ పంటలను కాపాడుకునేందుకు బోర్లను వేయిస్తున్న రైతులు అధిక సంఖ్యలో విద్యుత్ కనెక్షన్లు తీసుకుంటున్నారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఈ ఏడాది 8131 మంది రైతులు కొత్తగా విద్యుత్తు కనెక్షన్లకు దరఖాస్తు చేశారు. నల్లగొండ డివిజన్‌లో ఏప్రిల్ నుంచి ఆగస్టు నెలాఖరు వరకే 1737 మంది రైతులు కొత్తగా కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోగా, విద్యుత్ శాఖ 1556 మందికి కనెక్షన్లు జారీ చేసింది. దేవరకొండ డివిజన్‌లో 1003 మంది దరఖాస్తు చేసుకుంటే 725 మందికి కనెక్షన్లు ఇచ్చింది. మిర్యాలగూడ డివిజన్‌లో 1533 మంది దరఖాస్తు చేసుకుంటే 1101 మందికి, సూర్యాపేట డివిజన్‌లో ఈ ఏడాది కొత్త విద్యుత్తు కనెక్షన్ల కోసం 1974 దరఖాస్తులు రాగా, 1502 జారీ చేశారు. హుజూర్‌నగర్ డివిజన్‌లో 1884 దరఖాస్తులు రాగా, 1817 కనెక్షన్లు ఇచ్చారు.

పాత కనెక్షన్లు.. కొత్త బోర్లు

నల్లగొండ జిల్లాలోని త్రిపురారం, నిడమనూరు, పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), అనుముల, మిర్యాలగూడ, మాడ్గులపల్లి, వేములపల్లి, గరిడేపల్లి, హుజూర్‌నగర్, చిలుకూరు, కోదాడ, అనంతగిరి మండలాల్లో రైతులు పాత బావుల పూడిక తీయిస్తుండగా మరికొందరు, పాత బోర్లను బాగు చేసుకునే ప్రయత్నాల్లో పడ్డారు. ఇంకొంతమంది కొత్తగా బోర్లు వేస్తున్నారు. వాటితోపాటు కొత్తగా విద్యుత్ కనెక్షన్లు తీసుకుంటూ బోర్లు వేయిస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో 5 వేలకు పైగా బోర్లు వేయించినట్లు అంచనా. ఒక్కో బోరు వేయించేందుకు, విద్యుత్తు కనెక్షన్ తీసుకునేందుకు రూ. 60 వేల నుంచి రూ. లక్ష వరకు అదనంగా వెచ్చిస్తున్నారు.



త్రిపురారం పెద్దదేవులపల్లి చెరువుకు పెట్టిన మోటార్లు

‘గురుకుల’ అభ్యర్థులకు ఆప్షన్ చాన్స్!

- ఆన్‌లైన్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు మాత్రమే అవకాశం
- వెబ్‌సైట్ ద్వారా లాగిన్ అయ్యాక సొసైటీ ఆప్షన్ల ఎంపిక
- అదేవిధంగా జోనల్ ఆప్షన్లు కూడా ఇవ్వాల్సిందే
- టీఆర్ఈఐఆర్‌బీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: గురుకుల అర్హత పరీక్షలకు హాజరైన అభ్యర్థుల నుంచి తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) సొసైటీ, జోనల్ ప్రాధాన్యతలను స్వీకరిస్తోంది. వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్లు ఇచ్చేందుకు అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఇచ్చే ఆప్షన్లు తుది అవకాశంగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. ఈమేరకు గురుకుల బోర్డు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ మల్లయ్య బట్టు బుధవారం ప్రకటన విడుదల చేశారు.

ఒక్కసారే అవకాశం...

గురుకుల బోర్డు నిర్దేశించిన ప్రకారం అర్హత పరీక్షలు రాసిన అభ్యర్థులు మాత్రమే ఆప్షన్ల సమర్పణకు అవకాశం ఉంటుంది. బోర్డు నిర్దేశించిన తేదీల్లో ఆయా పోస్టులకు హాజరైన అభ్యర్థులు ముందుగా సొసైటీ ఆప్షన్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు సమర్పించే సొసైటీ ఆప్షన్ల వారీగా ప్రాధాన్యత ప్రకారం ఆయా సొసైటీల్లో పోస్టింగ్ ఇస్తారు. అదేవిధంగా జోనల్ ప్రాధాన్యతలకు కూడా ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రాధాన్యత క్రమంలో జోన్ల ఎంపికకు అనుగుణంగా అభ్యర్థులకు ఆయా జోన్లలో పోస్టింగ్ ఇస్తారు. సొసైటీలు, జోన్ల ఆప్షన్ల ఎంపికకు కేవలం ఒకే ఒక్కసారి మాత్రమే అవకాశం ఉంటుంది. ఒకసారి ఎంపిక చేసుకున్న తర్వాత వాటి సవరణకు ఎలాంటి అవకాశం ఉండదని గురుకుల బోర్డు స్పష్టం చేసింది. ఈక్రమంలో అత్యంత జాగ్రత్తగా ఆప్షన్లు సమర్పించాలని బోర్డు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సూచించారు.

ఆప్షన్ తేదీ	పోస్టు
సెప్టెంబర్ 21 నుంచి 30 వరకు	ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్
అక్టోబర్ 3 నుంచి 9 వరకు	పాఠశాలల్లోని లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్, డ్రాయింగ్, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లు

‘నవీన్ మిత్తల్’ ఎన్‌ఓసీ జారీపై 3న విచారణ: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ స్థలానికి సంబంధించి నవీన్ మిత్తల్ కమిటీ ఎన్‌ఓసీ జారీ చేసిన అంశంలో దర్యాప్తును మరో సంస్థకు అప్పగింతపై 3న విచారణ చేపడతామని హైకోర్టు స్పష్టం చేసింది. ధ్రువపత్రాలను సరిగ్గా పరిశీలించకుండానే రంగారెడ్డి జిల్లా గుడిమల్కాపూర్‌లోని 5,262 గజాల స్థలానికి ఎన్‌ఓసీ జారీ చేయడంపై దర్యాప్తును సిట్‌కు లేదా సీబీఐకి అప్పగించాలన్న మధ్యంతర పిటిషన్‌ను వచ్చే నెల 3కు వాయిదా వేసింది. శాంతి అగర్వాల్ కొనుగోలు చేసిన దాదాపు 5వేల గజాల స్థలానికి తప్పుడు పత్రాలు సమర్పించిన వారికి నవీన్ మిత్తల్ కమిటీ ఎన్‌ఓసీ ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ శాంతి 2011లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి ఎన్‌ఓసీ రద్దు చేస్తూ తీర్పునిచ్చారు. నవీన్ మిత్తల్, జాయింట్ కలెక్టర్ వి.వి.దుర్గాదాస్, తహసీల్దార్లు మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ తీర్పుపై 2017లో ప్రైవేటు వ్యక్తులతోపాటు అధికారులు అప్పీళ్లు వేశారు. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది.

విచారించే పరిధి మాకు లేదు

▶ మొదటి పేజీ తరువాయి

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పాత ప్రాజెక్టేనని, ఉమ్మడి రాష్ట్రంలోనే శ్రీకారం చుట్టారని తెలంగాణ చేసిన వాదనలను ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. గతేడాది డిసెంబర్ 8న ఏపీ ఈ కేసును దాఖలు చేయగా, రెండు రాష్ట్రాలు దాదాపు 4 నెలల పాటు ట్రిబ్యునల్ ముందు సుదీర్ఘ వాదనలు వినిపించాయి. ఈ జీవోతో ఏపీ రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఏపీ చేసిన వాదనలతో తెలంగాణ విభేదించింది.

గతంలో కేటాయింపులు జరపని ప్రాజెక్టులు మా పరిధిలోకి రావు..

రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 89 అమలు బాధ్యతలను కృష్ణా ట్రిబ్యునల్-2 చేపట్టిన నేపథ్యంలో.. తెలంగాణ జారీ చేసిన జీవోను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉపశమనం కల్పించే అధికారం ట్రిబ్యునల్‌కు మాత్రమే ఉందని ఏపీ ప్రభుత్వం చేసిన వాదనలను ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. గతంలో కృష్ణా ట్రిబ్యునల్-1, కృష్ణా ట్రిబ్యునల్-2 లు గంపగుత్తగా కేటాయింపులు జరిపిన ప్రాజెక్టులకు మళ్లీ నిర్దిష్ట కేటాయింపులు జరిపే అధికారాన్ని మాత్రమే రాష్ట్ర పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 కింద తమకు కేటాయించారని తెలిపింది. గతంలో ఏ ట్రిబ్యునల్ కూడా కేటాయింపులు జరపని ప్రాజెక్టులకు సంబంధించిన వివాదాలు తమ పరిధిలోకి రావని పేర్కొంది.

పునఃకేటాయింపులూ మా పరిధిలోనిది కాదు

ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పునః కేటాయింపులు జరిపే అంశం తమ పరిధిలో లేదని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. కేవలం రెండు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు నిర్దిష్ట కేటాయింపులు జరపడమే తమ బాధ్యత అని పునరుద్ఘాటించింది. కాగా సెక్షన్ 89 కింద ట్రిబ్యునల్‌కు పరిమిత అధికారాలే ఉన్నాయని, ఏపీకి మధ్యంతర ఉపశమనం కల్పించే అధికారం అపెక్స్ కౌన్సిల్‌కు మాత్రమే ఉందని తెలంగాణ వాదించింది. అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం 1956లోని సెక్షన్ 11 ప్రకారం జల వివాదాల విషయంలో సుప్రీం కోర్టుకు ఉన్న న్యాయ అధికారాలన్నీ ట్రిబ్యునల్‌కు ఉంటాయని 1993లో కావేరి ట్రిబ్యునల్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయాన్ని ఏపీ గుర్తు చేసింది. ఈ మేరకు అధికారాలను వినియోగించి మధ్యంతర ఉపశమనం కల్పించాలని ఏపీ విజ్ఞప్తి చేసింది. అయితే తమకు అప్పగించిన బాధ్యతలకు లోబడి మాత్రమే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. మరోవైపు రాష్ట్ర పునర్విభజన చట్టం 2014 వచ్చిన తర్వాత చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి వంటి కొత్త ప్రాజెక్టులు సెక్షన్ 89 కింద తమ పరిధిలోకి రావని కృష్ణా ట్రిబ్యునల్-2 తేల్చి చెప్పింది. ఇలావుండగా గతంలో గంపగుత్తగా కేటాయింపులు పొందిన ఏపీ, తెలంగాణలోని ప్రాజెక్టులకు సెక్షన్ 89 కింద నిర్దిష్ట కేటాయింపులు జరిపే అంశం ఇంకా ట్రిబ్యునల్‌లో విచారణ దశలోనే ఉంది. నిర్ణయం వచ్చే సరికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది.

పాలమూరు కొత్త ప్రాజెక్టే..

వేటిని కొత్త ప్రాజెక్టులుగా పరిగణించాలి అన్న అంశంపై రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో రూపొందించిన మార్గదర్శకాల ఆధారంగా పాలమూరుపై ట్రిబ్యునల్ నిర్ణయం తీసుకుంది. సాంకేతిక-ఆర్థిక సాధికారతపై కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మదింపు జరగని ప్రాజెక్టులు, టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ ఆమోదించని ప్రాజెక్టులను కొత్త ప్రాజెక్టులుగా పరిగణిస్తారు. ఇంటేక్ పాయింట్, ప్రాజెక్టు ప్రాంతం, కాల్వలు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, ఆయకట్టు ప్రాంతం, నిల్వ సామర్థ్యం, నీటి వినియోగం వంటి అంశాల్లో మార్పులు చోటు చేసుకున్నా కొత్త ప్రాజెక్టులుగానే పరిగణిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో 70 టీఎంసీల వరద జలాలను జూరాల ప్రాజెక్టు ఫోర్‌షోర్ నుంచి 10 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ప్రతిపాదించారు. అయితే తెలంగాణ వచ్చాక ప్రతిపాదనలను సమూలంగా మార్చివేశారు. శ్రీశైలం ప్రాజెక్టు ఫోర్‌షోర్ నుంచి 70 శాతం లభ్యత ఆధారంగా 90 టీఎంసీల నికర జలాలను తరలించేలా ప్రాజెక్టును ప్రతిపాదించిన నేపథ్యంలో దీనిని కొత్త ప్రాజెక్టుగా పరిగణిస్తున్నట్టు ట్రిబ్యునల్ స్పష్టం చేసింది.



సమావేశంలో మాట్లాడుతున్న అల్లం నారాయణ. చిత్రంలో జూలూరు గౌరీశంకర్, వకుళాభరణం కృష్ణమోహన్, వి.ప్రకాశ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు

పార్లమెంట్‌లో ఓబీసీ బిల్లు ఆమోదించాలి

- త్వరలోనే 33 జిల్లాల్లో బీసీ చైతన్య సదస్సులు.. కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా పోరాటం
- మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా పెట్టాలి
- బీసీ కులాలకు చెందిన కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ కమిషన్ సభ్యుల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: చట్టసభల్లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించే ఓబీసీ రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో వెంటనే ఆమోదించాలని బీసీ కులాలకు చెందిన ప్రభుత్వ కార్పొరేషన్ చైర్మన్లు, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌తో పాటు శాసనసభల్లో వెనుకబడిన తరగతులకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. బేగంపేట హరితప్లాజాలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం బీసీ కులాలకు చెందిన వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ కమిషన్ సభ్యులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. చట్టసభల్లో ఓబీసీలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ 2024లో సార్వత్రిక ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని మహిళా ఓటర్లను ఆకర్షించేందుకే బీజేపీ బిల్లు ఆమోదించిందని, ఈ బిల్లులో బీసీ మహిళల సబ్‌కోటా తేల్చలేదని ఆరోపించారు. 50శాతం ఉన్న బీసీలకు మహిళల కోటాలో 50శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణా వాటర్ రీసోర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వి.ప్రకాశ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి హోదాలో నరేంద్రమోదీ అగ్రకుల ఆధిపత్య అహంకారం ప్రదర్శిస్తున్నారని, ఆయన్ను బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిగా ప్రజలు పరిగణించడం లేదన్నారు. ఓబీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించడంతోపాటు, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలన్నారు. టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ బీసీ ప్రధానితో బీసీల తలరాత మారుతుందని భావించామని, కానీ అలా జరగలేదని, త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్ మాట్లాడుతూ బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, క్రిమిలేయర్ గైడ్‌లైన్స్ ప్రకారం ఆదాయ పరిమితి పెంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బీసీలను బీజేపీ రెండో శ్రేణి పౌరులుగా చూస్తుందన్నారు. వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ఆంజనేయగౌడ్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, పిట్టల రవీందర్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ డీఎన్ఏలోనే బీసీ వ్యతిరేకత ఉందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు తీరు నోటితో చెప్పి నొసటితో వెక్కిరించినట్టు ఉందని వారు మండిపడ్డారు. 33 జిల్లాల్లో బీసీ చైతన్య సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో వివిధ కార్పొరేషన్ చైర్మన్లు అనిల్ కుర్మాచలం, రవీందర్ సింగ్, బీసీ కమిషన్ సభ్యులు కిషోర్ గౌడ్, శుభప్రద్ పటేల్, నాయకులు తాడూరి శ్రీనివాస్, గోసుల శ్రీనివాస్ యాదవ్, జూలూరు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో కాంగ్రెస్ బస్సు యాత్ర

- తొలివారంలోనే మొదలు.. 10-12 రోజులు చేపట్టాలని నిర్ణయం
- రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలంతా పాల్గొనాలని స్క్రీనింగ్ కమిటీ భేటీలో నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ త్వరలో రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. వచ్చే నెల మొదటి వారంలో ఈ యాత్రను నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని కీలక నేతలంతా ఇందులో కలసి పాల్గొననున్నారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. నిజానికి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖరారు కోసం బుధ, గురువారాల్లో స్క్రీనింగ్ కమిటీ భేటీ జరపాలని టీపీసీసీ నిర్ణయించింది. ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో భాగంగా స్క్రీనింగ్ కమిటీ సభ్యులైన ఎంపీలు ఉత్తమ్, రేవంత్ ఢిల్లీలోనే ఉండటంతో.. అక్కడే రెండు రోజుల పాటు కసరత్తు పూర్తి చేసి.. అభ్యర్థుల షార్ట్ లిస్ట్ జాబితాను ఏఐసీసీకి ఇవ్వాలని భావించారు. కానీ మహిళా రిజర్వేషన్ బిల్లుపై లోక్‌సభలో జరిగిన ఓటింగ్ ప్రక్రియతో ఎంపీలు ఇద్దరూ అక్కడే ఉండిపోయారు. వారు లోక్‌సభ నుంచి వచ్చాక స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్, సభ్యులు ఠాక్రే, భట్టి తదితరులతో కలసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు బీఆర్ఎస్ పాలనా వైఫల్యాలను ఎండగట్టాలని తీర్మానించారు. అక్టోబర్ తొలివారంలో మొదలుపెట్టి, 10-12 రోజుల పాటు బస్సుయాత్ర చేపట్టాలని.. యాత్ర రూట్‌మ్యాప్, షెడ్యూల్‌ను త్వరలో ఖరారు చేయాలని నిర్ణయానికి వచ్చారు. ఇక గురువారం తిరిగి స్క్రీనింగ్ కమిటీ సమావేశమై అభ్యర్థుల ఖరారు కసరత్తు పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది.

కమిటీలోకి మరో ఇద్దరు..

స్క్రీనింగ్ కమిటీలోకి మరో ఇద్దరు నాయకులను తీసుకున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు.. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను స్క్రీనింగ్ కమిటీ సభ్యులుగా నియమించినట్టు గాంధీ భవన్ వర్గాలు వెల్లడించాయి.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

ఆర్.కృష్ణయ్య డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోలు కరెన్సీ నోట్లపై ముద్రించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో పోరాటానికి కూడా సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాలో కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్‌బీఐ ఏర్పడటానికి పునాది అయిన అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలన్నారు. పరశురామ్ మాట్లాడుతూ కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని ఐదేళ్ల నుంచి పాదయాత్ర, ప్రజా చైతన్య రథయాత్ర, జ్ఞాన యుద్ధ యాత్ర, ప్రజా చైతన్య యాత్ర, సైకిల్ యాత్ర నిర్వహించి ఢిల్లీలో 13 సార్లు ధర్నా నిర్వహించామని గుర్తుచేశారు.



మాట్లాడుతున్న కృష్ణయ్య. చిత్రంలో చెన్నయ్య

నేడు పార్లమెంట్ వద్ద ప్రదర్శన

మహిళా బిల్లులో బీసీల వాటా కేటాయించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పార్లమెంటు వద్ద భారీ ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళా బిల్లు నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీల మాదిరిగా బీసీల వాటాను స్పష్టం చేస్తూ బిల్లులో పొందుపర్చాలన్నారు. మహిళా బిల్లులో బీసీల వాటాపైనా అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

- మంద కృష్ణ మాదిగ డిమాండ్
- ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది: ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి తొమ్మిదిన్నరేళ్లు దాటినా బీజేపీ ప్రభుత్వం వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ పర్యటనలో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రతిపక్ష కాంగ్రెస్ వర్గీకరణకు సహకరించాలని, బిల్లుపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని మందకృష్ణ డిమాండ్ చేశారు. మందకృష్ణ పిలుపు మేరకు బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మాదిగ ఉద్యోగుల సంఘం, మాదిగ జర్నలిస్టుల ఫోరమ్, కర్ణాటక రాష్ట్ర ఎంఆర్‌పీఎస్ నాయకులు, మాదిగ లాయర్ ఫెడరేషన్‌ల ఆధ్వర్యంలో మహాధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ ఎప్పుడో జరగాల్సిన అంశం అని, దానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ. చిత్రంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు





అంగన్‌వాడీ కార్యకర్త జుట్టు పట్టుకుని లాగుతున్న ఎస్సై ధనశ్రీ

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

కలెక్టరేట్ల ముట్టడి ఉద్రిక్తం

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె.. డిమాండ్లు పరిష్కరించాలంటూ బైఠాయింపు

పలుచోట్ల లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నం.. పోలీసుల అడ్డగింత, అరెస్టులతో ఉద్రిక్తత

సాక్షి, హైదరాబాద్/ కైలాస్‌నగర్ (ఆదిలాబాద్)/ జగిత్యాల క్రైం/సుభాష్‌నగర్ (నిజామాబాద్): అంగన్‌వాడీల్లోని టీచర్లు, హెల్పర్లు తలపెట్టిన సమ్మె పదోరోజూ ఉధృతంగా కొనసాగింది. ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి నిర్వహించారు. టీచర్లు, హెల్పర్లు అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని పెద్దయెత్తున నినాదాలు చేశారు. ఈనెల 11వ తేదీ నుంచి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. అంగన్‌వాడీ టీచర్ల కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సర్వీసు పెన్షన్, ఆరోగ్య పథకాలు వర్తింపజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం టీచర్లు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్ల వద్ద ఆందోళనలకు దిగడంతో పోలీసులు వారిని నిలువరించి అరెస్టు చేశారు. ఈ క్రమంలో చాలాచోట్ల ఉద్యోగులు, పోలీసులకు మధ్య తోపులాటలు జరిగాయి.

ఆదిలాబాద్‌లో జుట్టు పట్టుకుని..

ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వందలాదిగా తరలివచ్చిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తోపులాటలో పలువురు అంగన్‌వాడీలు, పోలీసులకు గాయాలయ్యాయి. అంగన్‌వాడీలను నిలువరించే క్రమంలో తలమడుగు ఎస్సై ధనశ్రీ ఓ అంగన్‌వాడీ జుట్టు పట్టుకుని నెట్టివేసే ప్రయత్నం చేశారు. దీంతో పలువురు అంగన్‌వాడీలు ఎస్సై ధనశ్రీని జుట్టు పట్టుకుని లాక్కెళ్లారు. సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు పలువురిని పోలీసులు అరెస్టు చేసి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొంతమంది అంగన్‌వాడీలు స్టేషన్‌కు చేరుకుని బైఠాయించడంతో కొద్దిసేపటి తర్వాత వారిని విడుదల చేశారు. వారంతా తిరిగి కలెక్టరేట్ వద్దకు చేరుకుని నిరసన కొనసాగించడంతో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి వారి వద్దకు వచ్చి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కాగా సమ్మె శిబిరానికి చేరుకున్న తర్వాత బేల మండలం సదల్‌పూర్ అంగన్‌వాడీ టీచర్ ప్రగతి స్పృహ తప్పి పడిపోయింది. దీంతో ఆమెను రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

జగిత్యాలలో పోలీసులపై దాడి

➤ జగిత్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద ముట్టడి కూడా ఉద్రిక్తతకు దారితీసింది. అంగన్‌వాడీలు లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అంగన్‌వాడీలు బారికేడ్లను ధ్వంసం చేశారు. పోలీసులపై దాడికి దిగడంతో పలువురు గాయపడ్డారు. బాధిత పోలీసుల ఫిర్యాదు మేరకు పలువురు అంగన్‌వాడీలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రావు తదితరులు అంగన్‌వాడీల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌కు కూడా అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. వారితో పాటు సీఐటీయూ నాయకులు గేట్లు ఎక్కి లోనికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగి పలువురికి గాయాలయ్యాయి.

పీఆర్సీ బకాయిలు చెల్లించి బదిలీలు చేపట్టాలి

డీఎంఈ కార్యాలయం ఎదుట బోధనాస్పత్రుల వైద్యుల సంఘం నిరసన

సాక్షి, హైదరాబాద్: బోధనాస్పత్రుల్లో పనిచేస్తున్న ప్రభుత్వ డాక్టర్లకు తక్షణమే పీఆర్సీ బకాయిలను చెల్లించాలని తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్ల అసోసియేషన్ (టీటీజీడీఏ) డిమాండ్ చేసింది. తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం టీటీజీడీఏ ప్రతినిధులు డీఎంఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ...56 నెలలుగా పీఆర్సీ బకాయిలు చెల్లించలేదన్నారు. ఐదేళ్లుగా తమకు సాధారణ బదిలీలు నిర్వహించలేదని, పే ఫిక్సేషన్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కొత్త అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాక్టీసు బ్యాన్ అంశాన్ని పునఃపరిశీలించాలని కోరారు.

ఓఆర్ఆర్ లీజుపై విచారణ వాయిదా

- అక్టోబర్ 10వ తేదీకి వాయిదా వేసిన హైకోర్టు
- సర్కారుకు నిధుల బదిలీ ఆపాలన్న పిటిషనర్ న్యాయవాది
- ప్రభుత్వం వద్ద నిధులు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయన్న ఏజీ
- తుది ఉత్తర్వుల మేరకే నిధుల బదిలీ: హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: నెహ్రూ ఔటర్‌ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్వహణ, టోల్ వసూలు బాధ్యతలను 30 ఏళ్ల పాటు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ కంపెనీకి అప్పగింత, హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ)కు చెందిన నిధులను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయడం.. తుది ఉత్తర్వుల మేరకు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. 30 ఏళ్ల పాటు ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్వహణ, టోల్ వసూలు బాధ్యతల టెండర్‌ను రూ.7,380 కోట్లకు ఓ కంపెనీకి అప్పగించడంలో పారదర్శకత లేదంపిల్ దాఖలైంది. ఈ టెండర్‌ను ఐఆర్‌బీ కంపెనీ దక్కించుకున్న విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కనుగుల మహేశ్‌కుమార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ప్రాథమిక అంచనా రాయితీ విలువ (ఇనీషియల్ ఎస్టిమేటెడ్ కన్సెషన్ వాల్యూ) ఎంత అనేది వెల్లడించకుండా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, హెచ్‌ఎండీఏ కలసి ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకోవడం అక్రమమని పేర్కొన్నారు. దీనికి సంబంధించి అంచనా విలువను వెల్లడించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఒప్పందం వాస్తవ పరిస్థితిని పరిశీలించేలా కాగ్‌కు ఆదేశాలు ఇవ్వాలని, ఒకవేళ ఒప్పందం విలువ తక్కువగా ఉందని కాగ్ నిర్ధారిస్తే లీజును రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నిధుల బదిలీ చట్టవిరుద్ధమన్న పిటిషనర్ న్యాయవాది

దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. ప్రాథమిక అంచనా విలువను ప్రకటించకుండానే ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ లిమిటెడ్, ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్‌కు ఓఆర్ఆర్‌ను 30 ఏళ్లు అప్పగించారని చెప్పారు. ఈ ఒప్పందం ద్వారా వచ్చిన రూ.7,380 కోట్లను హెచ్‌ఎండీఏ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకునేలా ఏప్రిల్ 27న జీవో తీసుకొచ్చిందని.. ఈ జీవో హెచ్‌ఎండీఏ చట్టంలోని సెక్షన్ 40(1)(సీ)కి విరుద్ధమని వాదించారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని అభివృద్ధి పనులకు మాత్రమే ఆఆదాయాన్ని వెచ్చించాల్సి ఉందని వెల్లడించారు. ఇప్పటికే రూ.7 వేల కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వానికి చేరినట్లు తెలిసిందని, వాటిని ఖర్చు చేయకుండా స్టే ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తరఫున బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. సర్కార్ వద్ద డబ్బు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ కేసులో వాదనలు వినిపించడానికి సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను అక్టోబర్ 10వ తేదీకి వాయిదా వేసింది.

పెరికల సాధన సమితి సహాధ్యక్షుడిగా మల్లికార్జునరావు

సాక్షి, హైదరాబాద్: పెరికల కార్పొరేషన్ సాధన సమితి సహాధ్యక్షుడిగా కోట మల్లికార్జునరావు నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాన్ని రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య.. కోట మల్లికార్జునరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరికల రాజకీయ ఐక్యత, పెరికల కార్పొరేషన్ సాధన సమితి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, పెరికల వృత్తి అంతరించిపోవడం వల్ల ప్రభుత్వ పథకాలను పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పెరిక కుటుంబానికి పథకాలు అందేందుకు కృషి చేస్తామన్నారు.

'41-ఏ నోటీసులిచ్చి విచారణ చేపట్టండి'

సాక్షి, హైదరాబాద్: సినీ నటుడు నవదీప్‌ను విచారణ చేయాలని దర్యాప్తు అధికారులు భావిస్తే...చట్ట ప్రకారం ముందు సీఆర్‌పీసీ కింద సెక్షన్ 41ఏ నోటీసులు జారీ చేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు విచారించవచ్చని, ప్రశ్నలు అడగవచ్చని అయితే అరెస్టు సహా ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. గుడిమల్కాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని డ్రగ్స్ కేసులో పోలీసులు 13 మందిని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నవదీప్ వినియోగదారుడిగా ఉన్నారని.. అతడిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ నవదీప్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.సురేందర్ బుధవారం మరోసారి వాదనలు చేపట్టారు. వాదనల అనంతరం చట్టప్రకారం నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టాలని ఆదేశించారు.

పింఛన్ లబ్ధిదారు మరణిస్తే భార్య/భర్తకు వెంటనే పింఛన్: సీఎస్



సాక్షి, హైదరాబాద్: సామాజిక పెన్షన్ తీసుకుంటూ మరణించిన వారి స్థానంలో వారి భార్య లేదా భర్తకు తక్షణమే పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. ఆసరా పింఛన్లు, గృహలక్ష్మి, పంట రుణాల మాఫీ, ఎరువుల పంపిణీ, జీవో 58, 59 అమలు, సాంఘిక సంక్షేమం, ఇళ్ల స్థలాల పంపిణీ, తెలంగాణకు హరితహారం, గ్రామ పంచాయతీ భవనాలు, ఆయిల్‌పామ్ తోటలు తదితర అంశాల్లో సాధించిన ప్రగతిపై జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసీఆర్ సామాజిక పింఛన్ల మంజూరుపై నిత్యం సమీక్షిస్తున్నందున, పింఛన్ల ఖాళీల్లో దంపతుల్లోనే ఒకరికి వెంటనే మంజూరు చేయాలన్నారు. రైతు రుణ మాఫీకి ప్రభుత్వం రూ. 19,446 కేటాయించిందని, ఈ రుణమాఫీ ముమ్మరంగా కొనసాగుతోందన్నారు. రుణ మాఫీ పొందిన రైతులకు వెంటనే కొత్తగా పంట రుణాలను అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నిరుపేదలకు లబ్ధి చేకూర్చే జీవో 58 కింద స్వీకరించిన దరఖాస్తులను వారం రోజుల్లోగా దర్యాప్తు పూర్తి చేసి పట్టాలను అందచేయాలని ఆదేశించారు.

పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి సతీమణి మృతి

అనారోగ్యంతో కన్నుమూసిన స్రుజనమణి



స్రుజనమణి(ఫైల్)

చండూరు: మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి సతీమణి పాల్వాయి స్రుజనమణి (77) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. నల్లగొండ జిల్లా చండూరు మండల పరిధిలోని ఇడికూడ గ్రామంలో నివసిస్తున్న స్రుజనమణి.. కొంతకాలంగా ఆస్తమాతో బాధపడుతున్నారు. బుధవారం సాయంత్రం అనారోగ్యం తీవ్రంకావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుది శ్వాస విడిచారు. ఆమె భర్త పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి 2017 జూన్ 18న మృతిచెందారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. స్రుజనమణి అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం ఇడికూడలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఆయుధాలను ముందు సన్నద్ధం చేసుకోవడం,
సిద్ధంగా ఉండటమే సగం విజయం.
– మిగెల్ సెర్వాంటిజ్

సాక్షి
గురువారం, 21 సెప్టెంబర్ 2023

కెనడా వక్రబుద్ధి

దశాబ్దాలుగా సక్రమంగా లేని భారత్‌–కెనడా దౌత్య సంబంధాల్లో మరోసారి పెను తుపాను రేగింది. ఎప్పటిలాగే ఈసారి కూడా కెనడా ప్రవర్తనే ఈ పొరపొచ్చాలకు కారణమైంది. ఖలిస్తానీ ఉద్యమకారుడు హర్దీప్‌ సింగ్‌ నిజ్జార్‌ను మొన్న జూన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపిన ఉదంతంలో భారత ప్రభుత్వ ఏజెంట్ల ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్‌ ట్రూడో అక్కడి పార్లమెంటులో ఆరోపించారు. అంతేకాక ఈ విషయంలో భారత హైకమిషన్‌లో పనిచేస్తున్న ఒక అధికారిని ఆ దేశం బహిష్కరించింది. దీనికి ప్రతిచర్యగా మన దేశం కూడా ఢిల్లీలోని కెనడా హైకమిషన్‌లో పనిచేస్తున్న సీనియర్‌ దౌత్యవేత్తను దేశం విడిచివెళ్లాలని ఆదేశించింది. ట్రూడో ఆరోపణలు దురుద్దేశపూర్వకం, నిరాధారం అని కొట్టిపారేసింది. పనిలో పనిగా ఇరు దేశాలూ తమ తమ పౌరులకు హెచ్చరికలు జారీ చేశాయి. భారత్‌ వెళ్లే కెనడా పౌరులు అప్రమత్తంగా ఉండాలని అక్కడి ప్రభుత్వం సూచిస్తే, కెనడా సందర్శించే భారత్‌ పౌరులపై ఉగ్రవాదుల దాడులు జరిగే ప్రమాదం ఉన్నదని మన దేశం హెచ్చరించింది. దౌత్యవేత్తలను పరస్పరం బహిష్కరించుకోవటం వంటి ఉదంతాలు మనకు పాకిస్తాన్, చైనాలతోనే ఎక్కువ. 2013లో అమెరికాలోని న్యూయార్క్‌లో భారత్‌ డిప్యూటీ కాన్సుల్‌ జనరల్‌గా పనిచేస్తున్న దేవయాని ఖోబ్రగడే పట్ల అనుచితంగా ప్రవర్తించి సంకెళ్లు వేసి నిర్బంధించిన ఉదంతం తర్వాత మన దేశం అమెరికా దౌత్యవేత్తలకు అంతవరకూ ఉండే ప్రత్యేక సదుపాయాలను ఉపసంహరించింది.

గత కొంతకాలంగా కెనడాలో పాకిస్తాన్‌ గూఢచార సంస్థ ఐఎస్‌ఐ ప్రోద్బలంతో ఖలిస్తానీ ఉద్యమకారులు రెచ్చిపోతున్నారు. ఇదిలా కొనసాగితే ఇరు దేశాల దౌత్యసంబంధాలూ దెబ్బతినే ప్రమాదం ఉన్నదని దౌత్య నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఒక్క కెనడాయే కాదు... బ్రిటన్, ఆస్ట్రేలియాల్లో కూడా ఖలిస్తానీ ఉద్యమకారుల పోకడలు ఆందోళనకరంగానే ఉంటున్నాయి. భారత కార్యాలయాలపై, దేవాలయాలపై దాడులు, మన పౌరులను గాయపరచటం వంటి ఉదంతాలు చోటు చేసుకుంటున్నాయి. హింసాత్మక ఘటనలకు కారకులైనవారిపై చర్యలు తీసుకోవాలని మన దేశం కోరుతున్నా అక్కడి ప్రభుత్వాల స్పందన అంతంతమాత్రం. ఉద్యమకారులపై చర్యలు తీసుకోవటం మాట అటుంచి ఏకంగా మన ప్రభుత్వంపైనే కెనడా నిందారోపణలకు దిగింది. పాశ్చాత్య దేశాలు తమకు ముప్పు ముంచుకొచ్చినప్పుడు తప్ప ఇతర సమయాల్లో ప్రజాస్వామ్యం గురించి ప్రవచిస్తుంటాయి. 2001లో ఉగ్రవాదులు తమ దేశంలో పెనువిధ్వంసం సృష్టించి, వందలాది మంది మరణానికి కారకులయ్యాక అమెరికా గ్వాంటనామో బేలో శత్రు దుర్భేద్యమైన జైలు నిర్మించి కేవలం ఉగ్రవాదులన్న అనుమానంతో దశాబ్దాల తరబడి ఎందరినో ఏకాంతవాసంలో నిర్బంధించింది. ఇప్పటికీ ఆ జైల్లో ఎలాంటి విచారణ లేకుండా ఎందరో మగ్గిపోతున్నారు. అలాంటి దేశాలు భారత్‌కు సూక్తులు చెబుతున్నాయి. నిఘా వ్యవస్థల మధ్య సమాచారం ఇచ్చిపుచ్చుకొనేందుకు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్‌లు గతంలోనే 'ఫైవ్‌ అయిస్‌' (పంచ నేత్రాలు) పేరిట ఒక ఉమ్మడి వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాయి. ఖలిస్తానీ ఉద్యమకారుల ఆగడాల గురించి ఈ వ్యవస్థ వద్ద ఎలాంటి సమాచారం ఉందో తెలియదుగానీ...తాజాగా కెనడా చేసిన ఆరోపణలపై మాత్రం అందులోని అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాలు 'ఆందోళన' వ్యక్తం చేశాయి. ఈమధ్యే న్యూఢిల్లీలో జీ–20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయినప్పుడు నిజ్జార్‌ ఉదంతాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చానని ట్రూడో అంటున్నారు. మోదీ సైతం ఖలిస్తానీ వాదుల ఆగడాలపై ఆయనను ప్రశ్నించారు. నిజ్జార్‌ కేసు ఇంకా దర్యాప్తు దశలోనే ఉంది. ఈలోగానే ట్రూడో అంత బాధ్యతారహితంగా ఎలా మాట్లాడారన్నది ఆశ్చర్యకరం.

మొదటినుంచీ కెనడా అంతర్గత రాజకీయాలు భారత్‌–కెనడా సంబంధాలను శాసిస్తున్నాయి. కెనడాలో భారతీయుల సంఖ్య దాదాపు 14 లక్షలు. ఇది కెనడా జనాభాలో 3.7 శాతం. అందులో సగం మంది సిక్కులు. కొన్ని నియోజకవర్గాల్లో సిక్కు ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటం, వారిపై ఖలిస్తానీ ఉద్యమ ప్రభావం ఉండటం కెనడా రాజకీయాల్లో వారి ప్రాబల్యాన్ని పెంచింది. అందుకే కావొచ్చు...పంజాబ్‌లో 90వ దశకంలోనే అంతరించిన ఖలిస్తానీ ఉద్యమం ఇంకా అక్కడ సజీవంగా మనుగడలో ఉంది. 2021 ఎన్నికల్లో ట్రూడో నాయకత్వంలోని లిబరల్‌ పార్టీ మెజారిటీ సాధించలేక సిక్కు నేత జగ్మీత్‌సింగ్‌ నేతృత్వంలోని న్యూ డెమాక్రటిక్‌ పార్టీ(ఎన్‌డీపీ) మద్దతు తీసుకోవాల్సి వచ్చింది. అప్పటినుంచీ ఖలిస్తాన్‌ ఉద్యమకారుల విషయంలో కెనడా మరింత మెతకగా ఉంటోంది. కొత్తగా అమెరికా కనుసన్నల్లో ఏర్పాటైన ఇండో–పసిఫిక్‌ కూటమి తర్వాత భారత్‌తో భాగస్వామ్యం కోసం కెనడా తహతహలాడటం మొదలుపెట్టినా, ఖలిస్తానీ వాదులు ఆ ప్రయత్నాలను వమ్ము చేసేందుకు ఏదో ఒక ఎత్తుగడ వేస్తున్నారు. ఇప్పుడు హత్యకు గురైన నిజ్జార్‌ వివాదరహితుడేమీ కాదు. 2007లో పంజాబ్‌లోని ఒక సినిమా హాల్‌లో బాంబు దాడి మొదలుకొని ఇంతవరకూ 20 కేసుల్లో నిందితుడు. ఖలిస్తాన్‌ టైగర్‌ ఫోర్స్‌ చీఫ్. ఇతగాడే కాదు...అనేకమంది మాఫియా ముఠాల నేతలు కెనడాలో ఆశ్రయం తీసుకుంటూ భారత్‌లో నేరాలకు దిగుతున్నారు. వీరిని అప్పగించమని మన దేశం కోరుతున్నా కెనడా పెడచెవిన పెడుతోంది. కెనడా తీరుతెన్నులపై మన దేశం దౌత్య యుద్ధం సాగించాలి. జరుగుతున్నదేమిటో ప్రపంచ దేశాలకు వివరించాలి. కెనడాలో చదువులకూ, ఉపాధికీ వెళ్లిన మన పౌరుల ప్రయోజనాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి.

చరిత్ర అంటే బోర్డు మీది రాతా?

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

చరిత్ర అనేది బోర్డ్‌ మీద చాక్‌పీస్‌తో రాసిన రాత కాదు. ఎలా అంటే అలా చెరపడం, కొత్తది రాయడం కుదరదు. చరిత్ర తెలియనివాళ్లే ఇప్పుడు 'ఇండియా' స్థానంలోకి 'భారత్‌'ను తెస్తున్నారు. నిజానికి భారత్‌ అనే పదం ప్రాచీనమైనది కాదు. ప్రసిద్ధ చరిత్రకారులు తాము రాసిన చరిత్రకు 'ఇండియన్‌ హిస్టరీ' అనే పేరు పెట్టారు. వేదాల మీద ఆధారపడి చరిత్రను, సంస్కృతిని నిర్మించాలనుకునేవాళ్లు కేవలం వేదాల దగ్గరే ఇండియన్‌ హిస్టరీ ఉందనుకుంటున్నారు. అందువల్లే వారు భారతదేశ చరిత్రను కుదించాలని చూస్తున్నారు. అనేక భాషలు, సంస్కృతులు, జాతులు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యాంగ బద్ధమైన 'ఇండియా' నామవాచకాన్ని మార్చడం అహేతుకం.

కేంద్ర ప్రభుత్వం దేశాన్ని సంస్కృతీకరణకు గురి చేస్తోంది. దీనికి కారణం పాలకులకు భారతదేశ చరిత్ర తెలియకపోవడమే. నిజానికి భారత్‌ అనే పదం ప్రాచీనమైనది కాదు. ప్రసిద్ధ చరిత్రకారులు డి.డి. కోశాంబి, రొమిల్లా థాపర్, ఆర్‌.ఎస్‌. శర్మా, ఝూ, బి.ఎస్‌.ఎల్‌.హనుమంతరావు వంటి వారంతా తాము రాసిన చరిత్రకు 'ఇండియన్‌ హిస్టరీ' అనే పేరు పెట్టారు. మనం ఒకసారి ప్రపంచ దేశాలలో ఉన్న లైబ్రరీలను వీక్షిస్తే... ముఖ్యంగా లండన్‌ మ్యూజియం లైబ్రరీలో హిస్టరీ మీద ఒక శాఖ ఉంటుంది. కన్నెమెరా లైబ్రరీ దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందింది. ప్రపంచ దేశాల నుండి పరిశోధకులందరూ అక్కడికి వస్తారు. అక్కడ ఇండియా అంటేనే స్పందిస్తారు. 'భారత్‌' శబ్దం ఎక్కడా కనపడదు.

యక్షులు, కింపురుషులు, గంధర్వులు భారతదేశంలో ప్రాచీన జాతులు. ఈనాటి దళితులు వారి వారసులే. వారు నదీ దేవతలను సృష్టించారు. వెన్నెలను ఆరాధించారు. ఆర్యులు అంతకుముందు ఉన్నటువంటి జాతుల మొత్తం వారసత్వాన్ని తమదిగా చెప్పుకొన్నారు. దళితులకు సంబంధించిన అనేక చారిత్రక అంశాలను ఆర్యులు సొంతం చేసుకున్నారు. మనది 'సింధూ నాగరికత' అంటారు. సింధూ శబ్దం అతి ప్రాచీనమైనది. ఇండియాలో మానవ జాతి పరిణామానికి సంబంధించిన ప్రాచీన పరిణామ దశలన్నీ దళితుల్లో కనిపిస్తున్నాయి. మోర్గాన్‌ చెప్పినట్టు మానవజాతి పరిణామంలో జీవనోపాధి, ఆహారం, పాలనాంగం, ప్రభుత్వం, భాష, కుటుంబం, మతం, గృహనిర్మాణం, సంపద కీలకపాత్ర వహిస్తాయి. ఈ దశలన్నీ దళితుల జీవన విధానంలో ఉండడం వలన, బి.ఆర్‌. అంబేడ్కర్‌ నిర్వచించినట్లుగా వీరు ఇండియన్స్‌ అనేది నిర్ధారణ అవుతుంది.

హిందువుల మత సాహిత్యంలో వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, సూత్రాలు, ఇతిహాసాలు, స్మృతులు, పురాణాలు ఉన్నాయి. వేద బ్రాహ్మణులు వేదాలకూ, ఇతర రకాల మత సాహిత్యానికీ మధ్య ప్రత్యేకత చూపాలని అభిప్రాయపడ్డారు. వేదాలను ఉన్నతమైనవిగా మాత్రమే కాకుండా పవిత్రమైనవిగా,



తిరుగులేనివిగా చేశారు. చరిత్రకు మూలమైన శాసనాలు, వ్రాత ప్రతుల వంటి వాటిని పేర్కొనకుండా కేవలం వేదాల మీద ఆధారపడి చరిత్రను, సంస్కృతిని నిర్మించాలనుకునే సనాతన భావజాలకర్తలు కేవలం వేదాల దగ్గరే ఇండియన్‌ హిస్టరీ ఉందనుకుంటున్నారు. అందువల్లే వారు భారతదేశ చరిత్రను కుదించాలని చూస్తున్నారు.

దక్షిణ భారత భాషల్లో ఏ భాషలోనూ భారత శబ్దం లేదు. ఇండియన్‌ లాంగ్వేజెస్‌ పుట్టు పూర్వోత్తరాల మీద కృషి చేసిన వారెవ్వరూ భారత్‌ శబ్దాన్ని పేర్కొనలేదు. నిజానికి తెలుగు, తమిళం, కన్నడం, మలయాళ భాషలకు మూలం ద్రావిడ భాషే. అయితే అవి 21 భాషలుగా అభివృద్ధి చెందాయి. వాఙ్మయ దృష్టితో కాకుండా, భాషా చారిత్రక దృష్టితో చూస్తే మధ్య ద్రావిడ ప్రాచీనమైనది. తెలుగు భాష ప్రభావం ఇప్పటికీ తెలుగు తెగలమీద ఉండటాన్ని గమనించాలి. ముఖ్యంగా కోయ భాషలో ఎన్నో తెలుగు పదాలున్నాయి. కోయ భాషమీద పరిశోధన చేసిన జె.కాయన్‌ ఈ విషయాన్ని చెప్పారు. కోయ జాతి అతి ప్రాచీనమైనదని సామాజిక శాస్త్ర చరిత్ర చెప్తున్న సత్యం. ఈ కోయ భాషలో విశేషంగా తెలుగు ఉండడం వల్ల రాతలేని తెలుగు అతి పురాతన కాలంలోనే ఉందని మనకు అర్థమౌతుంది. తెలుగు భాష ప్రాచీనతను తెలుసుకోవాలంటే, మనం తెలుగులో అతి ప్రాచీనులైన తెగలను పరిశీలించవలసిందే.

ఇకపోతే ఆంధ్రజాతిని నాగులుగా పిలవడం, నాగజాతికీ, ఆర్య జాతికీ ఉన్న వైరుధ్యం భారతంలో వర్ణించబడింది. ప్రసిద్ధ చరిత్రకారులు బి.ఎస్‌.ఎల్‌. హనుమంతరావు తన ఆంధ్రుల చరిత్రలో ఆంధ్రులు ఋగ్వేద కాలం నాటివారనీ, వారు నాగులుగా ఆర్యులతో పోరాడారనీ, ఖాండవ వన దహనం, సర్పయాగం తరువాత వింధ్య పర్వతాల ఇవతలికి వచ్చారనీ, వారే ఆంధ్రులుగా పిలువబడ్డారనీ రాశారు. నాగులకు, ఆర్యులకు జరిగిన తీవ్ర సంఘర్షణలో 'ఖాండవ దహనం', జనమేజయుడి 'సర్పయాగం' రెండు ముఖ్య ఘట్టాలు. ఈ ప్రమాదం నుండి తప్పించుకొన్న నాగులు దక్షిణంగా వలసవచ్చి కృష్ణా ముఖద్వారంలో స్థిరపడి ఉంటారు. అమరావతీ శిల్పాలలోని రాజులకు, రాణులకున్న సర్ప కిరీటాలు వారి జాతీయతకు చిహ్నాలే.

ఈ చారిత్రక ఆధారాలను బట్టి చూస్తే, భారత్‌ కంటే 'ఇండియా'యే పురాతనమైనది. భారత్‌ శబ్దం వలన ఇండియా తన ఐడెంటిటీని కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది మనకు చాలా నష్టం. భారత దేశం, హిందూదేశం, ఇండియా... ఈ మూడు పేర్లలో జాతి, మత, లింగ, కుల, వర్ణ, ప్రాంతాలకు అతీతమైన పేరు ఇండియా. అంబేడ్కర్, పూలే, పెరియార్‌ ఈ దృక్పథంతోనే తమ గ్రంథాలు రాశారు.

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వ హిందూ పరిషత్‌ ఇండియాను వెనక్కి తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తున్నాయి. ఇది వారికి కూడా నష్టమే. అందరికీ నష్టమే. చరిత్ర అనేది బోర్డ్‌ మీద చాక్‌పీస్‌తో రాసిన రాత కాదు. ప్రపంచం అంతా ఇండియా వైపు చూస్తున్నా, సంస్కృతీకరణ ద్వారా దేశీయ ప్రజలను అవమానిస్తున్నారు. అనేక భాషలు, సంస్కృతులు, జాతులు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యాంగ బద్ధమైన 'ఇండియా' నామ వాచకాన్ని మార్చడం అహేతుకం. దేశంలోని ప్రజాస్వామ్య, లౌకికవాద, సామ్యవాద శక్తులందరూ ఇండియాను బలపరుస్తున్నారు. అధిక జనుల అభిప్రాయమే చారిత్రక సత్యం. పేర్లు మార్చడం ద్వారా చరిత్ర మారదు.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్‌ మీడియా

మరో మాయ



ఎంత మాయ! మహిళా రిజర్వేషన్‌ బిల్లు ఇప్పుడు అమల్లోకి రాదంటే, ఎప్పటికీ రాదనేది కచ్చితం. మనసుంటే మార్గముంటుంది.

– సయేమా, రేడియో జాకీ

దానికోసమైనా...



ప్రపంచంలోని అందరు మూర్ఖులనూ మనం పెంచి పోషించుకోవాలి. వాళ్లు లేకపోతే మనల్ని ఎవరూ తెలివైనవాళ్లుగా పరిగణించరు.

– రిక్కీ గెర్వాయిస్, కమెడియన్‌

పనికిరాని వాదం



రాజ్యాంగ ప్రవేశికలో 'సామ్యవాదం' అనే పదం అదనంగా చేరింది. మూలంలో అది లేదు. ఇది భారత రాజ్యాన్ని కొన్ని ఆర్థిక విధానాలను పాటించేలా బంధిస్తోంది. సామ్యవాదం అనేది ఇండియాకు ఏ మంచీ చేయలేదు. సామ్యవాదం చెడ్డ ఆర్థికశాస్త్రం. ఈ పదాన్ని ప్రవేశిక నుంచి పార్లమెంట్‌ తొలగించాలి.

– దిలీప్‌ మండల్, సంపాదకుడు

ఎంత క్షోభ!



ఇది హృదయాన్ని ముక్కలు చేస్తోంది. వారి కుటుంబం ఏం అనుభవిస్తున్నదో అవగతం చేసుకోలేకున్నాను. విజయ్‌ ఆంటోనీ సర్, ఆయన కుటుంబానికి నా హృదయపూర్వక సానుభూతి. మీకు అపారమైన శక్తి కలగాలని ప్రార్థిస్తున్నాను. మీరా ఆత్మకు శాంతి కలగాలి.

– సాయి పల్లవి, నటి

మరింత రుచికరం



పదేళ్ల కింద ఈరోజు (2013 సెప్టెంబర్‌ 20) ఇండియాలో 'ద లంచ్‌బాక్స్‌' సినిమా విడుదలైంది. కేవలం విధివశాత్తూ ఎక్కిన ఈ రైలు నన్ను ఇప్పటికీ అన్ని మంచి స్టేషన్లకు తీసుకునిపోతూనే ఉంది. సువాసన పెరుగుతోంది. మరింత రుచికరం అవుతోంది. ప్రేమ తీవ్రమవుతోంది. సినిమా మ్యాజిక్‌ వర్ధిల్లాలి.

– నిమ్రత్‌ కౌర్, నటి

అక్కడే నయం



ఏమైనాగానీ, కఠిన సత్యం ఏమిటంటే, ఇండియాలోని కెనడియన్‌ కన్నా, కెనడాలోని భారతీయుడు మరింత సురక్షితం. చెప్పాలంటే, ఇండియాలోని ఇండియన్‌ కన్నా కూడా. ఎప్పటినుంచో వేర్పాటువాద తీవ్రవాదులు, బొద్దింకలకు కెనడా నిలయంగా మారినప్పటికీ ఇదే నిజం.

– అమిత్‌ పాండీలియా, కాలమిస్ట్‌

చేజేతులా...



సాధారణంగా, ఆంగ్ల దేశాలన్నీ తమ ఉమ్మడి ప్రయోజనాల కోసం స్నేహంగా ఉంటాయి. కానీ ఇండియా విషయానికి వస్తే, (కెనడా ప్రధాని) ట్రూడోకు యూఎస్, యూకే, ఆస్ట్రేలియా పెద్దగా మద్దతివ్వలేదు. తన ఆరోపణలకు సాక్ష్యాలు చూపని కారణంగా సొంత దేశంలోనూ విమర్శ ఎదుర్కొంటున్నారు. అందుకే ఆయన వెనక్కి తగ్గుతున్నారు. కానీ ఇప్పటికే ఆలస్యమైంది. భారత్‌తో మంచి సంబంధాలు తిరిగి నెలకొల్పుకోవడం కష్టతరం.

– బ్రహ్మ చెల్లానీ, విశ్లేషకుడు

సాక్షి ఎడిటోరియల్‌ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్‌: editpage@sakshi.com

గీతన్నల గోడు పట్టదా?

సందర్భం



మేకపోతుల వెంకటరమణ

తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. తాళ్లు ఎక్కే క్రమంలో ప్రమాదం జరిగి వందలాదిమంది చనిపోతున్నారు. కాళ్లు చేతులు విరుగుతున్నాయి. నడుములు పడిపోయి మంచాన పడుతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే సంవత్సరానికి సుమారు 550 మంది చెట్లపై నుంచి జారి పడుతున్నారు. ఇంత ప్రమాదం ఏ వృత్తిలోనూ లేదు. వీరిని ఈ ప్రమాదాల నుండి కాపాడాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్‌ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన 'గౌడ ఆత్మీయ సమ్మేళనం'లో కేటీఆర్‌ ప్రమాదాలు నివారించే చర్యలు తీసుకుంటామనీ, గీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనాలు ఇస్తామనీ, లిక్కర్‌ షాపులలో గౌడులకు ఇచ్చే 15 శాతం రిజర్వేషన్‌లు సొసైటీలకు ఇస్తామనీ, 'గీతన్న బీమా పథకం' వంటివి పొందటంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామనీ హామీ ఇచ్చారు. కాని, వాటిని నేటి వరకు అమలు చేయలేదు.



అంతకు ముందు హామీ ఇచ్చినట్లు ఇటీవల జరిగిన లిక్కర్‌ షాప్‌ టెండర్లలో సొసైటీలకు రిజర్వేషన్స్‌ కల్పించకుండా పాత పద్ధతినే కొనసాగించారు. మోపెడ్‌లు ఇస్తారని గత రెండు సంవత్సరాల నుండి ఆశతో ఎదురుచూస్తున్న కల్లు గీత కార్మికులకు నిరాశే మిగిలింది. 2023–24 బడ్జెట్‌ సందర్భంగా ఆర్థిక మంత్రి హరీష్‌ రావు అసెంబ్లీలో మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమానికి రూ. 100 కోట్లు కేటాయించామని చెప్పారు. బడ్జెట్‌ పత్రంలో మాత్రం 30 కోట్లు కేటాయించారు. ఆరు నెలలు అవుతున్నా ఇప్పటికీ వాటిలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. 'కల్లు గీత కార్పొరేషన్‌' పేరుకు మాత్రమే ఉంది. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం 9 సంవత్సరాల తర్వాత కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించింది. దీని వలన వారి రాజకీయ ప్రయోజనం నెరవేరింది తప్ప గీత కార్మికులకు అదనపు ప్రయోజనం ఒనకూడింది లేదు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌ ఇటీవల ప్రకటించిన 'గీతన్న బీమా' అమలు కావడం లేదు. ఇటీవల బీసీ కుల వృత్తిదారులకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటన చేసి జీఓ విడుదల చేయగానే గీత కార్మికులు 13 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. గడువు సమయం కొద్ది రోజులే ఉండటం వలన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందకపోవడంతో చాలా మంది దరఖాస్తు చేసుకోలేక పోయారు. వీరిలో ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఈ పథకం అమలు చేయలేదు.

గీతకార్మికులు ప్రధానంగా చేస్తున్న డిమాండ్లు: ఎక్స్‌గ్రేషియా యధావిధిగా కొనసాగిస్తూనే ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించిన 'గీతన్న బీమా' అమలు చేయాలి, ప్రతి సొసైటీకి 5 ఎకరాల భూమి ఇవ్వాలని ఉన్న 560 జీఓ అమలు చేయాలి. తాటి, ఈత, జీలుగు, ఖర్జూర తదితర కల్లునిచ్చే పొట్టి చెట్లు నాటాలి. ఏజెన్సీ ఏరియాలో సొసైటీలను పునరుద్ధరించి సంక్షేమ పథకాలు వారికీ వర్తింపచేయాలి. 2023–24లో గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌ వెంటనే విడుదల చేయాలి. తాటి, ఈత చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా కొత్త చట్టం తీసుకురావాలి. వృత్తిలో ఎక్కడ ప్రమాదానికి గురై చనిపోయినా వారి కుటుంబాలకూ, శాశ్వత వికలాంగులకూ 10 లక్షలు, తాత్కాలిక వికలాంగులకు లక్ష రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. 'మెడికల్‌ బోర్డు' విధానం తొలగించాలి. చనిపోయిన వారి పిల్లలకు ఉచిత విద్య, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించాలి. వృత్తి పెన్షన్‌ రూ. 5 వేలకు పెంచాలి. వేతన గీత కార్మికులకు అసోషియేట్‌ మెంబర్‌షిప్‌ ఇవ్వాలి. కల్లుగీత కార్పొరేషన్‌ నుండి వృత్తిలో చనిపోయిన వారి కుటుంబాలకు ఇస్తున్న తక్షణ సహాయం పెంచాలి.

వీటి కోసం 2023 జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్‌ కార్యాలయాల ముందు వేలాదిమంది గీత కార్మికులతో ధర్నాలు నిర్వహించాము. ప్రభుత్వం కొన్ని కంటి తుడుపు చర్యలు చేపట్టింది తప్ప ప్రధాన సమస్యలు అలాగే ఉన్నాయి. సమస్యలు పరిష్కార మయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సెప్టెంబర్‌ 22న ఇందిరా పార్కు వద్ద 'మహాధర్నా'కు పిలుపు నిచ్చాము.

వ్యాసకర్త తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు

ఆస్తులూ అప్పులే కాదు...

తూర్పు తీరం



కె.ఎన్‌. మల్లీశ్వరి

మునిమాపు వేళ రాజమండ్రిలోని తెలుగు విశ్వవిద్యాలయం (తెవివి), సాహిత్యపీఠంలో అడుగు మోపినపుడు మూడు దశాబ్దాల కిందటి జ్ఞాపకాలు చుట్టుముట్టాయి. 'అదొక వైభవోజ్జ్వల మహాయుగం... వల్లకాటి అధ్వాన్నశకం'. రెంటినీ ఇదే కళ్ళతో చూడాల్సి వచ్చినపుడు చరిత్ర, శిథిల బిందువులుగా బుగ్గల మీదకి జాల్వారింది. పాఠాలు చెప్పి, పరిశోధనకి చెయ్యందించి, సృజనకి తోవ చూపిన మహామహులైన గురుమిత్రులు, ఇక్కడ చదివి సాహిత్యకారులుగా పేరు పొందిన అనేకమంది విద్యార్థులు, పరిశోధకుల అడుగుజాడల కోసం రాపాడుతూ తిరిగాను. ఏముందక్కడ! ఒకపుడు యూనివర్సిటీ మెస్‌లో నలభీముడిలా అందరికీ వండి పెట్టిన వ్యక్తి ఈ రోజు వాచ్‌మాన్‌లా మారి ముఖద్వారం వద్ద నిస్తేజంగా కూచుని ఉండడం సమస్తాన్నీ అర్థం చేయించింది.

ఆంధ్రప్రదేశ్‌ విభజన చట్టంలో షెడ్యూళ్లు 9–10లలో ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లు, రాష్ట్ర ప్రభుత్వ శిక్షణ సంస్థలు, విద్యాసంస్థల వంటివి ఉమ్మడిగా ఉన్నాయి. విభజన చట్టం ప్రకారం తొమ్మిదో షెడ్యూల్లోని 89 సంస్థలు, పదో షెడ్యూల్లోని 107 సంస్థలు కలిసి దాదాపు 200 సంస్థలని ఆస్తులూ అప్పులు, ఖర్చులు, మిగుళ్ళుగా రాష్ట్రాలు పంచుకోవాలి. మరొక ఎనిమిది నెలల్లో ఆ గడువూ ముగుస్తుంది. ఇప్పటివరకూ ఎన్ని పరిష్కారం అయ్యాయో తెలీదు. ఎన్ని సంస్థలు వాటి ప్రాభవాన్ని కోల్పోయాయో తెలీదు. ఇన్ని విభజన సమస్యల నుంచి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని సాహిత్యపీఠం ఉదాహరణ ఒకటి తీసుకున్నాను. సామాజిక శాస్త్రాలు విద్యారంగం నుంచి మెల్లగా తొలిగి పోతున్న వేళ తెలుగు భాషా సాహిత్యాలు, కళల కోసం ఒక యూనివర్సిటీ ఉండడం అనేది 1985 నాటికి అబ్బురంగా ఉండేది. ఉమ్మడిగా ఉన్నపుడు హైదరాబాద్‌ కేంద్రంగా తెవివిలోని అన్ని శాఖలూ ప్రభావవంతంగా పని చేశాయి.

రాజమండ్రి దగ్గర బొమ్మూరు మిట్టమీద ఉన్న సాహిత్యపీఠం గత తొమ్మిదేళ్లుగా నిర్వ్యాపకంగా మారి ఈరోజు మూసి వేయాల్సిన పరిస్థితికి వచ్చింది. 2014 నాటి రాష్ట్ర ప్రభుత్వం తెలుగు యూనివర్సిటీని రాజమండ్రికి తరలించి ఇక్కడ ప్రధాన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని అప్పటి పుష్కరాల సందర్భంగా చెప్పింది. తరలింపు సంగతి సరే శ్రీశైలం, కూచిపూడి, బొమ్మూరు కేంద్రాల నిర్వహణ కూడా గగనం అయిపోయింది. రెండు రాష్ట్రాలలోని అన్ని తెవివి కేంద్రాల సాంకేతిక నిర్వహణ హైదరాబాద్‌ శాఖ చూసుకునేట్లు, ఏపీ శాఖల జీతభత్యాలు, ఇతర ఖర్చులు ఏపీ ప్రభుత్వం భరించేట్లు ఒప్పందం కుదిరింది. నిజంగా అప్పటి ఏపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ ఒప్పందంలోని లొసుగులను అర్థం చేసుకుని ఉండేది.



హైదరాబాద్‌ నగరం నడిబొడ్డున విలువైన స్థలంలో ఉన్న కేంద్రాన్ని మరోచోటికి తరలించడం మీద, తమ కేంద్రాల బాగోగుల మీద ఉన్న శ్రద్ధ, దూరాబారాన, అందునా ఏపీలో ఉన్న కేంద్రాల మీద తెలంగాణ ప్రభుత్వానికి ఉంటుందని ఆశించడమే ఒక తప్పు. సాంకేతిక నిర్వహణ అంటే సెమిస్టర్లు, పరీక్షలు, మార్కులు మాత్రమే కాదు, ఆయా కేంద్రాల ఉన్నతిని కాపాడుకోవడం, క్షీణిస్తున్నపుడు చేయందించి నిలబెట్టడం. అటువంటి బాధ్యతని హైదరాబాద్‌ కేంద్రం తీసుకుని ఉంటే ఈరోజు ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేని విద్యాసంస్థగా సాహిత్య పీఠం వెలికి గురయ్యేది కాదు, పట్టుమని పదిమంది విద్యార్థులు లేకుండా బోసిపోయేది కాదు. సినారె, నాయని కృష్ణకుమారి, తూమాటి దొణప్ప, బాలాంత్రపు రజనీ, ఆర్వీయస్‌ సుందరం, బేతవోలు, జయధీర్‌ తిరుమలరావు, ఎండ్లూరి వంటి ఉపాధ్యాయుల నుంచి అనేకమంది తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సాహిత్యకారులు, తాము విద్యార్థులుగా ఉన్నపుడు ఎంతో నేర్చుకున్నారు. తెలంగాణ ప్రాంతపు పరిశోధకులు విలువైన పరిశోధనా గ్రంథాలను ఈ కేంద్రం ద్వారా తీసుకువచ్చారు. తెలంగాణ సమాజం గర్వపడే 'తెలంగాణ సాహిత్య వికాసం' పరిశోధన బొమ్మూరు సాహిత్య పీఠంలోనే జరిగింది. ఇదే పద్ధతిలో ఏపీ నుంచి కూడా హైదరాబాద్, వరంగల్‌ కేంద్రాలలో చాలామంది చదువుకున్నారు. తమ వ్యక్తిత్వాలకి కొత్త పాదులు తీసిన యూనివర్సిటీల పట్ల విద్యార్థులకి చాలా కృతజ్ఞత ఉంటుంది. వాటి గురించి జీవితకాలం గొప్పగా చెప్పుకోవడం ఉంటుంది. అవి మరింత ఎదిగితే 'మేమిక్కడే చదివా'మని మురిసిపోవడం ఉంటుంది. మోడువారుతుంటే విలవిల్లాడటం ఉంటుంది. 9–10 షెడ్యూళ్లలో ఉన్నవి ఆస్తులూ అప్పులే కాదు, వాటి వెనుక బలమైన చారిత్రక అంశ ఉంటుంది. ఆర్థికమే అంతిమం కావొచ్చు కానీ యూనివర్సిటీలంటే ఇన్నేసి ఎకరాల ఆస్తి అని గర్వపడే విద్యార్థులు ఎవరూ ఉండరు.

సమాజపు ప్రగతిని కొలవడానికి విశ్వవిద్యాలయాల చరిత్ర కూడా చాలా ముఖ్యం. ఎంతో ప్రభావాన్ని చూపిన విశ్వవిద్యాలయ కేంద్రాలు మూతపడటం అంటే ఈ నిర్వహణలో భాగం అయిన ప్రతి వ్యవస్థకీ అవమానం, తిరోగమనం. నలభై యాభై ఎకరాల భూమి విలువ కన్నా వేలాది విద్యార్థులు సాహిత్య కళారంగాల్లో ప్రతిభావంతులు కావడమే సమాజానికి ఎక్కువ విలువైనది. ఏపీ శాఖలను మళ్ళీ నిలబెట్టే ప్రయత్నం 2024 తర్వాత కేవలం ఏపీ ప్రభుత్వానిదే కావొచ్చు. కానీ రెండు రాష్ట్రాల మధ్య 'తెవివి' లెక్క తేల్చాల్సి వచ్చినపుడు ఒప్పందం ప్రకారం హైదరాబాద్‌ కేంద్రానికి అప్పజెప్పిన నిర్వహణ బాధ్యతని ఎంత సమర్థవంతంగా చేశారన్న ప్రశ్నతో మొదలు పెట్టాల్సి ఉంటుంది.

వ్యాసకర్త బొమ్మూరు సాహిత్యపీఠం పూర్వ విద్యార్థి, పరిశోధకురాలు
malleswari.kn2008@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్‌ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.షష్ఠి ఉ.10.09 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** అనూరాధ ప.12.50 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** సా.6.20 నుండి 7.54 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.53 నుండి 10.42 వరకు, తదుపరి ప.2.44 నుండి 3.32 వరకు, **అమృతఘడియలు:** రా.3.46 నుండి 5.20 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.52, **సూర్యాస్తమయం:** 5.57.

డిమాండ్లు పరిష్కరించండి..లేదంటే సమ్మెకు వెళ్తాం

- పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌కు తెలంగాణ ఈ–పంచాయతీ టెక్నికల్ వింగ్ వినతి
- డీపీఎంలకు పేస్కేళ్లు, ఈ–పంచాయతీ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పించాలి

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్ శాఖలోని టెక్నికల్ వ్యవస్థలో 13 ఏళ్లుగా పనిచేస్తున్న 33 మంది జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ల పేస్కేళ్లు, గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న 1,619 మంది ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ లేదా తత్సమాన హోదా కల్పించాలని తెలంగాణ ఈ–పంచాయతీ టెక్నికల్ వింగ్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. దీంతోపాటు వీరికి కనీసవేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే అన్ని వసతులను తమకు కూడా వర్తింపజేయాలని కోరారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. తమ డిమాండ్లను వారంలోగా పరిష్కరించని పక్షంలో తామంతా సమ్మెకు కూడా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు.

చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం

- 'రెరా' చైర్మన్ సత్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: 'రెరా'రిజిస్ట్రేషన్ లేకుండా చేపట్టిన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులపై ఫిర్యాదులు అందితే పరిశీలించి, చట్టప్రకారం తగు చర్యలు తీసుకుంటామని సంస్థ చైర్మన్ ఎస్.సత్యనారాయణ అన్నారు. బుధవారం రాష్ట్ర మున్సిపల్ పరిపాలనాశాఖ కమిషనర్, డైరెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, మేనేజర్లు, ప్లానింగ్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, రీజనల్ మున్సిపల్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. రెరా చట్టం ప్రాధాన్యతతో పాటు రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, జవాబుదారీతనంతో కొనుగోలుదారులకు వర్తించే హక్కులను మున్సిపల్ అధికారులకు ఆయన వివరించారు. ఎట్టి పరిస్థితిలోను రియల్టర్లు, ప్రమోటర్లు, 'రెరా'రిజిస్ట్రేషన్ లేకుండా ప్రచార కార్యక్రమాలు నిర్వహించకుండా చూడాలని, కొనుగోలుదారులను మభ్యపెట్టకుండా కఠినంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్లకు సూచించారు. సామాజిక మాధ్యమాలలోను 'రెరా'రిజిస్ట్రేషన్ లేకుండా ప్రకటనలు రాకుండా చూడాలని, ప్రీలాంచ్‌లు నిషేధమని గమనించాలని అన్నారు. రెరా చట్టాన్ని ఉల్లంఘిస్తే అపరాధ రుసుముతో పాటు జైలు శిక్ష కూడా పడుతుందని, ఈ విషయాలు మున్సిపల్ పరిధిలో స్థానిక సంస్థలన్నీ అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ తదితర జిల్లాల అదనపు కలెక్టర్లతో ఆయన మాట్లాడి రియల్ ఎస్టేట్ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

నా సీటు కోల్పోవాల్సి వచ్చినా సిద్ధమే..!

- జీవితం చాలాచిన్నది.. నా పాత్ర పోషించాననే అనుకుంటున్నా
- పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు..మనస్ఫూర్తిగా స్వాగతం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'భారత పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ జరుగుతోంది. ఈ బిల్లును మేము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. ఈ బిల్లు అమలులోకి వస్తే మరింత మంది మహిళానేతలు ప్రజాజీవితంలోకి వస్తారు. నేను నా సీటు కోల్పోవాల్సి వచ్చినా దానికి సిద్ధంగా ఉన్నా. మనందరివి చాలా చిన్నజీవితాలు, అందులో నా పాత్ర నేను పోషించాననే అనుకుంటున్నాను'అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీ.రామారావు అన్నారు. 'క్యాపిటా లాండ్ ఇన్వెస్ట్‌మెంట్'(సీఎల్ఐ) కొత్తగా పునర్నిర్మించిన 'ఇంటర్నేషనల్ టెక్ పార్క్ హైదరాబాద్'(ఐటీపీహెచ్)ను కేటీఆర్ బుధవారం ప్రారంభించారు. హైదరాబాద్ నిర్మాణరంగం సింగపూర్ అభివృద్ధిని తలపిస్తోందని, ఆసియాఖండంలో అభివృద్ధి చెందిన సింగపూర్, జపాన్ వంటి దేశాల నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉందన్నారు. తెలివైనవారు ఇతర అనుభవాల నుంచి నేర్చుకుంటారు అనే సామెతను గుర్తు చేస్తూ సింగపూర్ నుంచి అనేక అంశాలను హైదరాబాద్ అభివృద్ధిలో తాము అనుకరిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ నిర్మాణ రంగంలో భవిష్యత్‌లో మరిన్ని పెట్టుబడులు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. క్యాపిటా లాండ్ ఇన్వెస్ట్‌మెంట్ తమ పెట్టుబడుల కోసం దేశంలోని ఇతర ప్రాంతాల వైపు చూడకుండా మాన్యుఫాక్చరింగ్, లైఫ్ సైన్సెస్ రంగంలోనూ పెట్టుబడులు పెట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎల్ఐ ఇండియా సీఈఓ సంజీవ్‌దాస్ గుప్తా, సీఎల్ఐ ఇండియా పార్క్స్ సీఈఓ గౌరీశంకర్ నాగభూషణం, సింగపూర్ డిప్యూటీ స్పీకర్ జెస్సికా, సీఎల్ఐ చైర్మన్ మనోహర్ ఖైతాని, ఐటీ విభాగం చీఫ్ రిలేషన్స్ ఆఫీసర్ అమర్‌నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

40 మెగావాట్ల డేటా సెంటర్

క్యాపిటా లాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (సీఎల్ఐ) ఇటీవల మాదాపూర్‌లో పునర్ నిర్మించిన ఐటీపీహెచ్ బుధవారం ప్రారంభమైంది. ఈ బిజినెస్ పార్కులోని బ్లాక్ ఏ భవనంలో అంతర్జాతీయ సంస్థలు తమ కార్యాలయాల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకోవడంతో వంద శాతం లీజ్ కమిట్‌మెంట్ జరిగినట్లు సీఎల్ఐ వెల్లడించింది. బ్లాక్ ఏ భవన్‌లో 1.4 మిలియన్ల చదరపు అడుగుల్లో అంతర్జాతీయ సంస్థలు బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్, ఎర్నెస్ట్ అండ్ యంగ్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, యూఎస్ టెక్నాలజీ, వార్నర్ బ్రదర్స్, డిస్కవరీ వంటి సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఐటీపీహెచ్ దశలవారీగా వచ్చే 7 నుంచి పదేళ్లలో క్యాపిటా లాండ్ ఇండియా ట్రస్ట్ (క్లింట్) పూర్తి చేస్తుంది. ఈ పార్కు పూర్తయితే 4.9 మిలియన్ అడుగుల ఏ గ్రేడ్ ఆఫీసు స్పేస్ అందుబాటులోకి వస్తుంది. ఐటీపీహెచ్ ఆవరణలో 40 మెగావాట్ల సామర్థ్యమున్న డేటా సెంటర్ ఏర్పాటు కోసం భూమిపూజ జరిగింది. క్లింట్‌కు దేశవ్యాప్తంగా ఆరు నగరాల్లో 12 బిజినెస్ పార్కులు ఉండగా, అందులో మూడు హైదరాబాద్‌లోనే ఉన్నాయి.



ఐటీపీహెచ్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్‌తో సంస్థ ప్రతినిధులు

వార్నర్ బ్రదర్స్ హైదరాబాద్ క్యాపబిలిటీ సెంటర్ ప్రారంభం

ప్రపంచవ్యాప్తంగా మీడియా, వినోద రంగంలో పేరొందిన వార్నర్ బ్రదర్స్, డిస్కవరీ కార్యాలయాన్ని ఐటీపీహెచ్‌లో మంత్రి కేటీఆర్ బుధవారం ప్రారంభించారు. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ రాకతో మరిన్ని వైవిధ్యమైన కంపెనీలు హైదరాబాద్‌కు వస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌లో 2021–22లో 33శాతం, 2022–23లో 44శాతం ఐటీ ఉద్యోగాల కల్పన హైదరాబాద్‌లోనే జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్నర్ బ్రదర్స్, డిస్కవరీ సీఈఓ గున్నార్ వీడెన్‌ఫెల్స్, హైదరాబాద్ క్యాపబిలిటీ సెంటర్ బాధ్యులు జైదీప్ అగర్వాల్, హైదరాబాద్‌లో యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక విభాగ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే మీ సీటు త్యాగం చేయండి

- కేటీఆర్‌కు వైఎస్ షర్మిల సవాల్



సాక్షి, హైదరాబాద్: 'నిజంగా మహిళల రిజర్వేషన్ల మీద మీకు చిత్తశుద్ధి ఉంటే.. ఈ ఎన్నికల్లోనే మీ సీటు త్యాగం చేసి ఒక మహిళకు ఇవ్వండి...మిమ్మల్ని అడ్డుకునేదెవరు'అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్లతో తన సీటు కోల్పోయినా సిద్ధమేనన్న కేటీఆర్‌కు ఆమె ట్విట్టర్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. మహిళలను దారుణంగా అవమానించిన వాళ్లే ఇప్పుడు పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని, నిరుద్యోగుల కోసం తాను దీక్షలు చేస్తే వ్రతాలంటూ ఎద్దేవా చేసింది మీరేనని కేటీఆర్‌పై మండిపడ్డారు. శ్రీకాంతాచారి తల్లి ఓడిపోతే ఆమెకు ఏ పదవీ ఇవ్వలేదు..కానీ కవితమ్మ ఓడిపోతే ఎమ్మెల్సీ పదవి ఇచ్చుకున్నారని విమర్శించారు. మీకున్నది మహిళల మీద ప్రేమ కాదు..మీ కుటుంబం మీద ప్రేమ అని అన్నారు. 119 నియోజకవర్గాల్లో 63 స్థానాల్లో మహిళా ఓటర్లే ఎక్కువని ఎన్నికల సంఘం చెప్తోంది.. 33 శాతం మేరకు ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇచ్చిన 7 సీట్లతో పాటు మరో 32 సీట్లు ఇవ్వాలన్నారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో మహిళల ఓట్లే అధికం కాబట్టి..మీ సీట్లను ఇప్పుడే త్యాగం చేయాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే కేటీఆర్ ఈ సవాల్ స్వీకరించాలని వైఎస్ షర్మిల పేర్కొన్నారు.

సింగరేణి 'గుర్తింపు'పై రేపు సమావేశం

గోదావరిఖని: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలపై కార్మిక సంఘాలు, సింగరేణి యాజమాన్యంతో ఈనెల 22న సమావేశం నిర్వహించేందుకు కార్మిక శాఖ నిర్ణయించింది. ఈ మేరకు సింగరేణి యాజమాన్యంతోపాటు అన్ని కార్మిక సంఘాలు హాజరు కావాలని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులు లేఖ రాశారు. హైదరాబాద్‌లోని విద్యానగర్ డిప్యూటీ సీఎల్‌సీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15 కార్మిక సంఘాలు, సింగరేణి యాజమాన్యం, డిప్యూటీ సీఎల్‌సీ సమక్షంలో భేటీ కానున్నారు.

కోర్టును ఆశ్రయించిన సింగరేణి యాజమాన్యం?

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో తాము ఎన్నికలు నిర్వహించలేమని పేర్కొంటూ సింగరేణి యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఎన్నికలకు పోలీసు బందోబస్తు, ఎన్నికల సిబ్బందిని సమకూర్చడం ఇబ్బందిగా మారుతుందని యాజమాన్యం పేర్కొంటోంది.

అతివేగానికి ఐదుగురు బలి

- కారు, బైక్ ఢీ.. ఐదుగురి దుర్మరణం
- మృతుల్లో ముగ్గురిది ఒకే కుటుంబం
- నల్లగొండ జిల్లాలో ఘటన



మణిపాల్, మల్లికార్జున్

చింతపల్లి: నల్లగొండ జిల్లాలో హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్రంపల్లి గ్రామానికి చెందిన స్నేహితులు వనం మల్లికార్జున్, పట్నపు మణిపాల్, పులి పవన్, వారాల మణివర్షిత్‌లు కొండమల్లేపల్లిలోని ఓ కాలేజీలో ఇటీవల ఇంటర్ పూర్తిచేసి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్ పొందారు. కళాశాల యాజమాన్యం ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని చెప్పడంతో బుధవారం హైదరాబాద్ నుంచి ఓ కారులో నలుగురు స్నేహితులు కొండమల్లేపల్లిలో తాము చదువుకున్న కాలేజీకి వెళ్లారు. అక్కడ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని తిరిగి కారులో హైదరాబాద్ బయలుదేరారు. అదే సమయంలో నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం అంగడిపేటకు చెందిన మద్దిమడుగు ప్రసాద్, రమణమ్మ దంపతులు 7వ తరగతి చదివే తమ కుమారుడితో కలసి బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి సమీపంలో మూలమలుపు వద్ద విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా వస్తూ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న దంపతుల బైక్‌ను బలంగా ఢీకొట్టింది. అనంతరం కారు రహదారి పక్కనే ఉన్న బండరాళ్లను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న తండ్రీకుమారుడు మద్దిమడుగు ప్రసాద్ (38), మద్దిమడుగు అవినాష్ (12) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ప్రసాద్ భార్య రమణమ్మ (35), కారులో ప్రయాణిస్తున్న విద్యార్థులు మల్లికార్జున్ (18), పట్నపు మణిపాల్ (18)కు తీవ్ర గాయాలయ్యాయి. మల్లికార్జున్, మణిపాల్‌లను మాల్‌లోని ఆస్పత్రికి, రమణ మ్మను ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. కారులో ఉన్న మరో ఇద్దరు విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. దేవరకొండ డీఎస్పీ గిరిబాబు ఘటనాస్థలానికి చేరుకొని వివరా లు సేకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



భార్య రమణమ్మ, కుమారులతో ప్రసాద్

ఆర్టీసీ బస్సు బోల్తా

- ఇద్దరు ప్రయాణికులు మృతి.. ఐదుగురికి గాయాలు

అడ్డగూడూరు: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో బోల్తాపడటంతో ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల పరిధిలోని బొడ్డుగూడెం గ్రామ శివారులో బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు బుధవారం ఉదయం తొర్రూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సును డ్రైవర్ వేగంగా నడపడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు వెళ్లి పెద్ద గుంతలో బోల్తా పడింది. కండక్టరు కిష్టయ్యతోపాటు బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదంలో ఒకరిపై ఒకరు పడటంతో ఊపిరాడక ఇద్దరు మృతిచెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కోటమర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి కొండ రాములు (60) తన బంధువు చనిపోవడంతో అంత్యక్రియలకు వెళ్తూ ప్రమాదంలో మృతిచెందాడు. అడ్డగూడూరు మండలం చిన్నపడిశాల గ్రామానికి చెందిన చుక్క యాకమ్మ (50) చౌల్లరామారం వద్ద బస్సు ఎక్కి ఈ ప్రమాదంలో మృతి చెందింది. అడ్డగూడూరు, మోత్కూరు ఎస్ఐలు డి.నాగరాజు, శ్రీకాంత్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బస్సు బోల్తాపడిన ప్రాంతాన్ని డిపోల మేనేజర్లు సందర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని అధికారులు చెప్పారు.



బోల్తాపడిన ఆర్టీసీ బస్సు

ఫాంహౌస్‌లలో నీలి జెండాలు పాతుతాం

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): రాజకీయ నాయకుల ఫాంహౌస్‌లలో నీలి జెండాలు పాతేస్తామని, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బహుజన్ సమాజ్ పార్టీయేనని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన బహుజన దండయాత్ర సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలలో ఉన్న బహుజనులందరూ బీఎస్పీకి ఓటు వేస్తారన్నారు. దళితబంధు, బీసీబంధు, మైనార్టీబంధు, ఎస్టీబంధులతో పాటుగా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ దుకాణాన్ని సైతం ప్రజలు బంద్ పెట్టడం ఖాయమని చెప్పారు. బహుజనులకు కావాల్సింది గొర్రెలు, చేపలు కాదని, బీఎస్పీ అధికారంలోకి వస్తే బహుజనులు రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, కంప్యూటర్ ఇంజనీర్లు అయ్యే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి వేల కోట్లతో భూములు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.

టీఎస్ఐఐసీ భూములను ఆలేరు ఎమ్మెల్యే కబ్జా చేశారు

- టీపీసీసీ అధికార ప్రతినిధి అయోధ్యరెడ్డి



సాక్షి, హైదరాబాద్: టీఎస్ఐఐసీ పార్కు కోసం ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలంలో భూసేకరణ చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి బోరెడ్డి అయోధ్యరెడ్డి తెలిపారు. ఇందుకోసం సర్వే నంబర్ 71లో 108 ఎకరాల భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్ వేసి కేవలం 93 ఎకరాలే తీసుకున్నారని, మిగిలిన 15 ఎకరాలను ఆలేరు ఎమ్మెల్యే సునీతా మహేందర్‌రెడ్డి కబ్జా చేశారని ఆరోపించారు. ఇక్కడ నోటిఫికేషన్ వేసిన భూమిలో సేకరించింది పోను మిగిలిన 15 ఎకరాల భూమి ఏమైందో విచారణ జరిపించాలని బుధవారం అయోధ్యరెడ్డి గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. ఈ భూసేకరణలో 43 మంది రైతుల దగ్గర తీసుకున్న భూమికి పరిహారంగా ప్రభుత్వం ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే కాక ముందు తెల్ల రేషన్‌కార్డు ఉన్న సునీతకు ఇప్పుడు రూ.వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు.

మద్యం మత్తులో గాలిలోకి కాల్పులు!

- పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకుడు

వరంగల్ క్రైం: హనుమకొండ జిల్లా పరకాల మండల కేంద్రంలో బీఆర్ఎస్‌కు చెందిన ఓ నాయకుడు రివాల్వర్‌తో గాలిలోకి కాల్పులు జరిపిన ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 15న పరకాల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన దశదినకర్మ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి మద్యం మత్తులో సొంత పార్టీ నేతలతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో సహనం కోల్పోయి జనం మధ్యలోనే ఒక్కసారిగా రివాల్వర్‌తో గాల్లోకి కాల్పులు జరిపినట్లు తెలిసింది. అదే సమయంలో అతను స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. పార్టీలో తనకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని మండిపడుతూ, ఎమ్మెల్యే కంటే తాను ఏ విషయంలో తక్కువ కాదని అనుచరులతో గట్టిగా అరిచినట్లు తెలిసింది. పక్కనే ఉన్న వారు ఆపే ప్రయత్నం చేసినప్పటికి వినకుండా ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడినట్లు సమాచారం. కాగా, దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై ఆరా తీస్తున్నారు. అక్కడ ఏం జరిగింది? తిరుపతిరెడ్డి గాలిలో ఎన్ని రౌండ్లు కాల్పులు జరిపాడు.. అనే విషయాలపై విచారణ చేస్తున్నట్లు తెలిసింది. కాల్పుల సమయంలో పక్కనే ఉన్న బీఆర్ఎస్ నాయకులను ఎస్బీ అధికారులు కలసి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై ఈస్ట్‌జోన్ డీసీపీ పులిగిల్ల రవీందర్ మాట్లాడుతూ.. అకారణంగా గాలిలోకి కాల్పులు జరిపిన తిరుపతిరెడ్డిపై విచారణ జరిపి రివాల్వర్ లైసెన్సును రద్దు చేస్తామని, కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని చెప్పారు. కాగా, పోలీసులు తిరుపతిరెడ్డిని అదుపులోకి తీసుకుని రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు మహిళా మావోయిస్టుల మృతి
- కూంబింగ్ చేస్తున్న బలగాలపై కాల్పులు ప్రారంభించిన మావోయిస్టులు
- మూడుగంటలపాటు హోరాహోరీగా ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ – సుకుమా జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలోని సహరీ, చోటీ మిద్మా, దుంగిన్‌పారీ ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో బీజాపూర్ జిల్లా అరణ్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్ బలగాలు మంగళవారం సాయంత్రం నుంచి సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున బలగాలకు కంటబడిన మావోయిస్టులు పోలీసులపైకి కాల్పులు జరుపుతూ పారిపోవడానికి యత్నించారు. దీంతో పోలీసులు కూడా ఎదురు కాల్పులు ప్రారంభించారు. సుమారు మూడుగంటల పాటు ఇరువర్గాల మధ్య హోరాహోరీగా జరిగిన ఎదురుకాల్పుల తర్వాత మావోయిస్టులు పారిపోయారు. అనంతరం ఆ ప్రాంతంలో గాలించగా ఇద్దరు మహిళా మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఘటనా ప్రాంతంలో ఒక ఇన్‌షాస్ రైఫిల్, ట్వల్వ్ బోర్ తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా పారిపోయిన మావోయిస్టుల కోసం బలగాలు మళ్లీ కూంబింగ్ చేపట్టాయి.



గాయపడిన ఏఎస్సైని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మిడ్డీ, పాడిమిగా గుర్తింపు...

మృతులను దంతెవాడ – సుకుమా జిల్లాల సరిహద్దులోని మలంగిర్ ఏరియా మిలీషియా కమాండ్ ఇన్‌చీఫ్ లక్కీ అలియాస్ జిల్లో మిడ్డీ, 24వ ప్లాటూన్ సభ్యురాలు మంగ్లీ పాడిమిగా పోలీసులు గుర్తించారు. లక్కీ అలియాస్ జిల్లో మిడ్డీపై కిరండోల్‌లో ఆరు కేసులు నమోదు కాగా, ఆమెపై రూ.5 లక్షల రివార్డు ఉంది. మంగ్లీ పాడిమిపై రూ.2 లక్షల రివార్డు ఉంది.

మందుపాతర పేలి ఏఎస్సైకి గాయాలు

బీజాపూర్ జిల్లా అరణ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు ఏర్పాటు చేసిన మందుపాతర (ప్రెజర్ బాంబు) పేలి సీఆర్‌పీఎఫ్ ఏఎస్సై తీవ్రంగా గాయపడ్డారు. అరణ్‌పూర్ – జేగురుగొండ మార్గంలో కమర్‌గూడ సమీపంలో రహదారి పక్కనే నడుచుకుంటూ కూంబింగ్ చేస్తుండగా...సీఆర్‌పీఎఫ్ 231 బెటాలియన్‌కు చెందిన ఏఎస్ఐ ప్రెజర్‌బాంబుపై కాలు మోపడంతో అది పేలిపోయింది. దీంతో ఏఎస్సై ఎడమ కాలుకు రెండు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం బీజాపూర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కన్నబిడ్డ బతకడనే..

- నిలోఫర్‌లో ఆరు నెలల బాలుడి కిడ్నాప్
- అపహరణ కోసమే ఆస్పత్రికి వచ్చిన మహిళ
- తన కుమారుడిని అక్కడే వదిలేసి బాలుడితో ఉడాయింపు
- బాన్సువాడలో టాస్క్‌ఫోర్స్ టీమ్ రెస్క్యూ
- ఎట్టకేలకు లభించిన చిన్నారి ఆచూకీ

సాక్షి, హైదరాబాద్: నిలోఫర్ ఆస్పత్రి నుంచి గత గురువారం అపహరణకు గురైన ఆరు నెలల బాలుడి ఆచూకీ దొరికింది. బాన్సువాడలో ఆ చిన్నారికి రెస్క్యూ చేసిన పోలీసులు ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధ్య మండల డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు పూర్తి వివరాలు వెల్లడించారు. ఈ వ్యవహారంలో అమ్మా, నాన్న అని పిలిపించుకోవాలనే మమకారం తప్ప ఎలాంటి ఇతర కోణం లేదని పోలీసులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలోనే నిందితులపైనా పోలీసులు మానవత్వం చూపడం కొసమెరుపు.

కుమారుడి వైద్యం కోసం రాగా..

- కామారెడ్డి జిల్లా కొత్తాబాద్ తండాకు చెందిన కె.మమత, కూరగాయల వ్యాపారి శ్రీను దంపతులు. వీరికి గతంలో ఇద్దరు మగ పిల్లలు పుట్టినా హైపర్ విస్కోసిటీ సిండ్రోమ్ అనే జన్యుపరమైన వ్యాధితో చనిపోయారు. ఇటీవలే మమతకు మరో బాబు పుట్టాడు. పది రోజుల వయసున్న అతడికీ అదే వ్యాధి సోకిందని, బతికే అవకాశం లేదని వైద్యులు చెప్పారు. దీంతో ఓ మగ శిశువుని కిడ్నాప్ చేసి పెంచుకుందామని ఈ దంపతులు పథకం వేశారు. దీన్ని అమలులో పెట్టడంలో భాగంగా ఇద్దరూ కలిసి తమ చిన్నారితో గత గురువారం నగరానికి చేరుకున్నారు.
- గండిపేట్ రోడ్డు ప్రాంతానికి చెందిన ఫరీదా బేగానికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు (4) అనారోగ్యం బారిన పడ్డాడు. దీంతో ఆమె పెద్ద కుమారుడు, చిన్న కుమారుడిని (6 నెలలు) తీసుకుని కలిసి గత గురువారం ఉదయం నిలోఫర్ ఆస్పత్రికి వచ్చింది. పెద్ద కుమారుడిని తండ్రి వైద్యుల వద్దకు తీసుకువెళ్లగా.. ఫరీదా బేగం తన చిన్న కుమారుడితో కలిసి వెయిటింగ్ హాల్‌లో ఉంది. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో బాలుడు నిద్రించడంతో ఆమె బాలుడిని అక్కడే పడుకోపెట్టి ఆహారం కోసం బయటికి వెళ్లింది. అప్పటికే ఆమెతో మాటలు కలిపిన మమత తన కుమారుడి వైద్యం కోసం వచ్చానని చెప్పింది.

సొంతూరికి వెళితే అనుమానిస్తారని..

ఫరీదా తన చిన్న కుమారుడిని వదిలి వెళ్లడంతో అదను కోసం వేచి చూసిన మమత.. తన కుమారుడిని అక్కడే వదిలేసి ఆరు నెలల బాలుడిని తీసుకుని ఉడాయించింది. అక్కడ నుంచి ఆటోలో జూబ్లీబస్ స్టేషన్‌కు చేరుకోగా.. లక్డీకాపూల్ ప్రాంతంలో వేచి ఉన్న ఆమె భర్త శ్రీను బస్సులో వెళ్లాడు. అక్కడ కలుసుకున్న ఇద్దరూ కొన్నిరోజులు స్వగ్రామానికి వెళ్లకూడదని భావించారు. తమ పది రోజుల శిశువు స్థానంలో ఆరు నెలల బాలుడిని తీసుకువెళ్తే ఎవరైనా అనుమానిస్తారని, ఈ నేపథ్యంలో మరో ఆరు నెలలు బాన్సువాడలో తల దాచుకోవాలని నిర్ణయించుకున్నారు. బాన్సువాడలో ఉన్న తన స్నేహితుడి ద్వారా శ్రీను ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. గత శుక్రవారం నుంచి నిందితులు ఇద్దరూ కిడ్నాప్ చేసిన బాలుడితో అందులోనే ఉంటున్నారు. ఈ శిశువుకు మమత బ్రెస్ట్ ఫీడింగ్ ద్వారా పాలు ఇస్తూ జాగ్రత్తగా చూసుకుంది. వీళ్లు నిలోఫర్‌లో వదిలేసిన బాలుడిని అదే రోజు గుర్తించిన వైద్య సిబ్బంది నాంపల్లి ఠాణాలో ఫిర్యాదు చేయడంతో గుర్తుతెలియని నిందితులపై కేసు నమోదైంది. ఫరీదా ఫిర్యాదు మేరకు మరో కిడ్నాప్ కేసు రిజిస్టర్ చేశారు.



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

ముమ్మరంగా గాలించిన టాస్క్‌ఫోర్స్..

కేసును చాలెంజ్‌గా తీసుకున్న మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్, ఎస్సై సీహెచ్ నవీన్‌కుమార్ రంగంలోకి దిగారు. నిలోఫర్ నుంచి ఓ చిన్నారి కిడ్నాప్ కావడం, అదే రోజు మరో చిన్నారి దొరకడంతో ఈ రెంటికీ మధ్య లింకు ఉంటుందని అనుమానించారు. నిలోఫర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో నిందితులు బాన్సువాడలో ఉన్నట్లు గుర్తించారు. బుధవారం మమత దంపతులను అదుపులోకి తీసుకుని బాలుడిని రెస్క్యూ చేసి కన్నతల్లి ఫరీదాకు అప్పగించారు.

క్లుప్తంగా...

ఎర్డోగన్ నోట.. కశ్మీర్ మాట

ఐక్యరాజ్యసమితి: తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ మళ్లీ కశ్మీర్ అంశాన్ని పనిగట్టుకుని అంతర్జాతీయ వేదికపై ప్రస్తావించారు. బుధవారం న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి 78వ సర్వ సభ్య సమావేశాల సాధారణ చర్చలో ఎర్డోగన్ మాట్లాడారు. 'భారత్, పాకిస్తాన్‌ల మధ్య సహకారం, చర్చల ద్వారా కశ్మీర్‌లో శాశ్వతంగా శాంతిని నెలకొల్పగలం. అప్పుడే దక్షిణాసియాలో శాంతి, సుస్థిరత, శ్రేయస్సుకు కొత్త బాటలు వేయగలం. ఈ దిశగా ముందడుగులు పడితే తుర్కియే తప్పకుండా తన వంతు తోడ్పాటును అందిస్తుంది' అని ఎర్డోగన్ వ్యాఖ్యానించారు. వాణిజ్యం తదితర రంగాల్లో ఇరుదేశాల మైత్రి బంధం బలపడాలంటూ జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ద్వైపాక్షిక చర్చల్లో మోదీతో ఎర్డోగన్ చర్చించిన రెండువారాల్లోనే ఆయన ఇలా విరుద్ధ ప్రసంగాలు చేయడం గమనార్హం. ఎర్డోగన్ అంతర్జాతీయ వేదికలపై కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. గత ఏడాది ఐరాస సర్వ ప్రతినిధి సభలోనూ కశ్మీర్ అంశంపై మాట్లాడారు. దేశ సార్వభౌమత్వం, సమగ్రతకు సంబంధించిన అంశంపై ఇతర దేశాలు ఐరాస వంటి ప్రతిష్టాత్మక వేదికలపై ప్రస్తావించడాన్ని భారత్ గతంలోనే తీవ్రంగా ఖండించింది. అయినాసరే ఎర్డోగన్ తీరు మారకపోవడం గమనార్హం.

గణతంత్ర వేడుకలకు బైడెన్!

ఆహ్వానించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జనవరిలో జరగబోయే భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరవ్వాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్‌ను ప్రధాని మోదీ ఆహ్వానించారు. ఈనెల రెండో వారంలో ఢిల్లీలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో భాగంగా బైడెన్‌తో ద్వైపాక్షిక చర్చల సందర్భంగా ఆయనను రిపబ్లిక్‌డే వేడుకకు మోదీ ఆహ్వానించారని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి వెల్లడించారు.

కెనడాను వదిలేసి భారత్‌కు వెళ్లిపోండి

నిషేధిత ఖలిస్తానీ ఉగ్ర సంస్థ చీఫ్ హెచ్చరిక

న్యూఢిల్లీ: ఖలిస్తానీ ఉగ్రవాది హత్యతో భారత్, కెనడా మధ్య రాజుకున్న ఆగ్రహ కుంపట్లను ఖలిస్తానీ వేర్పాటువాదులు మరింత రాజేస్తున్నారు. ఇండో–కెనడియన్ హిందువులు కెనడాను వీడి భారత్‌కు తిరిగి వెళ్లిపోవాలని నిషేధిత ఖలిస్తానీ వేర్పాటువాద సంస్థ సిఖ్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) చీఫ్ గురుపత్వంత్‌సింగ్ పన్నూన్ హెచ్చరికలు జారీచేశారు. 'మీరంతా కెనడా దేశాన్ని, కెనడా రాజ్యాంగాన్ని అనుసరించట్లేదు. మీ గమ్యం భారత్. అందుకే మీరంతా కెనడాను వీడండి. భారత్‌కు తిరిగి వెళ్లండి' అంటూ గురుపత్వంత్ విడుదల చేసిన వీడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది.

కెనడాలో జాగ్రత్తగా ఉండండి

భారత ప్రభుత్వం సూచన

న్యూఢిల్లీ: ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నజ్జర్ హత్యలో కెనడాలోని భారతీయ నిఘా వర్గాలకు పరోక్ష సంబంధాలు ఉన్నాయన్న కెనడా ప్రధాని ట్రూడో ఆరోపణలతో మొదలైన వివాదం పెరిగింది. దానికి కొనసాగింపుగా భారత విదేశాంగ శాఖ బుధవారం ఒక అడ్వైజరీని విడుదలచేసింది. కెనడాలో ఉంటున్న భారతీయ పౌరులు, అక్కడికి వెళ్లాలనుకునే భారతీయ కమ్యూనిటీ ప్రజలనుద్దేశిస్తూ ఈ అడ్వైజరీని విడుదలచేసింది. 'కెనడాలో భారత వ్యతిరేక కార్యకలాపాలు, రాజకీయ ప్రేరేపిత విద్వేష నేరాలు, హింస పెరిగిన నేపథ్యంలో కెనడాకు వెళ్లాలనుకునేవారు, అక్కడే ఉంటూ వేరే చోట్లకు ప్రయాణించాలనుకునే భారతీయులు జాగ్రత్తగా ఉండండి' అని అడ్వైజరీ పేర్కొంది.

ట్రూడో ఆరోపణలు తీవ్రమైనవే: అమెరికా

న్యూయార్క్: ఖలిస్తానీ ఉగ్రవాది హత్యోదంతంలో భారతీయ నిఘా వర్గాల పాత్రపై అమెరికా జాతీయ భద్రతా మండలి ఉన్నతాధికారి స్పందించారు. 'కెనడా పౌరుడైన నిజ్జర్ హత్యతో భారతీయ నిఘా వర్గాలకు సంబంధం ఉందంటూ కెనడా ప్రధాని ట్రూడో చేస్తున్న ఆరోపణలు నిజంగా తీవ్రమైనవి. ఈ వివాదం ముగిసిపోవాలంటే సమగ్ర, విస్తృతస్థాయి దర్యాప్తు అవసరం. కెనడా ఇప్పుడు అదే పనిలో ఉంది. ఇందుకు భారత్ సైతం పూర్తి సహాయ సహకారాలు అందించాలని మేం కూడా కోరుకుంటున్నాం' అని అమెరికా జాతీయ భద్రతా మండలి సమన్వయ కర్త(వ్యూహాత్మక సంబంధాలు) జాన్ కిర్బీ సీఎన్ఎన్ వార్తాసంస్థ ముఖాముఖిలో వ్యాఖ్యానించారు.

సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో సజ్జన్ కుమార్‌కు విముక్తి

న్యూఢిల్లీ: 1984లో సిక్కు వ్యతిరేక అల్లర్ల ఉదంతంలో ఒక వ్యక్తి మరణానికి సంబంధించిన కేసులో కాంగ్రెస్ పార్టీ మాజీ పార్లమెంట్ సభ్యుడు సజ్జన్ కుమార్‌ను ఢిల్లీ కోర్టు బుధవారం నిర్దోషిగా ప్రకటించింది. ఢిల్లీలోని సుల్తాన్‌పురిలో సుర్జీత్ సింగ్ మరణం, సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో సజ్జన్ కుమార్, వేద్ ప్రకాశ్, బ్రహ్మానంద్ గుప్తాలపై కేసు నమోదైంది. ఈ కేసును జడ్జి గీతాంజలి గోయల్ విచారించారు. 'ఈ కేసులో సజ్జన్, వేద్, గుప్తాల ప్రమేయం ఉందన్న ఆరోపణలను ప్రాసిక్యూషన్ వారు నిరూపించలేకపోయారు. సంశయ లాభం కింద ఈ ముగ్గురునీ నిర్దోషులుగా ప్రకటిస్తున్నాం' అంటూ జడ్జి తన తీర్పును వెలువరిచారు. పలు సెక్షన్ల మీదా సజ్జన్‌పై గతంలో కేసు నమోదైంది. 1984లో నాటి ప్రధాని ఇందిరను సిక్కు భద్రతా సిబ్బందే కాల్చి చంపడంతో సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగాయి.








నారీశక్తి మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బుధవారం పార్లమెంట్ ఆవరణలో (వరసగా ఎడమ నుంచి కుడికి) అమరావతి ఎంపీ నవనీత్ కౌర్, బీజేపీ ఎంపీ కేశరి దేవి పటేల్, బీజేపీ ఎంపీ పూనమ్ మహాజన్, బాక్సర్ మేరీ కోమ్, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, మాజీ అథ్లెట్ అంజూ జార్జ్, సినీ నటి భూమీ పడ్నేకర్



బిల్లు ఆమోదం పొందాక విజయసంకేతం చూపిస్తున్న బీజేపీ ఎంపీలు రితి పాఠక్ తదితరులు

మహిళా బిల్లుకు జై

▶ మొదటి పేజీ తరువాయి

ఓబీసీ మహిళా కోటా గురించి ప్రశ్నించారు. ఈ రిజర్వేషన్లను వెంటనే అమల్లోకి తీసుకురావాలన్న డిమాండ్లు సైతం వినిపించాయి. చర్చ అనంతరం స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా 454 మంది సభ్యులు ఓటు వేయగా, ఇద్దరు ఎంపీలు వ్యతిరేకంగా ఓటేశారు. ఓటింగ్ ప్రక్రియలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. చర్చ అనంతరం అదే రోజు ఓటింగ్ నిర్వహిస్తారు. ఎగువ సభలోనూ బిల్లు ఆమోదం పొందడం లాంఛనమే. అనంతరం రాష్ట్రపతి సంతకంతో మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టరూపం దాల్చనుంది. జన గణన, నియోజకవర్గాల పునర్విభజన పూర్తయిన తర్వాత 2029 నుంచి అమల్లోకి రానున్నట్లు ప్రభుత్వం చెబుతోంది.

ఓటింగ్ జరిగిందిలా..

మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉండటంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్లిప్‌ల ద్వారా ఓటింగ్ నిర్వహించారు. మాన్యువల్ పద్ధతిలో ఓటింగ్ జరిగింది. ఎరుపు, ఆకుపచ్చ రంగు స్లిప్‌లను సభ్యులకు అందజేశారు. ఓటు ఎలా వేయాలో లోక్‌సభ సెక్రెటరీ జనరల్ వివరించారు. బిల్లుకు మద్దతు తెలిపితే ఆకుపచ్చ స్లిప్‌పై 'ఎస్' అని రాయాలని, వ్యతిరేకిస్తే ఎరుపు రంగు స్లిప్‌పై 'నో' అని రాయాలని చెప్పారు. ఆ ప్రకారమే ఓటింగ్ జరిగింది. బిల్లుకు మద్దతుగా 454 ఓట్లు, వ్యతిరేకంగా కేవలం 2 ఓట్లు వచ్చాయి. ఈ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నామని లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రకటించారు. ఆ పార్టీకి లోక్‌సభలో ఓవైసీతోపాటు మరో ఎంపీ సయ్యద్ ఇంతియాజ్ జలీల్(ఔరంగాబాద్) ఉన్నారు. బిల్లుకు వ్యతిరేకంగా వారిద్దరూ ఓటేసినట్లు తెలుస్తోంది.

లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా పార్టీలకతీతంగా మహిళా ఎంపీలు బిల్లుకు ఏకగ్రీవంగా జై కొట్టారు. లోక్‌సభలో 82 మంది మహిళా ఎంపీలుండగా బుధవారం చర్చలో 27 మంది మహిళా ఎంపీలు మాట్లాడారు. అందరూ బిల్లుకు మద్దతుగా మాట్లాడారు. అయితే, బిల్లు ఆలస్యంగా అమలయ్యే అంశాన్ని ప్రధానంగా తప్పుబట్టారు.

చాలా సంతోషంగా ఉంది: ప్రధాని మోదీ

బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడం సంతోషంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. పార్టీలకతీతంగా బిల్లుకు మద్దతు ఇచ్చిన ఎంపీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. 'ఇది చరిత్రాత్మక చట్టం అవుతుంది. ఈ చట్టంతో మహిళా సాధికారతకు ప్రోత్సాహం లభిస్తుంది. రాజకీయ వ్యవస్థలో మహిళామణుల భాగస్వామ్యం ఎన్నో రెట్లు పెరుగుతుంది' అని మోదీ ట్వీట్‌చేశారు.

ఈ బిల్లుతో సవర్ణ మహిళలకే మేలు

మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నాం. ఈ బిల్లుతో అగ్ర వర్ణాల మహిళలకే మేలు జరుగుతుంది. పార్లమెంట్‌లో అతి తక్కువ ప్రాతినిధ్యం ఉన్న ఓబీసీ, మైనార్టీ మహిళలకు ఈ రిజర్వేషన్లలో ప్రత్యేకంగా కోటా కల్పించకపోవడం దారుణం. దేశ జనాభాలో ముస్లిం మహిళలు 7 శాతం ఉన్నారు. లోక్‌సభలో వారి సంఖ్య కేవలం 0.7 శాతమే ఉంది. లోక్‌సభలో సవర్ణ మహిళల సంఖ్య పెంచాలని మోదీ ప్రభుత్వం కోరుకుంటోంది. ఓబీసీ, మైనార్టీ మహిళలు ఈ సభలో ఉండడం ప్రభుత్వానికి ఇష్టం లేదు. ఆయా వర్గాల మహిళలను మోదీ సర్కారు దగా చేస్తోంది

- అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం పార్లమెంట్ సభ్యుడు

తక్షణమే అమలు చేయండి

మహిళా బిల్లుపై సోనియా
- కాంగ్రెస్ పూర్తి మద్దతు, కానీ...
- ఓబీసీలకూ మూడో వంతు వర్తించాలి
- కుల గణన జరిపి తీరాలి
- లోక్‌సభ చర్చలో డిమాండ్

న్యూఢిల్లీ: లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ మోదీ సర్కారు పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లుకు కాంగ్రెస్ పూర్తిగా మద్దతిస్తుందని ఆ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ప్రకటించారు. అయితే జన గణన, డీ లిమిటేషన్ వంటివాటితో నిమిత్తం లేకుండా బిల్లును తక్షణం అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. అలాగే మూడో వంతు రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీ మహిళలకు కూడా వర్తింపజేయాలన్నారు. బుధవారం లోక్‌సభలో మహిళా బిల్లుపై చర్చను విపక్షాల తరఫున ఆమె ప్రారంభించారు. రిజర్వేషన్ల అమలులో ఏ మాత్రం ఆలస్యం చేసినా అది భారత మహిళల పట్ల దారుణ అన్యాయమే అవుతుందని అన్నారు. 'కుల గణన జరిపి తీరాల్సిందే. ఇది కాంగ్రెస్ పార్టీ ప్రధాన డిమాండ్. ఇందుకోసం తక్షణం కేంద్రం చర్యలు చేపట్టాలి' అని పునరుద్ఘాటించారు. రాజకీయాలతో పాటు వ్యక్తిగతాన్నీ, భావోద్వేగాలను కూడా రంగరిస్తూ సాగిన ప్రసంగంలో సోనియా ఏమన్నారంటే...

'దేశాభివృద్ధిలో మహిళల పాత్రను సముచితంగా గుర్తుంచుకునేందుకు, కృతజ్ఞతలు తెలిపేందుకు ఇది సరైన సమయం. అందుకే, నారీ శక్తి విధాన్ అధినియమ్‌కు కాంగ్రెస్ పార్టీ పరిపూర్ణంగా మద్దతిస్తుంది. దాన్ని వీలైనంత త్వరగా అమలు చేయాలి. ఆ దారిలో ఉన్న అడ్డంకులను తలగించాలి'.

వంటింటి నుంచి అంతరిక్షం దాకా...

'మసిబారిన వంటిళ్ల నుంచి ధగధగా వెలిగిపోతున్న స్టేడియాల దాకా, అంతరిక్ష సీమల దాకా భారత మహిళలది సుదీర్ఘ ప్రయాణం. అటు పిల్లలను కని, పెంచి, ఇటు ఇల్లు నడిపి, మరోవైపు ఉద్యోగాలూ చేస్తూ అంతులేని సహనానికి మారుపేరుగా నిలిచింది మహిళ. అలాంటి మహిళల కష్టాన్ని, గౌరవాన్ని, త్యాగాలను సముచితంగా గుర్తించినప్పుడు మాత్రమే మానవతకు సంబంధించిన పరీక్షలో మనం గట్టెక్కినట్టు'.



లోక్‌సభలో మాట్లాడుతున్న సోనియా

స్వాతంత్ర్య పోరులోనూ నారీ శక్తి

'దేశ స్వాతంత్ర్య సంగ్రామంలోనూ, అనంతరం ఆధునిక భారత నిర్మాణంలో కూడా భారత మహిళలు పురుషులతో భుజం కలిపి సాగారు. కుటుంబ బాధ్యతల్లో మునిగి సమాజం, దేశం పట్ల తమ బాధ్యతలను ఎన్నడూ విస్మరించలేదు. సరోజినీ నాయుడు, సుచేతా కృపాలనీ, అరుణా అసఫ్ అలీ, విజయలక్ష్మీ పండిట్, రాజ్‌కుమార్ అమృత్ కౌర్, ఇంకా ఎందరెందరో మహిళామణులు మనకు గర్వకారణంగా నిలిచారు. గాంధీ, నెహ్రూ, పటేల్, అంబేడ్కర్ తదితరుల ఆకాంక్షలు నెరవేర్చడంలో తమ వంతు పాత్ర పోషించారు'.

మహిళా శక్తికి ప్రతీక ఇందిర...

ఇక దివంగత ప్రధాని ఇందిరా గాంధీ వ్యక్తిత్వం భారత మహిళల శక్తి సామర్థ్యాలను తిరుగులేని ప్రతీకగా ఇప్పటికీ నిలిచి ఉంది. వ్యక్తిగతంగా నా జీవితంలో ఇది చాలా ముఖ్యమైన సందర్భం. మహిళలకు స్థానిక సంస్థల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ నా జీవిత భాగస్వామి, దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ తొలిసారిగా రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు. కానీ రాజ్యసభలో ఆ బిల్లును కేవలం ఏడు ఓట్లతో ఓడించారు. అనంతరం పీవీ నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని పాస్ చేయించింది. ఫలితంగా నేడు 15 లక్షలకు పైగా మహిళలు దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో ప్రతినిధులుగా రాణిస్తున్నారు'.

రాజీవ్ కల.. అప్పుడే సాకారం

'చట్ట సభల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం దక్కాలన్న దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ కల సగమే నెరవేరింది. బిల్లు ఆమోదం పొందినప్పుడే అది పూర్తిగా సాకారవుతుంది. నేనో ప్రశ్న అడగాలనుకుంటున్నా. భారత మహిళలు తమ రాజకీయ బాధ్యతలను తలకెత్తుకునేందుకు 13 ఏళ్లుగా వేచిచూస్తున్నారు. ఇప్పుడు కూడా వారిని ఇంకా ఆరేళ్లు, ఎనిమిదేళ్లు... ఇలా ఇంకా ఆగమంటూనే ఉన్నారు. భారత మహిళల పట్ల ఇలాంటి ప్రవర్తన సరైనదేనా?'

రాజ్యాంగ పీఠికలో 'లౌకిక, సామ్యవాద' మాయం

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఎంపీలకు పంపిణీ చేసిన రాజ్యాంగ పీఠిక ప్రతుల్లో లౌకిక(సెక్యులర్), సామ్యవాద(సోషలిస్ట్) అనే పదాలు మాయమయ్యాయని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అధిర రంజన్ ఆరోపించారు. ఆ పదాలు తొలగించడం వెనుక బీజేపీ ఉద్దేశం ఏమిటో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. ఈ అంశంపై పలువురు ప్రతిపక్ష నేతలు సైతం స్పందించారు. వివాదంపై కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ వివరణ ఇచ్చారు. ఎంపీలకు అందించిన ప్రతులు ఒరిజినల్ రాజ్యాంగ పీఠికకు సంబంధించినవని తెలిపారు. సెక్యులర్, సామ్యవాది పదాలను రాజ్యాంగ సవరణ ద్వారా తర్వాత చేర్చారని గుర్తుచేశారు.

ఇంకెంతకాలం నిరీక్షణ



మహిళా రిజర్వేషన్ బిల్లు అనేది కేవలం చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం కాదు. ఇది మహిళల పట్ల పక్షపాతం, అన్యాయాన్ని తొలగించడానికి ఉద్దేశించినది. మహిళలకు ప్రత్యేకంగా వందనాలు అవసరం లేదు. అందరితోపాటు సమాన గౌరవాన్ని పొందాలని మహిళలు కోరుకుంటున్నారు. మహిళా కోటాను అమలు చేయడంలో జాప్యం తగదు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమలవుతాయనడం సరైంది కాదు. ఇంకా ఎంత కాలం నిరీక్షించాలి? రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం సాధ్యమే

- కనిమొళి, డీఎంకే ఎంపీ

ఓబీసీ కోటా సంగతేంటి?



చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకు ప్రత్యేక కోటా కల్పించాలి. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లను అమలు చేయకపోతే పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చి బిల్లును ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏముంది? ఇది పోస్టు-డేటెడ్ చెక్కులాగా ఉంది. ఎస్సీ, ఎస్టీలతోపాటు ఓబీసీ మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి ఈ సమావేశాల్లో రాజ్యాంగ సవరణ చేయాలి. మహిళా రిజర్వేషన్లను ఎప్పటి నుంచి అమలు చేస్తారో కచ్చితమైన తేదీ, టైమ్‌లైన్‌ను ప్రభుత్వం ప్రకటించాలి. దేశంలో ప్రస్తుతం కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ప్రత్యేక సమావేశాల్లో కరువు నివారణ చర్యలపై చర్చించాలి

- సుప్రియా సూలే, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ

బడుగు వర్గాల మహిళలకు భాగస్వామ్యం కావాలి



మహిళా రిజర్వేషన్లలో వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు భాగస్వామ్యం కల్పించాల్సిందే. ఈ మేరకు అవసరమైతే చట్టంలో సవరణలు చేయాలి. బడుగు వర్గాల మహిళలకు న్యాయం చేకూర్చాలి.

- డింపుల్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ

మహిళలను తప్పుదోవ పట్టిస్తున్నారు



మహిళా రిజర్వేషన్ బిల్లుతో కేంద్ర ప్రభుత్వం దేశంలో మహిళలను తప్పుదోవ పట్టిస్తోంది. ఈ రిజర్వేషన్లను రాబోయే ఎన్నికల్లో అమలు చేయకుండా జాప్యం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. అధికార బీజేపీ నాయకులు మహిళలపై ఎన్నో నేరాలకు పాల్పడ్డారు. వారిపై ఎలాంటి చర్యలకు తీసుకోలేదు. దేశంలో గత ఐదేళ్లలో మహిళలపై నేరాలు 26 శాతం పెరిగినప్పటికీ మోదీ ప్రభుత్వం స్పందించడం లేదు

- హర్‌సిమ్రత్ కౌర్ బాదల్, శిరోమణి అకాలీదళ్ ఎంపీ

మహిళా సాధికారతను అడ్డుకోవద్దు



మహిళా రిజర్వేషన్లలో మైనార్టీలకు కోటా కల్పించాలనడం అర్థరహితం. మతపరమైన రిజర్వేషన్లపై రాజ్యాంగం నిషేధం విధించింది. చట్ట ప్రకారం.. జనగణన, నియోజక వర్గాల పునర్విభజన పూర్తయిన తర్వాతే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంటుంది. వెంటనే అమలు చేయాలని కోరడం సమంజసం కాదు. ఎవరైనా సరే రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను అనుసరించాల్సిందే. మహిళా సాధికారతను అడ్డుకోవద్దని ప్రతిపక్షాలను కోరుతున్నా

- స్మృతి ఇరానీ, కేంద్ర మంత్రి, బీజేపీ నేత

40 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి



పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల్లో మా పార్టీ మహిళలకు 40 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం సైతం దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు 40 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. కేవలం 33 శాతం కాదు, కేంద్ర ప్రభుత్వానికి నిజంగా ధైర్యం ఉంటే 40 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. ఈ విషయంలో మీకు చేతనైతే మమ్మల్ని(తృణమూల్ కాంగ్రెస్)ను పట్టుకోండి చూద్దాం

- కకోలీ ఘోష్-దస్తీదార్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ

పేరును 'రీషెడ్యూలింగ్ బిల్లు' అని పెడితే పోలా?

ఈ బిల్లు ఒట్టి మాయ. షెడ్యూల్ ప్రకారం ఫలానా తేదీకల్లా అమల్లోకి వస్తుందని చెప్పలేము. అలాంటప్పుడు ఈ బిల్లుకు మహిళా రిజర్వేషన్ రీషెడ్యూలింగ్ బిల్లుగా మారిస్తే సరిపోతుంది' అని తృణమూల్ కాంగ్రెస్ మహిళా నేత మహువా మొయిత్రా సభలో ఎద్దేవా చేశారు. ఇదంతా పెద్ద గిమ్మిక్కు.

- టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా

ఓబీసీ కోటా లేకుంటే అసంపూర్ణమే: రాహుల్



న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పూర్తి మద్దతు తెలిపారు అయితే, ఓబీసీలకు కూడా మూడో వంతు రిజర్వేషన్ కోటా లేని పక్షంలో మహిళా బిల్లు అసంపూర్ణమేనని అభిప్రాయపడ్డారు. బిల్లుపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొంటూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కుల గణన జరిగి తీరాల్సిందేనని కూడా రాహుల్ డిమాండ్ చేశారు. ఆయన ఏమన్నారంటే... 'మొత్తం 99 మంది కేంద్ర ప్రభుత్వ కార్యదర్శుల్లో ఓబీసీలు కేవలం ముగ్గురే ఉన్నారు. బడ్జెట్లో కేవలం 5 శాతం మీద మాత్రమే వారికి నియంత్రణ ఉంది. వెనకబడ్డ వర్గాలకు ఇది నిజంగా ఘోర అవమానమే. ప్రస్తుత బిల్లు పెద్ద ముందడుగు. కానీ మహిళా రిజర్వేషన్ల అమలును జన గణన, డీ లిమిటేషన్‌తో ముడి పెట్టడం చిత్రంగా ఉంది. చిత్తశుద్ధి ఉంటే దీన్ని నేటినుంచే అమల్లోకి తేవచ్చు. చూస్తుంటే అదానీ అవినీతి వంటి సమస్యలు, కేంద్రం వైఫల్యాల నుంచి జనం దృష్టి మళ్లించేందుకే బీజేపీ ఈ బిల్లును తెర మీదికి తెచ్చినట్టు కనిపిస్తోంది.

రాష్ట్రపతికి భాగస్వామ్యం ఏదీ?

'పార్లమెంటు కొత్త భవనం చాలా బాగుంది. నేలపై, కుర్చీలపై నెమళ్లు, నెమలీకలు చిత్రించారు. కానీ ఈ భవన ప్రారంభ సంరంభంలో రాష్ట్రపతి కూడా పాల్గొంటే బాగుండేది. ఏమంటే ఆ పదవిలో ఉన్నది ఒక మహిళ. పైగా ఆదివాసీ మహిళ. ఇక కులగణన నుంచి జనం దృష్టి మళ్లించేందుకు మోదీ సర్కారు ప్రయత్నిస్తోంది. దీనికి ఎందుకు వెనకాడుతున్నారో అర్థం కావడం లేదు. దేశంలో ఎందరు ఓబీసీలకు, ఎస్సీలు, ఎస్టీలు, ఆదివాసీలు ఉన్నది తేలాలి. ఇందుకు కులగణనే మార్గం.

ఏకగ్రీవ ఆమోదానికి కలిసి రండి

లోపాలుంటే తర్వాత సరిచేసుకోవచ్చు
- విపక్షాలకు అమిత్ షా విజ్ఞప్తి
- ఎన్నికలు కాగానే కుల గణన, డీ లిమిటేషన్

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందేందుకు కలిసి రావాల్సిందిగా విపక్షాలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. బిల్లులో లోపాలేమన్నా ఉంటే తర్వాత సరిచేసుకుందామని సూచించారు. కేంద్రం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన జోక్యం చేసుకుంటూ ఈ వ్యాఖ్యలు చేశారు. బిల్లు అమలులో ఆలస్యానికి సంబంధించి కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న ఆరోపణలను తోసిపుచ్చారు. మహిళలకు రిజర్వేషన్లు 2029 తర్వాత అమల్లోకి వస్తాయన్న సంకేతాలిచ్చారు. ఓబీసీలకు బీజేపీ పాలనలో అన్యాయం జరుగుతోందన్న విపక్షాల ఆరోపణలను తోసిపుచ్చారు. వారికి తమ హయాంలోనే అన్నింటా అత్యధిక ప్రాతినిధ్యం దక్కిందని చెప్పారు. 'రాబోయే ఎన్నికల తర్వాత కేంద్రంలో వచ్చే నూతన ప్రభుత్వం వెంటనే జన గణన, నియోజకవర్గాల పునర్విభజన చేపడుతుంది. పార్లమెంటులో మహిళా బిల్లు ఆమోదానికి ఇది ఐదో ప్రయత్నం. ఇప్పుడు కాంగ్రెస్ లేవనెత్తిన అడ్డంకులను అధిగమించేందుకు వారి హయాంలో ఎందుకు ప్రయత్నించలేదు? అందుకే గత నాలుగు సార్లూ బిల్లును ఆమోదించలేని పార్లమెంటు తీరుతో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. అందుకే ఈసారైనా ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించుకుందాం' అని విపక్షాలను అమిత్ షా కోరారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న అమిత్ షా

రాహుల్ పై విసుర్లు

90 మంది కేంద్ర కేబినెట్ కార్యదర్శుల్లో ముగ్గురు మాత్రమే ఓబీసీలు ఉన్నారన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యలను అమిత్ ఎద్దేవా చేశారు. 'కార్యదర్శులు దేశాన్ని నడుపుతారన్నది నా సహచర ఎంపీ అవగాహన! కానీ నాకు తెలిసినంత వరకూ ప్రభుత్వమే దేశాన్ని నడుపుతుంది. విధాన నిర్ణయాలు చేసేది కేంద్ర ప్రభుత్వం, పార్లమెంట్' అన్నారు. 'ఎవరో స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన చీటీలను సభలో చదవడం గొప్ప కాదు. ఓబీసీల అభ్యున్నతికి ప్రధాని మోదీ చిత్తశుద్ధితో కృషి చేశారు' అన్నారు. 'బీజేపీ ఎంపీల్లో దాదాపు 29 శాతం మంది ఓబీసీలే. దేశవ్యాప్తంగా 27 శాతానికి పైగా బీజేపీ ఎమ్మెల్యేలు, 40 శాతానికి పైగా ఎమ్మెల్సీలు ఓబీసీలే' అని అమిత్ అన్నారు.

అప్పుడు కేంద్రాన్నే నిందిస్తారు!

మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణం అమల్లోకి తేవాలన్న విపక్షాల డిమాండ్‌ను అమిత్ షా తోసిపుచ్చారు. 'రాహుల్ ప్రాతినిధ్యం వహిస్తున్న వయనాడ్, అసదుద్దీన్ ఒవైసీ (మజ్లిస్ అధినేత) ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ లోక్‌సభా స్థానాలు ఒకవేళ మహిళలకు రిజర్వ్ అయితే రాజకీయాలు చేస్తోందంటూ అందుకు మళ్లీ మోదీ సర్కారునే నిందిస్తారు. అందుకే నియోజకవర్గాల పునర్విభజనను సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జీ సారథ్యంలోని కమిషన్ పూర్తి పారదర్శకంగా చేపడుతుంది' అన్నారు.

నేడు మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి ఫోన్ ఇన్'

సమయం: గురువారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు
ఫోన్ నెంబర్: 98499 06694
అంశం: నగరంలో పారిశుధ్య పరిస్థితి, దోమలు, వ్యాధుల తీవ్రత
- కరీంనగర్ కార్పొరేషన్



గరిష్ఠం/కనిష్ఠం 28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడా స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.




సెల్ఫీ విత్ మట్టి గణేశ్

పర్యావరణాన్ని కాపాడేలా మట్టిగణేశుడిని ప్రతిష్ఠించారా? ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ లేదా ఇళ్లలో మట్టి గణపతులను పూజిస్తున్నారా.. అయితే మీరు పర్యావరణహిత గణేశుడితో సెల్ఫీఫొటో తీసుకుని సెల్ నంబరు **94912 47184**కు వాట్సప్ చేయండి. మీరు పంపిన ఫొటోను 'సాక్షి' దిన పత్రికలో ప్రచురిస్తాం.

మూడుముళ్ల బంధం!

కరీంనగర్ సిటీలో పెరుగుతున్న విడాకులు

- చిన్నచిన్న కారణాలకే గొడవలు
- మూణ్నాళ్లకే కోర్టుమెట్లు ఎక్కుతున్న జంటలు
- పెరుగుతున్న గృహహింస కేసులు
- ప్రభావం చూపని కౌన్సెలింగ్



'కరీంనగర్ సిటీకి చెందిన ఓ జంటకు ఇటీవల వివాహం జరిగింది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. బెంగళూర్‌లో జాబ్ చేస్తున్నారు. మూడు నెలలపాటు వీరి కాపురం సాఫీగా సాగింది. కొద్దిరోజులకు ఒక చిన్న విషయంలో గొడవ జరిగింది. మాటామాటా పెరిగింది. భర్త 'వెళ్లిపో' అనడంతో బ్యాగు సర్దుకుని కరీంనగర్ వచ్చేసింది. తనకు భర్త వద్దని పుట్టింటివాళ్లతో కలిసి ఠాణామెట్లు ఎక్కింది. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా వినకపోగా.. విడాకులకు పట్టుపట్టింది.'

'సిటీకి చెందిన ఓ జంటకు పెళ్లయిన రెండునెలలకే ఆర్థికపరంగా గొడవలు ప్రారంభం అయ్యాయి. ఇందుకు ఆధిపత్య పోరు తోడైంది. మనస్పర్థలు పెంచుకుని పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. తాము కలిసి ఉండమని పోలీసులకు చెప్పేశారు. కౌన్సెలింగ్ చేసినా వినకపోవడంతో చట్టప్రకారం కోర్టును ఆశ్రయించాలని సూచించారు.'

కరీంనగర్‌క్రైం: నిండు నూరేళ్లు అన్యోన్యంగా కలిసి జీవించాల్సిన కొన్నిజంటలు చిన్నచిన్న కారణాలతో మూడుముళ్ల బంధాన్ని తెంచుకుంటున్నారు. కలిసి బతికేందుకు ససేమిరా అంటున్నారు. టెక్నాలజీ అత్యంత వేగంగా పెరుగుతుండటంతో ఉద్యోగాల పేరిట దూరదూర ప్రాంతాలకు వెళ్తున్నారు. దీంతో ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్నాయి. భార్యాభర్తల మధ్య అహం.. అపార్థం, అనుమానాలు.. ఒకరిపై ఒకరికి అపనమ్మకాలతో విభేదాలు వస్తున్నాయి. నాలుగు గోడల మధ్య సర్దుకుపోవాల్సిన బంధాలు చాలావరకు రోడ్డున పడుతున్నాయి. చిన్న సమస్య కూడా చివరికి పెద్ద గాలివానలా మారుతోంది. దంపతుల మధ్య అగాధం పెరిగి చివరికి విడిపోయేందుకు సిద్ధమై పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లే కాదు.. ప్రేమించి పెళ్లి చేసుకున్న వారి పరిస్థితి కూడా మూన్నాళ్ల ముచ్చటగా తయారవుతోంది. దంపతుల మధ్య విభేదాలు వారి పిల్లలపై కూడా ప్రభావం చూపుతోంది. భార్యాభర్తల మధ్య విభేదాలు వచ్చినప్పుడు వారివారి తల్లిదండ్రులు రెండు వైపులా నచ్చచెప్పి సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంది. అలా కాకుండా ఎక్కువ శాతం తల్లిదండ్రులు తమ పిల్లలనే రెచ్చగొడుతుండడంతో అనేక మంది తమ సంసారాన్ని చేజేతులా నాశనం చేసుకుని విడిపోతున్నారు. కేవలం కరీంనగర్ సిటీ పరిధిలోనే ఈ ఏడాదిలో పోలీసులకు 779 ఫిర్యాదులు, సఖీ సెంటర్‌లో 323 కేసులు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ప్రేమ వివాహాల పరిస్థితీ అంతే

ఏళ్ల తరబడి ప్రేమించుకోవడం, తరువాత పెద్దలు ఒప్పుకోలేదంటూ కొందరు పారిపోయి పెళ్లి చేసుకుంటున్నారు. పెళ్లి తర్వాత తగినంత సంపాదన లేకపోవడం, రాజీపడి జీవించలేకపోవడంతో దంపతుల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి.

కారణాలు ఇవీ..

- అనుమానం, వివాహేతర సంబంధాలు
- అదనపు కట్నం వేధింపులు
- దంపతుల్లో కుటుంబ సభ్యులు, ఇతరుల మితిమీరిన జోక్యం
- బంధాల విలువ తెలియకపోవడం
- సర్దుకుపోయే మనస్తత్వం లేకపోవడం
- ఆడంబరాలకు పోయి ఆర్థికంగా చితికిపోవడం
- ఉద్యోగం చేస్తున్న జంటల్లో ఆర్థికస్వేచ్ఛ పెరగడం

కరీంనగర్ మహిళా పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన దంపతుల ఫిర్యాదులు

నెల	పోలీసులకు	సఖీ కేంద్రానికి
జనవరి	72	45
ఫిబ్రవరి	102	36
మార్చి	93	32
ఏప్రిల్	82	38
మే	131	55
జూన్	109	42
జూలై	97	42
ఆగస్టు	93	33

మైనర్లు సైతం

కొంతమంది తల్లిదండ్రుల మధ్య తలెత్తుతున్న మనస్పర్థాలతో పిల్లల విషయంలో పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో మైనర్లు సైతం ప్రేమ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. తెలిసీ తెలియని వయసులో చేస్తున్న తప్పుల కారణంగా కొంతమంది తల్లిదండ్రులు విడిపోతుంటే.. మరికొందరు పిల్లలను వదులుకోలేక వారిని ఒక్కటి చేసేందుకు సరైన వయసు లేక ఆ కుటుంబం మానసిక వేదనకు గురవుతూ 'నీకారణంగానే చెడిపోయారు' అంటూ తల్లీతండ్రీ ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ కుటుంబ బంధాలు బీటలు వారేలా చేసుకుంటున్నారు.

తొందరపాటు నిర్ణయాలు వద్దు



దంపతుల మధ్య గొడవలు వచ్చినప్పుడు తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా తల్లిదండ్రులు సర్దిచెప్పాలి. పోలీసుల వద్దకు వచ్చినా కౌన్సెలింగ్ ఇచ్చి కలుపుతాము. ఆవేశపడి చక్కటి దాంపత్య జీవితాలు నాశనం చేసుకోకుండా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. - జి.నరేందర్, కరీంనగర్ టౌన్ ఏసీపీ

కౌన్సెలింగ్ ఇస్తున్నాం



దంపతుల మధ్య గొడవతో చాలా కేసులు వస్తున్నాయి. కౌన్సెలింగ్ ఇచ్చి కలిసి ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని సందర్భాల్లో దంపతుల బంధాన్ని చిన్నచిన్న కారణాలతో తెంచుకోవడం బాధాకరం. వారికి దాంపత్య విలువను తెలియజేస్తున్నాం. - దామెర లక్ష్మి, సఖి కో ఆర్డినేటర్

కల్చర్ మారుతోంది



మేం పరిశీలించిన కొన్నికేసుల్లో దాంపత్యబంధానికి కనీస విలువలేకుండా పోతోంది. ఒకరిపై ఒకరు పైచేయి సాధించాలనే ప్రయత్నంలో కాపురాలు కూల్చేసుకుంటున్నారు. దాంపత్య బంధం నిలవాలంటే సర్దుకుపోవాలి. - బి.రఘునందన్‌రావు, కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

'మనఊరు- మనబడి' పనులు త్వరగా చేయాలి



రామడుగు/గంగాధర(చొప్పదండి): ప్రభుత్వ పాఠశాలల్లో మనఊరు మనబడి కార్యక్రమం ద్వారా చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ బి.గోపి ఆదేశించారు. రామడుగు మండలం వెలిచాల ఉన్నత పాఠశాలలో బుధవారం మనఊరు–మనబడి కార్యక్రమంలో చేపట్టిన డైనింగ్ హాల్, కిచెన్ షెడ్ పనులను పరిశీలించారు. ఐఎఫ్‌పీ ఆపరేటింగ్ గురించి విద్యార్థులను ప్రశ్నించారు. ఐఎఫ్‌పీ ద్వారా పాఠాలు సులువుగా అర్థం చేసుకోవచ్చని తెలిపారు. స్వచ్ఛందసేవా సంస్థ అందించిన పల్లి పట్టీలు పంపిణీ చేశారు. వెలిచాల సర్పంచ్ వీర్ల సరోజన కలెక్టర్‌ను సన్మానించారు. అనంతరం రామడుగు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మెమొంటోలు అందించారు. అంతకుముందు గంగాధర మండలం కురిక్యాల ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. మధురానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి బాలింతలకు కేసీఆర్ కిట్లు అందించారు. డీఈవో జనార్దన్ రావు, తహసీల్దార్లు రమేశ్‌బాబు, భాస్కర్, ఎంఈవో వేణుకుమార్ పాల్గొన్నారు.



నగరంలో కారు బీభత్సం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లో బుధవారం రాత్రి కారు బీభత్సం సృష్టించింది. మద్యంమత్తులో ఉన్న వ్యక్తి కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డుపై వెళ్తున్న పలు వాహనాలను ఢీకొట్టాడు. ఈ ఘటనలో పలువురికి గాయాలు అయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తపల్లి వైపు నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న కారు మొదటగా స్పెన్సర్స్ వద్ద ఓ కారును ఢీకొట్టగా పలువురికి గాయాలయ్యాయి. అక్కడి నుంచి కారు కోర్టు, మంచిర్యాల చౌరస్తా వైపు వెళ్లింది. ఓ కాంప్లెక్స్ వద్ద రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టింది. స్థానికులు కారును నిలిపేందుకు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. చివరకు ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టడంతో నిలిచిపోయింది. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడని త్రీటౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

న్యూస్‌రీల్

హుజూరాబాద్‌ను సిద్దిపేటలా మారుస్తా

- ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి



హుజూరాబాద్: వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే హుజూరాబాద్‌ను మరో సిద్దిపేటగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సిటీ సెంటర్‌హాల్‌లో ఎల్ఐసీ ఏజెంట్ల ఆత్మీయ సమ్మేళనం లియాఫీ అధ్యక్షుడు పంచల ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని సిద్దిపేట మాదిరిగా చేయకపోతే భవిష్యత్‌లో ఓట్లు అడగనని తెలిపారు. హుజూరాబాద్‌లో మినీస్టేడియం ఏర్పాటు చేస్తానని తెలిపారు. పట్టణంలో కల్యాణ మంటపం, కార్పొరేట్ స్థాయిలో బాలికల ఉన్నత పాఠశాల, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, హుజూరాబాద్ చుట్టూ ఔటర్‌రింగ్ రోడ్డు, చిలుకవాగుపై బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జమ్మికుంటలో వంద పడకల ఆస్పత్రి, వీణవంకలో మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల, చల్లూరు, వావిలాల, ఉప్పల్‌ను మండలకేంద్రాలుగా మారుస్తామని పేర్కొన్నారు. ఇల్లంతకుంటను టెంపుల్‌సిటీ, కమలాపూర్‌ను మున్సిపాలిటీగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో కౌశిక్‌రెడ్డికే తమ మద్దతు ఉంటుందని ఎల్ఐసీ ఏజెంట్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం కేసీక్యాంపు వరకు బైకుర్యాలీగా వెళ్లారు. ఎల్ఐసీ ఏజెంట్ల భవనానికి భూమి పూజ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎంపీపీ రాణి, వైస్ చైర్మన్ నిర్మల, లియాఫీ కార్యదర్శి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్య రక్షణకు చర్యలు



కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థలో పనిచేసే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ సునీల్ రావు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కమిషనర్ ప్రఫుల్‌దేశాయితో కలిసి ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులు అనారోగ్యంగా ఉంటే సక్రమంగా పనిచేయలేరని, అందుకే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ స్వరూపారాణి, శానిటేషన్ సూపర్‌వైజర్ రాజమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ జ్వరాలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

- వాతావరణంలో మార్పులే కారణం
- దోమలతో విజృంభిస్తున్న డెంగీ
- పెరుగుతున్న వైరల్ ఫీవర్ బాధితులు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ

'నుస్తులాపూర్‌కు చెందిన మల్లవ్వ నాలుగు రోజులుగా జ్వరం, కాళ్ల నొప్పులతో బాధపడుతూ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో చేరింది. వైద్యులు రక్త పరీక్షలు చేసి, వైరల్ ఫీవర్‌గా నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు.'

'చింతకుంటకు చెందిన హుస్సేన్‌బీకి వారం రోజుల క్రితం జ్వరం వచ్చింది. చికిత్స తీసుకోవడంతో రెండు రోజులకే తగ్గింది. నాలుగు రోజుల తర్వాత మళ్లీ జ్వరం రావడంతో ఆస్పత్రికి వచ్చింది. వైద్యులు ఓపీ చూసి, ఆమె నీరసంగా ఉండటంతో జాయిన్ చేసుకున్నారు. ప్రస్తుతం చికిత్స పొందుతోంది.'

కరీంనగర్‌టౌన్: జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇంటికొకరు చొప్పున జ్వరాల బారిన పడుతున్నారు. వానాకాలమే అయినప్పటికీ వర్షాలు, లేదంటే ఎండలు దంచికొడుతున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరంతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. దోమల స్వైరవిహారంతో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా మంచం పడుతున్నారు. డెంగీ కేసులూ నమోదవుతున్నాయి.



ఫార్మసీ వద్ద పేషెంట్ల క్యూ

ఈ నెలలో జిల్లా ఆస్పత్రిలో ఓపీ వివరాలు

11న	970
12న	732
13న	764
14న	733
15న	765
16న	796
18న	370
19న	858
20న	837



డెంగీ కేసులు ఈ ఏడాది
107 (ఇప్పటివరకు)

వెయ్యికి చేరువైన ఓపీ..

కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వరపీడితుల తాకిడి పెరిగింది. 10 రోజులుగా జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఓపీ వెయ్యికి చేరువైంది. ఈ నెల 11న 970గా నమోదవడంతో ఆందోళన నెలకొంది. ఇందులో విష జ్వరాల కారణంగా ఓపీ సేవల కోసం వచ్చినవారే ఎక్కువ.



జ్వరపీడితులతో నిండిన ఇన్‌పేషెంట్ వార్డు

అధికారిక లెక్కల ప్రకారం.. ఇప్పటివరకు 107 డెంగీ కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా 300కు పైనే ఉన్నాయి. జిల్లాలో ఐదు రోజుల్లో 7 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీరంతా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ర్యాపిడ్ యాంటిజెన్ కిట్లతో ప్రాథమికంగా నిర్ధారిస్తున్నారు.

9 రోజుల్లో 6,825 మందికి వైద్య పరీక్షలు

కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో గడిచిన 9 రోజుల్లో 6,825 మంది ఓపీలో పరీక్షలు చేయించుకున్నారు. అలాగే 430 మంది వివిధ అనారోగ్య సమస్యలతో అడ్మిట్ అయ్యారు. సీజనల్ వ్యాధులు మరింత పెరిగే అవకాశం ఉండటంతో అందుకు తగినట్లుగా దవాఖానాలో పడకలు, మందులు సిద్ధంగా ఉంచారు.

చికిత్స అందిస్తాం

వ్యాధులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆస్పత్రికి ఓపీ సంఖ్య పెరుగుతోంది. డెంగీ, వైరల్ జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. జ్వరాలతో బాధపడేవారు ఇంటి వద్దే ఉండి, నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలి.
-కృష్ణప్రసాద్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

నైట్ ఫుడ్‌స్టాళ్లకు ఓపెన్ టెండర్

- ఎనిమిదింటిలో ఏడింటికి ఖరారు
- నెలకు అద్దె రూ.5100 నుంచి రూ.5500
- 22న మిగిలిన స్టాల్‌కు టెండర్
- ఈ నెల 25వ తేదీన ప్రారంభం

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో ఏర్పాటు చేయనున్న నైట్ ఫుడ్‌స్టాళ్లకు ఓపెన్ టెండర్ నిర్వహించారు. ఎనిమిది స్టాళ్లకు గాను ఏడుగురు టెండర్ ప్రక్రియలో పాల్గొని ఏడింటిని సొంతం చేసుకున్నారు. మిగిలిన స్టాల్‌కు ఈనెల 22న మరోసారి ఓపెన్ టెండర్ నిర్వహించనున్నారు. నెలవారి అద్దె ప్రాతిపదికన ఈ టెండర్ నిర్వహించగా, రూ.5100 నుంచి రూ.5500 వరకు టెండర్ ఖరారైంది.

మేయర్ సమక్షంలో..

నగరంలోని విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన నైట్‌ఫుడ్ బజార్‌లో స్టాళ్ల నిర్వహణకు బుధవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ల సమక్షంలో ఓపెన్ టెండర్ నిర్వహించారు. నాలుగు నాన్‌వెజ్, నాలుగు వెజ్ స్టాల్స్‌ను నెలవారి అద్దె ప్రాతిపదికన దక్కించుకొనేందుకు టెండర్‌ను ఆహ్వానించగా, ఏడుగురు మాత్రమే పాల్గొన్నారు. స్టాల్స్‌కు నెలకు రూ.5000 అద్దెగా నగరపాలకసంస్థ నిర్ణయించగా, కనిష్ఠంగా రూ.5100, గరిష్ఠంగా రూ.5500 వరకు వ్యాపారులు వేలంలో దక్కించుకున్నారు. కాగా రూ.2 లక్షలు డిపాజిట్‌గా నగరపాలకసంస్థకు చెల్లించిన వారినే ఈ వేలంపాటలోకి అనుమతించారు. వేలంలో దక్కించుకొన్న వ్యాపారులకు లక్కీ డ్రా ద్వారా నంబర్ల వారిగా స్టాళ్లను కేటాయించారు. కాగా 8వ నంబర్‌కు సంబంధించిన నాన్‌వెజ్ స్టాల్‌కు ఎవరూ వేలంపాట పాడలేదు. దీంతో ఈ నెల 22వ తేదీన మరోసారి ఒక్కస్టాల్‌కు బహిరంగవేలం నిర్వహించాలని నిర్ణయించారు. 22న వేలంలో పాల్గొనే వ్యాపారులు నగరపాలక సంస్థ ఆర్‌వో ఆంజనేయులును సంప్రదించాలని రూ.2 లక్షల డీడీని చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.



వేలం పాట నిర్వహిస్తున్న మేయర్, కమిషనర్

నాణ్యత పాటించాలి : మేయర్

వేలంలో స్టాళ్లు దక్కించుకున్న వ్యాపారులు ఆహార పదార్థాల్లో నాణ్యత పాటించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు సూచించారు. బహిరంగ వేలంలో పాల్గొన్న ఆయన వ్యాపారులకు పలు సూచనలు చేశారు. నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు విక్రయించాలన్నారు. ఈ నెల 25వ తేదీన నైట్‌ఫుడ్ బజార్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. అధునాతన డిజైన్లతో కూడిన 8 ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేశామని, అందులో 4 స్టాల్స్ శాఖాహారం, 4 మాంసాహారం ఉన్నాయన్నారు. అలాగే ఫుడ్ బజార్‌లో ప్రత్యేక సీటింగ్ అరెంజ్‌మెంట్, లైటింగ్, స్త్రీ, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్స్, నీటి సౌకర్యం, పిల్లలకు ప్రత్యేకంగా ఆడుకునే పరికరాలతో సకల సౌకర్యాలు కల్పించామన్నారు. నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ స్వరూప రాణి, ఈఈ కిష్టప్ప, ఆర్ఓ ఆంజనేయులు, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

బొమ్మకల్ సర్పంచ్ శ్రీనివాస్‌పై రౌడీషీట్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్‌పై పోలీసులు రౌడీషీట్ తెరిచారు. గత మార్చి 13వ తేదీనే రౌడీషీట్ ఓపెన్‌చేసినట్లు సోషల్‌మీడియాలో ఓ లేఖ చక్కర్లు కొడుతోంది. పురుమల్ల శ్రీనివాస్‌పై 24కు పైగా కేసులు నమోదు అయ్యాయి. ఫోర్జరీ, చీటింగ్, ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు, దురాక్రమణలు, భూ దందాల నేరాల్లో నిందితుడిగా ఉన్నట్లు సదరులేఖలో ఉంది. శ్రీనివాస్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో లేఖ బయటకు రావడం చర్చనీయాంశమైంది. కాగా.. పోలీసులు ముందస్తు వ్యూహంతోనే ఆయనపై కేసు పెట్టినట్లు తెలుస్తోంది. గత సీపీ సత్యనారాయణ పదేపదే శ్రీనివాస్‌పై వచ్చిన ఆరోపణలతో పీడీయాక్టు నమోదు చేసేందుకు సిద్ధమయ్యారు. అతను అధికారపార్టీకి చెందిన వ్యక్తి కావడం, పై నుంచి ఒత్తిడితో వెనకడుగు వేసినట్లు తెలిసింది. ఇటీవల శ్రీనివాస్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది మార్చిలోనే శ్రీనివాస్‌పై నమోదు చేసిన రౌడీషీట్‌ను పోలీసులు తెలివిగా బయటకు తీసినట్లు చర్చ నడుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం అతనిపై కొన్నిరోజుల్లో పీడీయాక్టు నమోదు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై సీపీ సుబ్బారాయుడును సంప్రదించగా శ్రీనివాస్‌పై మార్చిలోనే రౌడీషీట్ తెరిచినట్లు స్పష్టం చేశారు.



శ్రీనివాస్

ఓటింగ్ లక్ష్యం చేరాలి

కరీంనగర్‌స్పోర్ట్స్: వచ్చే ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాగం బుధవారం చేపట్టిన సైకిల్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. నగరంలోని అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రారంభమై కేబుల్‌బ్రిడ్జి వరకు అక్కడి నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు సాగింది. కలెక్టర్ బి.గోపి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ జరిగేలా చూడాలన్నారు. సీపీ సుబ్బారాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ముఖ్యమైందని, ప్రతిఒక్కరు వారి ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, స్వీప్ నోడల్ అధికారి బి.రవీందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీఎస్‌వో రాజవీరు, డీఆర్డీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీలో కలెక్టర్ గోపి, సీపీ సుబ్బారాయుడు

క్లుప్తంగా

మహిళా బిల్లులో బీసీల వాటా స్పష్టం చేయాలి



కరీంనగర్: చట్టసభల్లో మహిళలకు ప్రత్యేక ప్రాతినిధ్యం కోసం పెట్టే బిల్లులో బీసీల వాటా స్పష్టంగా పొందుపరచాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సంఘ. కార్యాలయంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రాచమల్ల రాజుతో కలిసి మాట్లాడుతూ.. బీసీ మహిళలకు రిజర్వేషన్ లేకుండా బిల్లు ప్రవేశపెడితే అగ్రవర్ణాల ఆధిపత్యం పెరుగుతుందని తెలిపారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. బీసీలవాటాతో కూడిన మహిళా బిల్లు వస్తే తప్పా సామాజిక న్యాయం జరిగే ఆస్కారం లేదని అన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్, ప్రధానకార్యదర్శి దొగ్గలి శ్రీధర్, మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వరాల జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ పాల్గొన్నారు.

డీఎస్సీ పోస్టులు పెంచాలి



కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ పోస్టులు పెంచాలని కోరుతూ నిరుద్యోగ అభ్యర్థులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ డీఎస్సీ అభ్యర్థులకు 13,086 పోస్టులు ఉన్నాయని ప్రకటించారని అన్నారు. ప్రస్తుతం ఇచ్చిన నోటిఫికేషన్‌లో 5,089పోస్టులు మాత్రమే వేశారని వాటిని పెంచాలని కోరారు. 2017మాదిరిగా డీఎస్సీ అప్లికేషన్ ఫీజు తగ్గించాలని కలెక్టర్ బి.గోపికి వినతి పత్రం అందజేశారు.

ఆయుష్మాన్‌భవ హెల్త్ మేళా

కరీంనగర్‌టౌన్: ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, బస్తీ దవాఖానాల్లో బుధవారం హెల్త్‌మేళా నిర్వహించినట్లు డీఎంహెచ్‌వో లలితాదేవి తెలిపారు. ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. క్షయ, పొగాకు ఉత్పత్తులు వాడకం ద్వారా వచ్చే అనర్థాలపైన అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు వెల్లడించారు. డాక్టర్ సుజాత, డాక్టర్ జువేరియా, చందు, రవీందర్‌రెడ్డి, సాజిదా, రాజగోపాల్‌రావు పాల్గొన్నారు.

మా మట్టి గణపతి

కరీంనగర్‌కల్చరల్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణకు కొంతమంది మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేశారు. 'సాక్షి' ఆధ్వర్యంలో 'సెల్ఫీ విత్ గణేశ్' నిర్వహించగా మట్టి విగ్రహాలతో సెల్ఫీ దిగి భాగస్వాములు అయ్యారు.



కర్ర ఉమాదేవి, భగత్‌నగర్



చెప్యాల త్రివేణి, భగత్‌నగర్



ముసుకుల లత, భగత్‌నగర్



మొలుగురి శ్రీకాంత్, చింతకుంట



పి.మంజుల, రామచంద్రాపూర్‌కాలనీ



వీజీఎస్ టవర్స్, కరీంనగర్



సీ.లక్ష్మినారాయణ, చింతకుంట



ఈట్టినేని జయంతి, ఆదర్శనగర్



ధనపురి సాగర్, మారుతినగర్



శ్రేయస్, విహాన్, భగత్‌నగర్

మంత్రపురిలో 'భక్తి'ఉద్యమం

- మహారాష్ట్ర నుంచి మంథనికి..
- బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తి
- 106ఏళ్లుగా వినాయక ఉత్సవాలు
- నిజాం కాలం నుంచి కొనసాగింపు

మంథని: మంత్రపురిగా పేరొందిన మంథనిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ 110 ఏళ్లుగా ఏటా వేడుకలు నిర్వహిస్తూ రాష్ట్రంలోనే గుర్తింపు చాటుకున్నారు. ఉత్సవాలు అంటే.. అందమైన సెట్టింగ్‌లు, అన్నదానాలు, పెద్ద ఎత్తున నిమజ్జనం ఊరేగింపులు.. ఇలాంటివి చూస్తాం. కానీ, మనదేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి గణపతి నవరాత్రి ఉత్సవాలు దోహదం చేశాయనే విషయం చాలామందికి తెలియదు. ఆ వివరాలే ఇవీ..

బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తితో..

- బాలగంగాధరతిలక్ మహారాష్ట్రలోని ముంబయిలో వినాయక నవరాత్రి ఉత్సవాల పేరిట 1913లో నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించారు.
- ఆ ఉత్సవాల సందర్భంగా వంటలు తయారు చేసేందుకు మంథనికి చెందిన బ్రాహ్మణ సామాజికవర్గం మధ్యభారత్‌లోని నాగ్‌పూర్(ప్రస్తుత మహారాష్ట్ర)కు వెళ్లివచ్చేవారు.
- అంతేకాదు.. అక్కడి సంప్రదాయం తీసుకొచ్చారు. ఇక్కడ కూడా అదేవిధంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు.
- దైవభక్తి పేరిట మంటపాల వద్ద ప్రజలు కలసుకుని బ్రిటిష్‌తోపాటు నిజాం నిరంకుశ పాలనలకు వ్యతిరేకంగా ఐక్యఉద్యమాలకు వ్యూహరచన చేశారు.
- నాటి స్వాతంత్ర్య సమరానికి చిహ్నంగా నిలిచిన గణపతి నవరాత్రి ఉత్సవాలను సర్వ గణానన మండలి ఆధ్వర్యంలో ఒకేచోట నిర్వహించారు.

నిజాం కాలం నుంచి..

నిజాంకాలం నాటి వినాయక నవరాత్రి ఉత్సవాల సంస్కృతి, సంప్రదాయాలు కాలక్రమంలో అన్నిగ్రామాలకూ విస్తరించాయి. ఈ నేపథ్యంలోనే మంథని పెంజేరుకట్ట హనుమాన్ ఆలయంలో సిద్ధిబుద్ధి గణపతి ఉత్సవాలను 1913 నుంచి ఏటా నిర్వహిస్తున్నారు.



1913లో తొలిసారి ఉత్సవాలు నిర్వహించిన పెంజేరుకట్ట ఉత్సవ కమిటీ(ఫైల్)

- మోతారాంగారి రాజేశ్వర్‌రావు, టక్కేగారి మల్లన్న, మంథని లింగయ్య తదితరులు ఆనాడు ఉత్సవాలు నిర్వహించేవారు.
- అలాగే నడివీధిలో సర్వజన గజానన మండలి పేరిట 1918 నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.
- ఐదేళ్ల క్రితం శతవసంత ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు.
- రావులచెరువు కట్ట గజానన మండలి 99 సంవత్సరాలు పూర్తిచేసుకుంది. వచ్చేఏడాది శతవసంతాల్లో అడుగుపెట్టనుంది.
- మందాటవీధిలో అరవై ఏళ్లుగా ఏటా గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటున్నారు.

నాగ్‌పూర్, మంథనిలోనే సిద్ధిబుద్ధి..

నాగ్‌పూర్, మంథని మినహా దేశంలో ఎక్కడా సిద్ధిబుద్ధి(భార్యలు) విగ్రహాలతో గణేశ్ దర్శనం లభించదు. వంటలకు వెళ్లినవారు నాగ్‌పూర్‌లో గణపతి విగ్రహాన్ని తీసుకుని రైలులో బల్లార్షా వరకు వచ్చి.. అక్కడ విగ్రహం కనిపించకుండా గుడ్డలు చుట్టి, ఎడ్లబండిలో మంథని సమీప గోదావరి తీరం వరకు చేరుకున్నారు. అక్కడి నుంచి కాలిబాటన నిజాం పోలీసుల కంట పడకుండా మంథనికి చేరారని చెబుతున్నారు.

'నార్మల్' పెరుగుతున్నాయి!

- కరీంనగర్ ఎంసీహెచ్‌లో పెరిగిన సాధారణ ప్రసవాలు
- గతేడాది 37 శాతమే
- సత్ఫలితాలనిస్తున్న మిడ్ వైఫరీ వ్యవస్థ

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో సాధారణ ప్రసవాలు పెరుగుతున్నాయి. 2022లో 37 శాతం కాగా ఈ ఏడాది ఇప్పటివరకు 45 శాతం జరిగాయి. సాధారణ ప్రసవాలతో తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారని, వాటిని ప్రోత్సహించాలని ప్రభుత్వ ఆదేశించింది. జిల్లా ఎంసీహెచ్‌లో సిజేరియన్లతో భవిష్యత్తులో వచ్చే అనర్థాలను గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు వివరిస్తూ సాధారణ ప్రసవాల వైపు మొగ్గుచూపేలా చూస్తున్నారు.

ఉచితంగా పరీక్షలు, మందులు

ఒకప్పుడు ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రసవం కోసం చాలా తక్కువ మంది గర్భిణులు వచ్చేవారు. సరైన సదుపాయాలు లేకపోవడం, వైద్య సిబ్బంది కొరత, మెరుగైన వైద్య సేవలందవనే అపనమ్మకం వంటివి ఇందుకు కారణాలు. ఫలితంగా చాలామంది ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లేవారు. నిర్వాహకులు పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేస్తుండటంతో ప్రజలపై ఆర్థికభారం పడుతోంది. ఈ నేపథ్యంలో సర్కారు దవఖానాల్లో ప్రసవాలు పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మహిళలు గర్భం దాల్చింది మొదలు ప్రసవం వరకు అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేయడంతోపాటు నాణ్యమైన మందులు అందిస్తోంది. ప్రసవానంతరం రక్తహీనత ఉన్న బాలింతలకు న్యూట్రిషన్, కేసీఆర్ కిట్లు, నగదు ప్రోత్సాహకం, ఇంటికి చేర్చేందుకు 102 వాహనం సౌకర్యం కల్పిస్తోంది.

లో రిస్క్ వారిని ఎంపిక..

యాంత్రిక జీవనం.. మారిన ఆహారపు అలవాట్లు.. కొంతమంది విశ్రాంతి పేరుతో మంచంపై నుంచి కాలు కింద పెట్టని స్థితి. ఈ క్రమంలో ఊహించని రీతిలో తమకు తామే బరువుగా మారుతూ గర్భస్థ శిశువును భారంగా మోస్తున్నారు. దీంతో సాధారణ ప్రసవం అయ్యే అవకాశాలున్నా శస్త్రచికిత్సకు కారణమవుతున్నారని వైద్యులు అంటున్నారు. ఈ కాన్పులు తల్లీబిడ్డల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కొన్ని సందర్భాల్లో గర్భిణులు ఆరోగ్య పరంగా విషమ పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సాధారణ ప్రసవాలను పెంచేందుకు ఎంసీహెచ్‌లో 2018 నుంచి మిడ్‌వైఫరీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ సిబ్బంది గర్భిణులు నెలనెలా వైద్య పరీక్షలకు వచ్చినప్పటి నుంచే సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పిస్తారు. లో రిస్క్ ఉన్నవారిని ఎంపిక చేసుకొని, నార్మల్ డెలివరీ అయ్యేలా వ్యాయామం చేయించడం, ఆహారపు అలవాట్లు వివరించడం వంటివి చేస్తున్నారు.



కౌన్సెలింగ్ చేస్తున్న వైద్య సిబ్బంది

ఈ ఏడాది జనవరి-ఆగస్టు వరకు జరిగిన ప్రసవాలు

నెల	సాధారణ	సిజేరియన్
జనవరి	211	319
ఫిబ్రవరి	172	255
మార్చి	191	319
ఏప్రిల్	205	301
మే	170	357
జూన్	143	298
జూలై	161	401
ఆగస్టు	252	372
మొత్తం	1,505	2,622



గర్భిణితో వ్యాయామం చేయిస్తున్న సిబ్బంది

అత్యవసరమైతేనే సిజేరియన్

మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో నార్మల్ డెలివరీలు పెరిగాయి. ఇందుకోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతోపాటు వైద్యులు గర్భిణులకు చేస్తున్న కౌన్సెలింగ్, వ్యాయామం ఎంతగానో దోహదపడుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో సిజేరియన్ చేయడం తప్ప సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవం జరిగేలా వైద్యులు, సిబ్బంది సేవలందిస్తున్నారు.

– డాక్టర్ కృష్ణప్రసాద్, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్

వైద్యులు ఏమంటున్నారంటే...

- గర్భిణులకు కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మినహా పూర్తి విశ్రాంతి తప్పదు. అలాగని మంచానికే పరిమితమైతే కండరాలు బిగుతుగా మారుతాయి. మొదటి నుంచి జాగ్రత్తతో కూడిన నడక, ధ్యానం, యోగాసనాలు చేయాలి.
- 9వ నెలలోకి రాగానే నడుము భాగాన్ని రొటేట్ చేయించడం, మెట్లు ఎక్కించడం, తాడు లేదా మంచాన్ని పట్టుకొని కూర్చొని లేవడం, నూనెతో మర్దన చేయడం వంటివి చేస్తే సాధారణ కాన్పు మరింత సులువవుతుంది.
- వ్యాయామంతో శిశువు గర్భంలో నుంచి త్వరగా తేలిగ్గా బయటకు వచ్చే వీలుంటుంది. పురిటి నొప్పులు తక్కువగా ఉంటాయి.

లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ బి.గోపి

కరీంనగర్ అర్బన్: ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్‌ను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి రుణమాఫీ, ఎరువుల లభ్యత, ఆసరా పింఛన్లు, గృహలక్ష్మి, ఆయిల్ పామ్ సాగు, జీవో 58, 59 తదితర అంశాలపై కలెక్టర్ వీసీలో మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటివరకు రూ.1.20లక్షలు రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ చేసిందని, నూతన రుణాల మంజూరుపై ఎస్ఎల్. బీసీలో బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని వివరించారు. గృహలక్ష్మి లబ్ధిదారులను త్వరితగతిన ఎంపిక చేసి రెండు వారాల్లో ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్ బి.గోపి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్ పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించాలి

కిశోర బాలికల్లో వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య భద్రతకు నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ గోపి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం యూనిసెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిలా స్థాయి పరిశుభ్రత కమిటీ మొదటి సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. కిశోర బాలికలు సురక్షితంగా, శుభ్రంగా ఉంటేనే భావితరం బాగుంటుందని అన్నారు. అనంతరం ప్రచార చాట్‌లను ఆవిష్కరించారు. యూనిసెఫ్ రాష్ట్ర ప్రతినిధి కాశీనాథ్, ఇన్‌చార్జి డీఆర్వో పవన్ కుమార్, డీఆర్డీవో శ్రీలత, మెప్మా పీడీ రవీందర్, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి నతానియల్, యూనిసెఫ్ ప్రాజెక్టు సమన్వయకర్త కిషన్ స్వామి,పాల్గొన్నారు.

ల్యాబ్‌లు పరిశీలించిన కేంద్ర వైద్య బృందం



సౌకర్యాలు పరిశీలిస్తున్న బృందం

కరీంనగర్‌టౌన్: కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని నేషనల్ హెల్త్ సిస్టం రిసోర్స్ సెంటర్‌కు చెందిన డాక్టర్ సురభి నేతృత్వంలోని ఐదుగురు వైద్యుల బృందం జిల్లాలో రోగ నిర్ధారణకు సంబంధించి ల్యాబ్‌ల పనితీరు, సౌకర్యాలను తెలుసుకునేందుకు బుధవారం జిల్లా ఆసుపత్రిలో పర్యటించారు. టీ-హబ్‌లో టెస్టులు, మిషనరీ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ లలితాదేవి, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంటత్ డాక్టర్ కృష్ణప్రసాద్ వెంట ఉన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

కరీంనగర్‌స్పోర్ట్స్: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీఈవో సీహెచ్.జనార్దన్‌రావు తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని సెయింట్ జాన్ పాఠశాలలో జరిగిన కరీంనగర్ అర్బన్ జోన్ క్రీడా పోటీలను ప్రారంభించారు. అర్బన్ జోన్ కార్యదర్శి అంతటి శంకరయ్య మాట్లాడుతూ అండర్-14, 17 బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 40పాఠశాలల నుంచి 800మంది విద్యార్థులు 60మంది పీఈటీలు హాజరైనట్లు తెలిపారు. ఎంఈవో మధుసూదనాచారి పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో అభివృద్ధి

సప్తగిరికాలనీ(కరీంనగర్): పిల్లలు మంచి అలవాట్లతో అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలని చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ సంపత్ అన్నారు. బుధవారం మహిళా శిశు సంక్షేమశాఖ అర్బన్ సీడీపీవో ఉమారాణి ఆధ్వర్యంలో సుభాష్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. పిల్లలకు ఉన్న హక్కులు, ఆరోగ్యం, బాల్య వివాహాలు, వేధింపులు, స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా జరుగుతున్న అనర్థాలను గురించి, చిన్న వయస్సులో చెడు అలవాట్లకు గురై ఏ విధంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజమణి, సాయికిరణ్, సఖి లక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న ముఠా అరెస్ట్

కోనరావుపేట(వేములవాడ): పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న ముఠాను రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట పోలీసులు అరెస్టు చేశారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మండలం ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల రాజలింగం వద్ద ఈనెల 6వ తేదీన 80 నాటుబాంబులు లభించాయి. రాజలింగంను అదుపులోకి తీసుకుని విచా రించగా.. తానే నాటుబాంబులను తయారు చేస్తానని, కావాల్సి న ముడిసరుకును కామారెడ్డికి చెందిన గుర్తుతెలియని మహిళ సరఫరా చేస్తుందని తెలిపారు. సీఐ ఆధ్వర్యంలో ఎస్సై ఆంజనేయులు, కానిస్టేబుళ్లు దండి నరేశ్, నవీన్, తిరుపతి, బాలనర్స య్య బృందంగా ఏర్పడి విచారణ చేపట్టారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డికి చెందిన మానెపల్లి చంద్రకళ(65) వద్ద 3 కిలోల పేలుడు పదార్థాల ముడిసరుకు లభించింది. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు వచ్చి సరుకులు అందిస్తారని ఆమె అంగీకరించింది. ఈ నెల 19న ఎప్పటిలాగానే ముడిసరుకును అందజేయడానికి వచ్చి న హైదరాబాద్‌కు చెందిన జగదీశ్ బహాటిని అదుపులోకి తీసుకొని విచారించగా రెండు కిలోల ముడిసరుకు దొరికింది. అతను సరుకును తీసుకొచ్చే బేగంబజార్‌లోని దుకాణంపై దాడి చేసి నారాయణదాస్ సార్థ, అనుచరుడు విఠల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 కిలోల పేలుడు పదార్థాల ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని వివరించారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నంది నాటక ఉత్సవాలకు 'చీకటి పువ్వు' ఎంపిక

కరీంనగర్‌కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ త్వరలో నిర్వహించనున్న నంది నాటక ఉత్సవాలకు కరీంనగర్ చైతన్య కళాభారతి వారి 'చీకటి పువ్వు' నాటిక ప్రాథమిక పరిశీలనలో ఎంపికైనట్లు సంస్థ అధ్యక్షుడు తిప్పర్తి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నాటికను పరమాత్ముని శివరాం రచించగా, మంచాల రమేశ్ దర్శకత్వం వహించారని పేర్కొన్నారు. సినీ రచయిత బుర్ర సాయి మాధవ్ ఆధ్వర్యంలో ఏటా అక్టోబర్‌లో తెనాలిలో నిర్వహించే జాతీయస్థాయి నాటికల పోటీలకు చైతన్య కళాభారతి వారి కొత్త నాటిక 'స్వప్నం రాల్చిన అమృతం' ఎంపికైందని దర్శకుడు మంచాల రమేశ్ తెలిపారు. ఈ నాటికను పరమాత్ముని శివరాం రచించగా దేవులపల్లి గిరిబాబు, కొత్తకొండ సత్యనారాయణ, మంచాల రమేశ్, పరమాత్ముని శివరాం, ఉష, జ్యోతి నటించారని తెలిపారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఇరుకుల్లలో సంకరి రాజుకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. పొలందున్నే పనులు పూర్తికావడంతో ట్రాక్టర్‌ను అక్కడే నిలిపిఉంచగా మంగళవారం రాత్రి బ్యాటరీని ఎత్తుకెళ్లారు. బుధవారం ట్రాక్టర్‌వద్దకు వెళ్లిన రాజు బ్యాటరీలు దొంగతనం జరిగినట్లు గుర్తించి రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బ్లూకోల్ట్స్ పోలీసులు వచ్చి పరిశీలించారు.


సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న నాయకులు

కరీంనగర్: విద్యాశాఖలోని సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 20వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టార్లు కే.భద్రునాయక్, రవీందర్‌రెడ్డి, నాగభూషణం, వెంకటరమణ సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవేనని, ముఖ్యమంత్రి కేసీఆర్ పరిష్కరించాలని కోరారు. సీఆర్పీల జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి గుండా రాజిరెడ్డి, ఎంఐఎస్ జిల్లా అధ్యక్షురాలు వైద్య దీప్తి, మంగ, విజయలక్ష్మి, మంజుల, అర్చన, శ్రీవాణి, రజిత, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుసంఘం రాష్ట్ర క్లాసులు జయప్రదం చేయండి



కరీంనగర్: ఈనెల 22, 23, 24 తేదీల్లో జిల్లాకేంద్రంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జరుగుతాయని, విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ముకుంద లాల్ మిశ్రా భవన్‌లో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడం కోసం, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, మద్దతు ధరలు, ధరణి సమస్య, కౌలు రైతుల సమస్యలు, తదితర సమస్యలపై ఈ శిక్షణ తరగతుల్లో చర్చిస్తామన్నారు.

క్రిమిసంహారక మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి పట్టణ పరిధిలోని రాణీపురానికి చెందిన తాతిరెడ్డి చిన్నపురెడ్డి (77) బుధవారం క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు రాణీపురం గ్రామానికి చెందిన చిన్నపురెడ్డికి ముగ్గురు సంతానం. కుమారుడు రెండేళ్లక్రితం మృతి చెందగా, ఇద్దరు కూతుళ్లు అదే గ్రామంలో నివాసముంటుండంతో వారి వద్దే ఉంటున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరులేని సమయాన్ని గమనించి జీవితంపై విరక్తితో క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కూతురు తుమ్మ అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు



గణేశ్‌నగర్‌లోని మండపం వద్ద పూజలు



మహా నైవేద్యం సమర్పిస్తున్న వనజారెడ్డి



53వ డివిజన్‌లో అన్నదానం చేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కల్చరల్: గణేశ్ నవరాత్రుల్లో భాగంగా నగరంలోని పలు మండపాల వద్ద బుధవారం ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు. 2, 53వ డివిజన్‌లలో మేయర్ సునీల్‌రావు పాల్గొని అన్నదానం ప్రారంభించారు.

అల్ఫోర్స్‌లో గణపతికి మహానైవేద్యం

కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్‌లో విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం మహాగణేశ్‌కు 108 ప్రసాదాలతో మహానైవేద్యం సమర్పించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి సతీమణి డాక్టర్ వనజారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాదాసీదాగా కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలత

కొత్తపల్లి: కరీంనగర్‌లోని కొత్తపల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ పిల్లి శ్రీలత అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. వ్యవసాయ, ప్రాథమిక విద్యా, వైద్య, ఆరోగ్యం, గ్రామీణ నీటి సరఫరా విభాగం, మిషన్ భగీరథ, రెవెన్యూ, పౌరసరఫరాలు, రోడ్లు, భవనాలు, విద్యుత్, ఈజీఎస్, స్త్రీ, శిశు సంక్షేమం, అటవీ, పశు సంవర్ధక శాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖలపై అధికారులు నివేదికలు అందజేశారు. అధార్, రేషన్ కార్డు కేవైసీపై ప్రజల్లో గందరగోళం నెలకొందని, చింతకుంట ఎస్సారెస్పీ బ్రిడ్జిపై వర్షపు నీరు నిలవడం వల్ల ప్రయాణానికి ఆటంకం ఏర్పడుతోందని, చింతకుంట శాంతినగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ భూక్యా తిరుపతినాయక్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ శ్రీలత మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్తూ ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, సీడీపీవో ఉమారాణి, ఏవో రంజిత్‌కుమార్, ఎంఈఓ మధుసూదనాచారి, మండల వైద్యాధికారి వంశీకృష్ణ, పశు వైద్యాధికారి రామకృష్ణ, ఆర్ అండ్‌బీ ఏఈ లక్ష్మణ్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, ఫారెస్టు అధికారి నర్సింగరావు, ఏపీవో రఘుపతి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు గంగమ్మ, పత్తెం శారద, తిరుపతినాయక్, రమేశ్ గౌడ్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

డేటా మైనింగ్ కాన్సెప్ట్‌పై అవగాహన



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో బుధవారం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో డేటా మైనింగ్ కాన్సెప్ట్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వాగేశ్వరీ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై డేటా మైనింగ్ కాన్సెప్ట్స్‌పై ఎక్స్టెన్షన్ లెక్చర్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ సమత, ఏసీవో సుష్మ, కంప్యూటర్ సైన్స్ విభాగం హెచ్‌వోడీ లలితా అశ్విని, అధ్యాపకులు ఇందిర, శారద, నమృత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటేశ్వర్లును సన్మానించారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 10వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన మినీ హైమాస్ట్ లైట్లను బుధవారం మేయర్ సునీల్‌రావు ప్రారంభించారు. నగరంలో మెరుగైన లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ కాసర్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్

కరీంనగర్‌టౌన్: విజయభేరి సభలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం ద్వారా ప్రజల ముందుకు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. 41వ డివిజన్‌లో గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ పథకాలను వివరించారు. డివిజన్ బాధ్యులు శ్రీధర్, రమేశ్, బింది శెట్టి రాజు, ఫిరోజ్ ఖాన్, అహ్మద్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పొరండ్ల రమేశ్, పోచయ్య పాల్గొన్నారు.

కుట్టు మెషిన్ అందజేత



కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలోని రెడ్డిరామయ్యపల్లికి చెందిన బుడిగె భారతి సిలిండర్ పేలుడులో శరీరం కొంతభాగం కాలగా, భర్త శ్రీనివాస్ కరోనా సమయంలో మృతి చెందగా జీవనోపాధి లేక ఇబ్బంది పడుతున్న ఆమెకు హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధి చింతల శ్రీనివాస్‌రెడ్డి కుట్టు మెషిన్‌ను ఉచితంగా అందజేశారు.

నగరంలో ట్రాఫిక్ తిప్పలు

- వాహనాల సంఖ్య పెరగడంతో రద్దీ
- పలు చౌరస్తాల్లో కష్టంగా మారిన ట్రాఫిక్ నియంత్రణ
- బస్టాండ్ చౌరస్తా వద్ద నిత్యం ఇబ్బందులు



నగరంలోని ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్‌తో నిలిచిన వాహనాలు (ఫైల్)

కరీంనగర్‌క్రైం: నగరంలో రోజురోజుకు ట్రాఫిక్ తిప్పలు పెరుగుతూనే ఉన్నాయి. పెరుగుతున్న వాహనాలు, వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతో ట్రాఫిక్ రద్దీకి కారణమవుతోంది. ఫలితంగా పలు చౌరస్తాల్లో ట్రాఫిక్ నియంత్రణ కష్టతరంగా మారింది. ముఖ్యంగా బస్టాండ్ చౌరస్తాలో నిత్యం బస్సులు లోనికి వెళ్లే దారిలో ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు వద్ద ఆటోలు ఇష్టారాజ్యంగా నిలపడం, బస్టాండుకు వచ్చే వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు ఆపి దిగడంతో బస్టాండు ప్రాంతంలో ట్రాఫిక్‌కు కారణమవుతోంది.

నిబంధనలు పాటించని వాహనదారులు

నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్, టవర్‌సర్కిల్, ప్రకాశం గంజ్, పాతబజార్, రాజీవ్‌చౌక్ వంటి రద్దీ ప్రాంతాల్లో క్రమపద్ధతిలో ఎవరి వైపు నుంచి వారు వెళ్లకుండా ఇష్టారాజ్యంగా వెళ్తుండటంతో ఎదురెదురుగా వాహనాలు నిలిచి నిత్యం నిమిషాల తరబడి ట్రాఫిక్‌లో ఉండిపోతున్నాయి. ట్రాఫిక్ జామ్ అయిన తర్వాత ట్రాఫిక్ పోలీసులు వచ్చి క్లియర్ చేసే వరకు అలాగే నిలిచి ఉండడడం చాలా సార్లు జరిగింది. ఇకనైనా ట్రాఫిక్ పోలీసులు పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



పెరుగుతున్న వాహనాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. వాటిని గుర్తించి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. బస్టాండు వద్ద ట్రాఫిక్ జామ్ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఆటోడ్రైవర్లకు పలు సూచనలు ఇచ్చాం. అక్కడ రద్దీ పెరుగకుండా తక్షణ చర్యలు చేపడుతున్నాం. రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతాం.

– ఎండీ.సర్వర్, ట్రాఫిక్ ఏసీపీ

రాంగ్‌రూట్‌లో..



ఇష్టారాజ్యంగా వెళ్తున్న వాహనదారులు

పలు ప్రాంతాల్లో రాంగ్‌రూట్‌లో వాహనాలు వెళ్తుండటంతో ప్రమాదాలకు కారణమవుతోంది. రాంగ్‌రూట్‌లో ఇష్టారాజ్యంగా వెళ్తుండడంతో సరైన రూట్‌లో వెళ్లే వాహనదారులు అయోమయానికి గురవుతూ ప్రమాదాలకు గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. నగరంలోని కోతిరాంపూర్ డివైడర్ వద్ద రాంగ్‌రూట్‌లో పోచమ్మ ఆలయం. గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్‌కు వెళ్లడం, కమాన్‌చౌరస్తాలో రాంగ్‌రూట్‌లో వచ్చి గణేశ్‌నగర్‌లోకి ప్రవేశించడం, లక్ష్మీనగర్‌లోకి వెళ్లడం, వన్‌టౌన్ పోలీసుస్టేషన్ చౌరస్తా నుంచి రాంగ్‌రూట్‌లో అంబేడ్కర్ స్టేడియం, సిక్‌వాడీ వైపు వెళ్లడం, పోలీసు హెడ్‌క్వార్టర్స్ నుంచి వచ్చి రాంగ్‌రూట్‌లో కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లడం, తెలంగాణ చౌక్ వద్ద, మిషన్ ఆసుపత్రి ఎదురుగా డివైడర్ వద్ద, కోర్టు చౌరస్తా నుంచి వ్యతిరేక దిశలో వావిలాలపల్లికి, మంచిర్యాల చౌరస్తా, ఎస్సారార్ కళాశాల చౌరస్తాతో పాటు ఇంకా ప్రధాన దారుల్లోని పలు చౌరస్తాల వద్ద రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు పెరగడంతో సరైన రూట్‌లో వచ్చే వారు ఆగిపోవడంతో ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతోంది.

వినాయక మండపాల సందర్శన



నిర్వాహకులతో మాట్లాడుతున్న వీహెచ్‌పీ బాధ్యులు

కరీంనగర్‌కల్చరల్: నగరంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను బుధవారం విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నిర్వాహకులను సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. వసతులు, లోటుపాట్లపై చర్చించారు. నిమజ్జన ఏర్పాట్లు, నిర్వాహకులు తెలిపిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పలు శాఖల అధికారులతో చర్చిస్తామని అన్నారు. నిమజ్జనం రోజున అన్ని వర్గాల, మతాల ప్రజలు సహకరించాలని, సమస్యలు వస్తే తమకు కానీ, పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సందర్శించిన వారిలో వీహెచ్‌పీ గోరక్షక్ విభాగ్ ప్రముఖ్ రాధాకృష్ణారెడ్డి, విద్యాసాగర్, శంకర్, శంకర్, తదితరులున్నారు.

డిప్యూటీ తహసీల్దార్ పోస్టు భర్తీ చేయండి

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పోస్టు పోస్టును భర్తీ చేయాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు రెహమాన్, జిల్లా కోఆర్డినేటర్ అమీర్ బుధవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

మిల్లెట్ ఆహారంతో ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

కరీంనగర్: మిల్లెట్ ఫుడ్‌తో కిశోర బాలికలు, తల్లులు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ అన్నారు. పోషణ మాసం పురస్కరించుకొని కట్టరాంపూర్ సవరన్ హైస్కూల్‌లో మంగళవారం కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు మిల్లెట్ ఫుడ్, పౌష్టికాహా రంపై అవగాహన కల్పించారు. అందుబాటులో దొరికే చిరుధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆరెపల్లిలో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు దుర్శేడ్ సెక్టార్ లెవల్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ఆరెపల్లిలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీడీపీవో ఉమారాణి హాజరై మాట్లాడుతూ సమతుల ఆహారంతో రక్తహీనతను అరికట్టవచ్చని తెలిపారు. బాలామృతం, కేసీఆర్ కిట్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పౌష్టికాహార ప్రదర్శన, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్పొరేటర్ తుల రాజేశ్వరీ, సూపర్‌వైజర్ నిర్మల, ఏఎన్ఎం స్వర్ణలతతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

మేదరుల ర్యాలీ



చాటలు, గంపలతో మేదరి కులస్తులు

సప్తగిరికాలనీ: ప్రపంచ వెదురు బొంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మేదరి సంఘం ఆధ్వర్యంలో నగరంలో తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట వెదురే ముద్దు ప్లాస్టిక్ వద్దంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు మదుర రవీందర్, నగర అధ్యక్షుడు రమేశ్, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సిటీలో పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కేవీ మెహర్‌నగర్, వరలక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలోని మెహర్‌నగర్, వరలక్ష్మీనగర్, డిమార్ట్, సీతారాంపూర్‌లో కొంతభాగం, రెడ్డి ఫంక్షన్ హాల్ వెనక ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలు

కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్ మైదానంలో గురువారం నుంచి 23వ తేదీ వరకు కొత్తపల్లి మండలం స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల బాధ్యుడు గిన్నె లక్ష్మణ్ తెలిపారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి సౌజన్యంతో ఎంఈవో మధుసూదనాచారి పర్యవేక్షణలో అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. గురువారం బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 22న బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 23న అథ్లెటిక్స్‌లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకొని రావాలని సూచించారు. ప్రతీ టీం నుంచి ఐదుగురు క్రీడాకారులకు మాత్రమే సెలక్షన్ ట్రయల్స్‌కు అనుమతి ఉంటుందని పేర్కొన్నారు.

సుడా అనుమతి పేరిట అక్రమ షెడ్డు నిర్మాణం

- అడ్డుకున్న వార్డుసభ్యులు




అసైన్డ్ స్థలంలో నిర్మిస్తున్న షెడ్డు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లోని అసైన్డ్ స్థలంలో సుడా అనుమతి పేరిట కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి చేపట్టిన షెడ్డు నిర్మాణం వివాదాస్పదంగా మారింది. బుధవారం వార్డుసభ్యులు షెడ్డు నిర్మాణాన్ని అడ్డుకుని పనులను నిలిపివేసి పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. 2021 సంవత్సరంలో ఇదే స్థలంలో ప్రహరీ నిర్మాణాన్ని సదరు వ్యక్తి చేపట్టగా రెవెన్యూ, పంచాయతీ అధికారులు అసైన్డ్ స్థలంలో నిర్మాణాలు చేయవద్దంటూ నిలిపివేయించారు. రెండేళ్ల అనంతరం సుడా అనుమతి ముసుగులో మళ్లీ షెడ్డు నిర్మాణం చేపట్టగా అధికారుల వ్యవహరిస్తున్న తీరుపై పలు అనుమానాలు తలెత్తున్నాయి.

అసైన్డ్ స్థలంలో దర్జాగా నిర్మాణం

మొగ్దుంపూర్‌లోని సర్వే నం.424లోని ఆరుగుంటల అసైన్‌మెంట్ స్థలాన్ని కొనుగోలు చేసిన కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి బుధవారం షెడ్డు నిర్మాణం ప్రారంభించాడు. సమాచారం అందుకున్న ఉప సర్పంచ్ కూకట్ల తిరుపతి, వార్డు సభ్యులు మాదాసు శివరామకృష్ణ, మైలారం శ్రీనివాస్, మంద అశోక్‌లు అక్కడికి చేరుకుని షెడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. సుడా అనుమతితో షెడ్డు నిర్మిస్తున్నట్లు నిర్మాణదారుడు చెప్పగా అసైన్డ్‌స్థలంలో ఎలా నిర్మిస్తారంటూ వాగ్వాదానికి దిగారు. అధికారులు వచ్చే వరకు ఎలాంటి నిర్మాణాలు చేయవద్దంటూ నిలిపివేయించారు. అసైన్డ్ స్థలంలో సుడా పేరిట అక్రమంగా షెడ్డు నిర్మిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఉప సర్పంచ్ తిరుపతి పంచాయతీ కార్యదర్శి సల్మాన్, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం షెడ్డు నిర్మాణ పనులను నిలిపి వేయించామని ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం సుడా అనుమతి పత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయానికి రావాల్సిందిగా నిర్మాణదారుడికి సూచించినట్లు పేర్కొన్నారు.

అనూప్‌కు సన్మానం



కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి డెమోక్రటిక్ చెస్ డెవలప్‌మెంట్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సీనియర్ చెస్ క్రీడాకారుడు కంకటి అనూప్‌కుమార్‌ను బుధవారం ఉమ్మడి జిల్లా ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. చిన్న వయస్సులోనే మేధస్సుకు పదును పెట్టే క్రీడ చెస్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్‌లో చెస్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కోశాధికారి మహేందర్, సంఘం బాధ్యులు ప్రేంరెడ్డి, లక్ష్మీనారాయణ, మధునయ్య, లక్ష్మణ్, బత్తిని శ్రీధర్, ముజఫర్, మహేశ్ వికాస్, గౌతమ్, ఆనంద్, రఘు, మధుతో సుమారు 50 మంది పీఈటీలు పాల్గొన్నారు.

ఈకేవైసీతో డీలర్ల కుస్తీ

- లబ్ధిదారుల వేలిముద్రలు మ్యాచ్‌కాక తిప్పలు
- బియ్యం పంపిణీలో జాప్యం



మొగ్దుంపూర్‌లో లబ్ధిదారుడి ఐరిష్ సేకరిస్తున్న డీలర్

కరీంనగర్‌రూరల్: రేషన్‌బియ్యం పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈకేవైసీ విధానం డీలర్లకు సంకటంగా మారింది. రేషన్ కార్డులోని లబ్ధిదారులందరి వేలిముద్రలు సేకరించే ప్రక్రియలో జాప్యంతో బియ్యం పంపిణీ సక్రమంగా జరగడంలేదు. ఒకవైపు లబ్ధిదారులకు బియ్యం పంపిణీతో పాటు మరోవైపు వేలిముద్రలు సేకరించే ప్రక్రియ డీలర్ల సహనానికి పరీక్ష పెడుతోంది.

వేలిముద్రలు మ్యాచ్‌కాకపోవడంతో ఇబ్బంది

కరీంనగర్ మండలంలో మొత్తం 29 రేషన్ దుకాణాలున్నాయి. 15,358 రేషన్‌కార్డులు ఉండగా 45,574 యూనిట్లు ఉన్నాయి. పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు రేషన్ లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియను డీలర్లు చేపట్టారు. ప్రతినెలా 1 నుంచి 15వరకు బియ్యం పంపిణీ చేస్తారు. అయితే ఈనెల బియ్యం కోటా కేటాయింపులో ఆలస్యం కావడంతో పలువురు డీలర్లు వారం రోజుల నుంచి బియ్యం పంపిణీ చేస్తున్నారు. అయితే బియ్యం పంపిణీ పూర్తయిన కొందరు డీలర్లు ఈకైవేసీ ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించగా బియ్యం స్టాక్ ఉన్న డీలర్లు ఇంకా చేపట్టలేదు. లబ్ధిదారులు స్వయంగా రేషన్ దుకాణానికి వచ్చి ఈ–పాస్ యంత్రంలో వేలిముద్రలు వేసి ఆధార్‌కార్డుతో లింక్ చేసిన అనంతరం ఈకేవైసీ ప్రక్రియ పూర్తవుతోంది. అయితే వృద్ధులతోపాటు కొందరి లబ్ధిదారుల వేలిముద్రలు మ్యాచ్ కాకపోవడంతో డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చివరకు ప్రత్యామ్నాయంగా లబ్ధిదారుల నేత్రాలను ఐరిష్ ద్వారా నమోదు చేస్తున్నారు. దీంతో ఒక్కో లబ్ధిదారుడికి సుమారుగా ఐదు నుంచి పది నిమిషాల సమయం పడుతుండటంతో ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. సాంకేతిక సమస్యలతో ఈకేవైసీ పూర్తి చేయడం డీలర్లకు కత్తిమీద సాములా మారింది.

ఈకేవైసీ ఎక్కడైనా చేసుకోవచ్చు

కుటుంబ సభ్యులందరూ ఒకేసారి రేషన్ దుకాణానికి వచ్చి వేలిముద్రలు ఇచ్చినట్లయితే ఈకేవైసీ చేయడం డీలర్లకు సులువుగా ఉంటుంది. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దు. ఈకేవైసీని ఎక్కడి రేషన్ దుకాణంలోనైనా చేసుకునే అవకాశముంది.

– తాటి పూర్ణచందర్‌రావు, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు

నిర్ణీత గడువు లేదు

కరీంనగర్ మండలంలోని రేషన్ దుకాణాల్లో రెండు రోజుల నుంచి ఈకేవైసీ ప్రక్రియ ప్రారంభమైంది. రేషన్‌కార్డు లబ్ధిదారుల ఈకేవైసీకి ఎలాంటి నిర్ణీత గడువు లేదు. రేషన్ దుకాణం పరిధిలోని లబ్ధిదారులందరి వేలిముద్రలు లేదా ఐరిష్ సేకరించి ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి.

– శంకర్, నాయబ్ తహసీల్దార్, కరీంనగర్‌రూరల్ మండలం

మార్కెట్‌లోకి 'నెక్సాన్' వాహనం విడుదల



కరీంనగర్: నగరంలోని కోతిరాంపూర్‌లో గల టాటా సెలెక్ట్ షోరూంలో సరికొత్త టాటా న్యూ నెక్సాన్ వాహనాన్ని కరీంనగర్ ఎస్‌బీఐ ఆర్‌ఎం రవిశేఖర్ బుధవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కారు కనీస ఈ షోరూం ధర రూ.8,09,700 నుంచి ప్రారంభమవుతుందని అన్నారు. మొత్తం 8 వేరియంట్లలలో లభిస్తుందని ప్రతీ వేరియంట్‌లో ఆరు ఎయిర్ బ్యాగ్స్ ఉంటాయని, రక్షణ, అత్యాధునిక సౌకర్యాలతో లభిస్తుందని తెలిపారు. జనరల్ మేనేజర్ శ్రీపాల్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

స్కిల్ కుంభకోణం బాబు ఆలోచనల నుంచే

అంతిమ లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన సంబంధీకులే

ఆయన నుంచి మరింత సమాచారాన్ని రాబట్టాల్సి ఉంది..

పోలీసు కస్టడీకి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావట్లేదు

నిందితుడు న్యాయస్థానాన్ని శాసించలేడు

5 రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టును అభ్యర్థించిన సీఐడీ న్యాయవాదులు

కోర్టును శంకించేలా కౌంటర్ దాఖలు చేసిన చంద్రబాబు న్యాయవాదులు

కేసును తాము విచారించడంపై అభ్యంతరం ఉందా? అని ప్రశ్నించిన న్యాయస్థానం

తాము సర్టిఫై చేయాల్సిన అవసరం లేదన్న బాబు న్యాయవాదులు

నేడు తీర్పు వెలువరిస్తామన్న న్యాయస్థానం

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ సీఎం చంద్రబాబు నుంచి మరింత సమాచారాన్ని రాబట్టేందుకు ఐదు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌లో వాదనలు ముగిశాయి. దాదాపు మూడున్నర గంటల పాటు వాదనలు విన్న ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం దీనిపై గురువారం తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది. అంతకు ముందు సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ చంద్రబాబు ఆలోచనల నుంచే స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం పుట్టిందని కోర్టుకు నివేదించారు. దీనికి సంబంధించిన ప్రతి విషయం ఆయనకు తెలుసని, ఈ కుంభకోణంలో అంతిమ లబ్ధిదారులు చంద్రబాబుతో పాటు ఆయనకు సంబంధించిన వ్యక్తులేనని నివేదించారు. తమ వద్ద ఉన్న ఆధారాలను దగ్గర పెట్టుకుని చంద్రబాబును విచారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంత పెద్ద కుంభకోణంలో 24 గంటల్లో దర్యాప్తు పూర్తి చేయడం సాధ్యం కాదన్నారు. చంద్రబాబును తాము (సీఐడీ) విచారిస్తే ఆయనకు వచ్చిన నష్టం ఏమీ ఉండదని, అదే తాము విచారించకుంటే దర్యాప్తునకు తీరని నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. పోలీసు కస్టడీకి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి కాబట్టే చంద్రబాబు పోలీసు కస్టడీని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. నిందితుడు కోర్టును అలా చేయడానికి వీల్లేదు, ఇలా చేయడానికి వీల్లేదని శాసించలేడన్నారు. నిందితుడు ముందు న్యాయం మోకరిల్లరాదని, ఒకవేళ అలా జరిగితే వ్యవస్థ కుప్పకూలినట్లేనన్నారు. విచారణలో మౌనంగా ఉండే హక్కు నిందితుడికి ఉందని, అయితే విచారణకు సహకరించాల్సిన బాధ్యత కూడా నిందితుడిపై ఉందని కోర్టుకు నివేదించారు. ఈ కుంభకోణాన్ని రాజకీయ కారణాలతో వెలికి తీసినట్లు చంద్రబాబు న్యాయవాదులు చెబుతున్నారని, వాస్తవానికి దీన్ని పుణె జీఎస్టీ అధికారులు వెలికి తీశారని తెలిపారు. ఈ కుంభకోణానికి సంబంధించిన వివరాలను జీఎస్టీ అధికారులు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం (టీడీపీ సర్కారు) దృష్టికి తెచ్చారని, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఎలా దారి మళ్లించారో వివరించారని చెప్పారు. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం నామమాత్రపు చర్యలతో జీఎస్టీ అధికారులు ఇచ్చిన సమాచారాన్ని తొక్కిపెట్టిందని తెలిపారు. ఆ తరువాత షెల్ కంపెనీల గుట్టు రట్టు కావడంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగి వాటితో సంబంధం ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాయని చెప్పారు. ఐటీ శాఖ నోటీసులు ఇవ్వగానే చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన ఇద్దరు వ్యక్తులు విదేశాలకు పారిపోయారని కోర్టు దృష్టికి తెచ్చారు. ప్రజాధనంతో ముడిపడి ఉన్న ఇలాంటి కేసును రాజకీయ ప్రేరేపితం, కక్ష సాధింపు అనడం దారుణమన్నారు. చంద్రబాబు పాత్రకు సంబంధించిన ఆధారాలను సేకరించేందుకు ఒకటిన్నర సంవత్సరం పట్టిందని, దీన్ని బట్టి ఎంత పకడ్బందీగా ఈ కుంభకోణానికి వ్యూహరచన చేశారో అర్థం చేసుకోవాలని కోర్టును కోరారు. చంద్రబాబును విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని అభ్యర్థించారు.

మేం సర్టిఫై చేయాల్సిన అవసరం లేదు..

ఏసీబీ కోర్టు కేసు విచారణ మొదలు కాగానే సీఐడీ కస్టడీ పిటిషన్‌లో చంద్రబాబు దాఖలు చేసిన కౌంటర్‌ను పరిశీలించింది. అందులో కోర్టును శంకించేలా పేర్కొన్న అంశాలపై అభ్యంతరం తెలిపింది. చంద్రబాబు న్యాయవాదుల తీరుతో ఒకింత మనస్తాపం చెందిన కోర్టు.. ఈ కేసును తాము విచారించడంపై మీకేమైనా అభ్యంతరం ఉందా? అంటూ సీఐడీ న్యాయవాదులను ప్రశ్నించింది. నిబంధనల ప్రకారం విచారణ జరుపుతున్న నేపథ్యంలో తమకు అభ్యంతరం లేదని సీఐడీ న్యాయవాదులు చెప్పారు. ఇదే ప్రశ్నను చంద్రబాబు తరఫు న్యాయవాదులను కోర్టు అడిగినప్పటికీ వారు మౌనంగా ఉన్నారు. అయినప్పటికీ కోర్టు మరోసారి అడగటంతో.. తాము సర్టిఫై చేయాల్సిన అవసరం లేదంటూ చంద్రబాబు తరఫు న్యాయవాదులు ఒకింత తీవ్ర స్వరంతో బదులిచ్చారు. దీంతో కోర్టు విచారణను ప్రారంభించింది.

ఇప్పుడు కస్టడీ కోరడం ఏమిటి?

చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే అన్ని ఆధారాలు సేకరించామని, వాటి ఆధారంగా చంద్రబాబును జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపాలని సీఐడీ మొదటి రోజే కోర్టును కోరిందని పేర్కొన్నారు. అన్ని ఆధారాలు సేకరించినప్పుడు ఇప్పుడు తిరిగి పోలీసు కస్టడీకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఏముందన్నారు. స్కిల్ కేసులో 2021లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, 2023లో చంద్రబాబును అరెస్ట్ చేసిందని, ఇంత కాలం సీఐడీ ఏం చేస్తున్నట్లని ప్రశ్నించారు. వారి అలసత్వానికి చంద్రబాబును కస్టడీకి కోరడానికి వీల్లేదన్నారు. 45 ఏళ్లుగా చంద్రబాబు కాపాడుకుంటూ వచ్చిన ప్రతిష్టను కాలరాసేందుకే సీఐడీ ఆయన్ను కస్టడీకి ఇవ్వాలని కోరుతోందన్నారు. సిట్ కార్యాలయంలో చంద్రబాబును విచారిస్తున్న సమయంలో దర్యాప్తు అధికారులు ఆ వివరాలను మీడియాకు లీక్ చేశారని తెలిపారు. చంద్రబాబు ఎమ్మెల్యే కాబట్టి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఈ కేసు మొత్తం ఎంపీ, ఎమ్మెల్యేల కేసులను విచారించే ప్రత్యేక కోర్టుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కేసును విచారించే పరిధి ఏసీబీ కోర్టుకు లేదన్నారు.

పరిధి లేకుంటే ఎందుకీ పిటిషన్లు?

దీనికి సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ సుధాకర్‌రెడ్డి, స్పెషల్ పీపీ వివేకానంద తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేల కేసులను విచారించే ప్రత్యేక కోర్టులు.. ప్రజా ప్రతినిధులు నిందితులుగా ఉన్న కేసుల్లో చార్జిషీట్ దాఖలైన తరువాత ట్రయల్ మొదలు పెట్టి విచారణ కొనసాగించేందుకు మాత్రమే ఉద్దేశించినవన్నారు. రిమాండ్ విషయంలో ఆ కోర్టులు జోక్యం చేసుకోలేవన్నారు. ఒకవేళ ఏసీబీ కోర్టుకు విచారణ పరిధి లేదని భావిస్తే ఆ విషయాన్ని మొదటే చెప్పి ఉండాల్సిందన్నారు. ఏసీబీ కోర్టుకు విచారణ పరిధి లేకుంటే హౌస్ రిమాండ్, బెయిల్, మధ్యంతర బెయిల్ ఇలా ఇన్ని పిటిషన్లు ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించారు. ఒకవైపు పరిధి లేదంటూనే మరో వైపు ఇన్ని పిటిషన్లు వేయడం చంద్రబాబు తీరును తెలియచేస్తోందన్నారు.

ఆ దృశ్యాలతో మాకేం సంబంధం లేదు..

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. విచారణ దృశ్యాలు మీడియాలో రావడంపై ప్రశ్నించింది. ఆ దృశ్యాలను తాము లీక్ చేశామంటున్న చంద్రబాబు న్యాయవాదులు అందుకు ఆధారాలుంటే చూపాలని సీఐడీ స్పెషల్ పీపీ వివేకానంద కోరారు. ఆ దృశ్యాలు మీడియాలో ఎలా వచ్చాయో, వాటిని ఎవరు చిత్రీకరించారో తమకు తెలియదన్నారు. విచారణ రోజు చంద్రబాబును ఆయన కుటుంబ సభ్యులు, సహాయకులు కూడా కలిశారని కోర్టు దృష్టికి తెచ్చారు.

బాబు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద జరిగిన విధ్వంసానికి సంబంధించి ముదివేడు పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేశ్‌రెడ్డి బుధవారం విచారణ జరిపారు. అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నందున విచారణను గురువారానికి వాయిదా వేయాలని ఆయన తరఫు జూనియర్ న్యాయవాది కోర్టును కోరారు. శుక్రవారానికి వాయిదా వేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాది కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. యుద్ధభేరి పేరుతో చంద్రబాబు చేపట్టిన సాగు నీటి ప్రాజెక్టుల సందర్శన సందర్భంగా అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద టీడీపీ శ్రేణులు విధ్వంసానికి దిగాయి. ఈ విధ్వంసాన్ని చిత్తూరు జిల్లా పుంగనూరు వరకు కొనసాగించాయి. పుంగనూరు ఘటనలో 40 మందికి పైగా పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసులో చంద్రబాబు ప్రధాన నిందితుడిగా ఉన్నారు.

వైఎస్ భాస్కర్‌రెడ్డికి 12 రోజులు మధ్యంతర బెయిల్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డికి హైదరాబాద్ ప్రత్యేక సీబీఐ న్యాయస్థానం 12 రోజుల మధ్యంతర బెయిల్‌కు అనుమతిచ్చింది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని, 15 రోజుల పాటు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ భాస్కర్‌రెడ్డి ప్రత్యేక సీబీఐ కోర్టులో ఈనెల 9న పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇరు పక్షాల వాదనలు ముగియడంతో సీబీఐ కోర్టు బుధవారం ఉత్తర్వులు వెలువరించింది. భాస్కర్‌రెడ్డికి వైద్య పరీక్షల నిమిత్తం ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి వచ్చే నెల 3వ తేదీ ఉదయం 10.30 గంటల వరకు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేసింది. హైదరాబాద్‌లో ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు అనుమతిచ్చింది. ఈ 12 రోజులు నగరం విడిచి వెళ్లకూడదని స్పష్టం చేసింది. ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌తో ఎస్కార్ట్ ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. ఈ నెల 22న భాస్కర్‌రెడ్డిని ఎస్కార్ట్ పోలీసులకు అప్పగించాలని తెలిపింది. అలాగే వచ్చే నెల 3న ఎస్కార్ట్ పోలీసులు జైలు సిబ్బందికి తిరిగి ఆయన్ని అప్పగించాలని ఆదేశించింది.

విశాఖలోనూ సీఎం క్యాంపు కార్యాలయం

- దసరా పండుగ రోజున అక్కడి నుంచి పరిపాలనకు శ్రీకారం
- మంత్రులతో స్పష్టం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన ఎప్పుడు మొదలవుతుందనే అంశంపై కొంత కాలంగా సాగుతున్న చర్చకు సీఎం వైఎస్ జగన్ తెరదించారు. విశాఖపట్నంలోనూ సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి, దసరా నుంచి పరిపాలన ప్రారంభిద్దామని మంత్రులతో స్పష్టం చేశారు. సీఎం కార్యాలయం మొదలు వివిధ శాఖల కార్యాలయాల ఏర్పాటుకు భవనాలను గుర్తించేందుకు అధికారులతో ఒక కమిటీ వేస్తామని చెప్పారు. ఇక్కడి నుంచి విశాఖపట్నంకు కార్యాలయాల తరలింపునకు అధికారులతో మరో కమిటీ వేస్తామన్నారు. దసరాలోగా కార్యాలయాలను తరలించి.. పండుగ రోజునే విశాఖ కేంద్రంగా పరిపాలన మొదలు పెడతామని చెప్పారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో బుధవారం సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమైంది. ఎజెండాలోని అంశాలపై చర్చ ముగిశాక సమావేశం నుంచి అధికారులు నిష్క్రమించారు. ఆ తర్వాత మంత్రులతో సీఎం వైఎస్ జగన్ సమకాలీన రాజకీయ పరిస్థితులపై చర్చించారు. దసరా విశాఖపట్నంలోనే జరుపుకుందామని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. ఆ రోజు నుంచి విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన మొదలు పెడతామనడంతో మంత్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



చర్చావేదికలో మాట్లాడుతున్న దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం తొలి వీసీ సత్యనారాయణ

న్యాయ ప్రక్రియ అందరికీ సమానమే

- కొందరు దీన్ని పక్కదారి పట్టిస్తున్నారు
- 'స్కిల్'స్కామ్‌లో జీఎస్టీదే ఎక్కువ పాత్ర
- అవినీతిపై పక్కా ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు
- 'రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ లైఫ్'చర్చావేదికలో న్యాయ నిపుణులు

సాక్షి, విశాఖపట్నం: రాజ్యాంగం ప్రకారం న్యాయ ప్రక్రియ అందరికీ సమానమేనని, కానీ ఉన్నత స్థానాల్లో ఉన్న కొందరు దీన్ని పక్కదారి పట్టిస్తున్నారని న్యాయ నిపుణులు పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పక్కా ఆధారాలతోనే మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు జరిగిందని స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థపై గానీ, న్యాయమూర్తులపై గానీ విమర్శలు చేయడం తగదన్నారు. 'రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ లైఫ్'అనే అంశంపై వైజాగ్ ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం విశాఖలో చర్చా వేదిక నిర్వహించారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ) తొలి వైస్ చాన్స్‌లర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ అత్యాశ ఒక స్థాయి దాటిపోతే అవినీతికి దారితీస్తుందని, ఇది సమాజానికి పెను ప్రమాదమన్నారు. కొందరు ప్రముఖులు తమ పీఏలు, అనుచరుల ద్వారా అవినీతికి పాల్పడుతున్నారని డీఎస్ఎన్ఎల్‌యూ తొలి రిజిస్ట్రార్ ఎ.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఒక ప్రముఖ ప్రజాప్రతినిధి అవినీతి కేసులో అరెస్టయితే నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నారని, అదే సామాన్యుడి విషయంలో మాత్రం అలా జరగదన్నారు. ప్రధాని స్థాయి నుంచి సామాన్యుడి వరకు రూల్ ఆఫ్ లా ఒకేలా ఉండాలన్నారు. రూల్ ఆఫ్ లా కొంతమందికి అర్థం కావడం లేదని, అర్థమైన వారు కులాలు, పార్టీలుగా విడిపోతున్నారని చెప్పారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై ఎన్నో కేసులున్నా అక్కడ ఆందోళనలు జరగడం లేదని గుర్తు చేశారు. ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ కుమారుడిపై కూడా అసత్య సమాచారం ఇచ్చారంటూ కేసు నమోదైందని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో సీఐడీ కంటే జీఎస్టీ పాత్రే ఎక్కువగా ఉందన్నారు. సీఐడీ అన్ని ఆధారాలతో చంద్రబాబును అరెస్టు చేసి రూల్ ఆఫ్ లాను పాటిస్తే ఒకవర్గం మీడియా, ఒక సామాజికవర్గం కక్ష సాధింపు అంటూ దుష్ప్రచారం చేస్తోందని సీనియర్ న్యాయవాది పాకా సత్యనారాయణ పేర్కొన్నారు. రూల్ ఆఫ్ లా విషయంలో పాలకులు, గత పాలకులు, ప్రజాప్రతినిధులు అతీతులు కారని వైజాగ్ ఇంటెలెక్చువల్ ఫోరం ప్రెసిడెంట్, యూపీఎస్సీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ కేఎస్ చలం స్పష్టం చేశారు. అవినీతి కేసుల్లో పలువురు మాజీ సీఎంలు అరెస్టయ్యారని, చంద్రబాబు అరెస్టు కొత్త కాదని లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జి.సుబ్బారావు పేర్కొన్నారు.

పరపతి ఉంది కాబట్టే అప్పులు పుడుతున్నాయి



మాట్లాడుతున్న వినోద్‌కుమార్



కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- రాష్ట్రంలో త్వరలో మైక్రో ప్లానింగ్ పథకం

కొండగట్టు(చొప్పదండి): తెలంగాణకు పరపతి ఉంది కాబట్టే అప్పులు పుడుతున్నాయని, తెచ్చిన అప్పులను కరెంట్ ఉత్పత్తి, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టుల వంటి నిర్మాణానికి ఖర్చు చేశామని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కొడిమ్యాల సర్పంచ్ ఏలేటి మమత, నర్సింహారెడ్డితోపాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సుమారు 500మంది చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి వినోద్‌కుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తెచ్చిన అప్పులను ఒక్క రూపాయి కూడా సంక్షేమ పథకాలకు తరలించలేదన్నారు. వచ్చేనెల 6, 7తేదీల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని, నవంబర్ చివరివారం, డిసెంబర్ మొదటివారంలో ఎన్నికలు జరిగే అవకాశముందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల ప్రకటించిన మేనిఫెస్టో బీఆర్ఎస్ పథకాలకు కాపీ మాత్రమేనన్నారు. రాష్ట్రంలో మైక్రో ప్లానింగ్ పథకం అమలు చేస్తామని, వెనుకబడిన ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే మైక్రో ప్లానింగ్ లక్ష్యమని తెలిపారు. గతంలో రాష్ట్రంలో మూడు మెడికల్ కళాశాలలు మాత్రమే ఉండేవని, నేడు జిల్లాకొకటి చొప్పున మంజూరు చేసుకున్నామని వివరించారు. రాబోయే రోజుల్లో జెడ్పీ, మండల పరిషత్ స్కూళ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ అభివృద్ధిని చూసే పార్టీలో చేరుతున్నారని వివరించారు. కొడిమ్యాల మండలంలో పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎంపీపీ మేనేని స్వర్ణలత, జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, నాయకులు పునుగోటి కృష్ణారావు, మేనేని రాజనర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు లోపభూయిష్టం

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా బిల్లు లోపభూయిష్టంగా ఉందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లో మాట్లాడుతూ.. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలన్న లక్ష్యంతో కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లును తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. బిల్లులో పలు లోపాలు ఉన్నాయని, ఆ అవాంతరాలను వీలైనంత వేగంగా పరిష్కరించి కేంద్రం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. ఇప్పుడున్న బిల్లు ప్రకారం ఇప్పటికిప్పుడు మహిళా బిల్లు చట్టంగా రూపొందే అవకాశాల్లేవని, అది అమలు కావాలంటే.. మరో పదేళ్లు పడుతుందని విమర్శించారు. రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశపెట్టిన ఈ బిల్లులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని తెలిసిపోతుందని విమర్శించారు.



నియోజకవర్గాల డీలిమిటేషన్ అమలు, జనాభా లెక్కల అనంతరం ఈ బిల్లు చట్టంగా మారుతుందని కేంద్రం తెలిపిందన్నారు. పదేళ్లకోసారి జరగాల్సిన జనాభా లెక్కలు 2021లో కోవిడ్ కారణంగా జరగలేదు.. ఈ లెక్కన చూసినపుడు 2031లో జనాభా లెక్కలు పూర్తయిన తరువాతే ఈ బిల్లు అమలులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈక్రమంలో మరో పది లేదా పదిహేనేళ్లు పూర్తయిన తర్వాతే అమలవుతుందని స్పష్టంచేశారు.

సవాళ్లు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

కరీంనగర్‌క్రైం: ఎలాంటి సవాళ్లు ఎదురైన సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని రాజన్న జోన్ డీఐజీ కె.రమేశ్ నాయుడు అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని రూరల్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఏసీపీ కరుణాకర్‌రావు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. తొలుత గౌరవవందనం స్వీకరించారు. కార్యాలయంలోని వివిధ రికార్డులు తనిఖీ చేశారు. డీఐజీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలన్నారు. పెండింగ్ కేసులు, అసాంఘిక కార్యకలాపాలు తగ్గించే దిశగా విచారణ చేపట్టాలని సూచించారు. కరీంనగర్ పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు, ఇన్‌స్పెక్టర్లు ఇంద్రసేనారెడ్డి, రవీందర్, రాజ్‌కుమార్, ప్రదీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐజీ కె.రమేశ్‌నాయుడు

సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

కరీంనగర్: తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ బాలురు, బాలికలకు 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించబడునని ప్రాంతీయ సమన్వయాధికారి మేరి యేసుపాదం ఒక ప్రకటనలో తెలిపారు. వీటీజీసెట్–2023, బీఎల్‌వీసెట్–2023 పరీక్ష రాసి సీటు వచ్చి జాయిన్ కాలేని వాళ్లకు ఎస్సీ అనాథ, ఎస్సీ వికలాంగులకు ప్రాధాన్యం ఇవ్వబడునని తెలిపారు. విద్యార్థులు సీటు వచ్చిన కాపీ, హాల్ టికెట్, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, ఇతర సంబంధిత పత్రాలతో ఈనెల 23న చింతకుంట గురుకుల పాఠశాలలో ఉదయం 10గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

స్వీయ ఆవిష్కరణకు టెక్నాలజీ తోడవ్వాలి



కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడుతున్న పార్థసారథి

- రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి
- ఆర్జీయూకేటీ విద్యార్థులకు అవగాహన



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న పార్థసారథి

భైంసా: స్వీయ ఆవిష్కరణకు టెక్నాలజీ తోడవ్వాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం బాసర ట్రిపుల్‌ఐటీకి వచ్చిన ఆయనకు కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ ఘనస్వాగతం పలికారు. అనంతరం పార్థసారథి పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. కలెక్టర్, ఏఎస్పీ, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌తో కలిసి ఆడిటోరియంలోని యాక్టివిటీ సెంటర్‌లో 'సాంకేతిక రంగంలో నైపుణ్యాలు సాధించుకోవడం ఎలా' అనే అంశంపై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించి వారిలో నూతనోత్తేజాన్ని నింపారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు విద్యార్థుల నైపుణ్యాలపైనే ఆధారపడి ఉంటాయని తెలిపారు. నేటి సాంకేతికరంగంలో కృత్రిమ మేధస్సు పెను మార్పులను తీసుకువస్తోందని పేర్కొన్నారు. 21వ శతాబ్దంలో నైపుణ్యాలతో కూడిన కోర్సుల ఆవశ్యకతను వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో భారతీయులే ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకుని ప్రతీ విద్యార్థి తమలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సమన్వయకర్త రాజేశ్‌రెడ్డి, అధ్యాపకులు హరిబాబు, డాక్టర్ పావని, సృజన, నారాయణ, హరికృష్ణ, ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి, బాసర ఎస్సై గణేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

9999 నంబరుకు రూ.4.61లక్షలు

- ఆన్‌లైన్‌లో వాహనాల నంబర్ల వేలం
- రవాణా శాఖకు భారీ ఆదాయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వాహనాల నంబర్లకు ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో మంచిర్యాల జిల్లా రవాణా శాఖా కార్యాలయానికి బుధవారం భారీగా ఆదాయం సమకూరింది. టీఎస్ 19 హెచ్ సిరీస్ ముగింపుతోపాటు టీఎస్ 19 జే సిరీస్ ప్రారంభంలో రవాణాశాఖకు భారీ ఆదాయం వచ్చింది. టీఎస్ 19 హెచ్ 9999 నంబర్‌కు ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో గత ఏడాది సిరీస్‌లో రూ.3 లక్షల వరకు రాగా ఈ ఏడాది రూ.4,61,111 ఆదాయం వచ్చింది. ఇక బుధవారం ఒక్క రోజే 12 వాహనాల లక్కీ నంబర్లకు ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో టీఎస్ 19 హెచ్ 9999 నంబరు కోసం ఆన్‌లైన్‌లో నలుగురు పోటీ పడగా విక్టర్ దినేశ్ రూ.4,61,111కు దక్కించుకున్నాడు. టీఎస్ 19 జే 0001 నంబరు కోసం ముగ్గురు పోటీ పడగా అరికెపూడి శివకుమార్ రూ.1.17 లక్షలకు సొంతం చేసుకున్నాడు. టీఎస్ 19 జే 0006 నంబరు కోసం ఇద్దరు పోటీ పడగా మంచిర్యాలకు చెందిన కంకణాల శ్యాంసుందర్ రూ.95 వేలకు సొంతం చేసుకున్నాడు. టీఎస్ 19 జే 0009 నంబరు కోసం ఇద్దరు పోటీ పడగా మంచిర్యాలకు చెందిన రాజశేఖర్ అతి తక్కువలో అంటే రూ.50,000కే సొంతం చేసుకోవడం గమనార్హం. ఇవే కాకుండా టీఎస్ 19 హెచ్ 9988 నంబరుకు రూ.5 వేలు, టీఎస్ 19 హెచ్ 9995 నంబరుకు రూ.2 వేలు, టీఎస్ 19 జే 0008 నంబరుకు 13,600, టీఎస్ 19 హెచ్ 9996 నంబరు రూ.5 వేలు, టీఎస్ 19 జే 0005 నంబరు రూ.10 వేలు, టీఎస్ 19 హెచ్ 9998 నంబరు రూ.5 వేలు, టీఎస్ 19 హెచ్ 9008 నంబరు రూ.5 వేలు, టీఎస్ 19 జే 0003 నంబరు రూ.10 వేలు, టీఎస్ 19 హెచ్ 9969 నంబరు రూ.5 వేలతో బిడ్డింగ్ పలికింది. ఇక రవాణా శాఖకు ఈ నంబర్ల ఫీజుల ద్వారా రూ.2,04,000, మొత్తం బిడ్డింగ్ ద్వారా రూ.7,11,712 వరకు ఆదాయం సమకూరినట్లు డీటీఓ కిష్టయ్య తెలిపారు. కాగా రవాణా శాఖలో వాహన నంబర్ల కేటాయింపు సిరీస్ ముగింపు, ప్రారంభంలో రవాణా శాఖకు భారీగా ఆదాయం వచ్చింది.



మంచిర్యాల జిల్లా రవాణా శాఖా కార్యాలయం

ర్యాగింగ్‌కు పాల్పడి జీవితం నాశనం చేసుకోవద్దు

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: మెడికోలు తోటి విద్యార్థుల ను ర్యాగింగ్ పేరిట ఇబ్బందులకు గురిచేసి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్‌లో యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావే శం బుధవారం నిర్వహించారు. సమావేశాని కి డీఎస్పీ ఉమేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాతీయ వై ద్య కమిషన్ ఆదేశాల మేరకు ఎవరైనా ర్యా గింగ్‌కు పాల్పడితే వారిపై కఠిన చర్యలు త ప్పవని హెచ్చరించారు. జూనియర్లు సీనియర్లపై గౌరవంగా ఉండాలని, అలాగే సీనియ ర్లు జూనియర్లతో స్నేహభావంతో మెలగాల ని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కేసు ల నమోదుతో పాటు అడ్మిషన్ కూడా రద్దు చే స్తామని హెచ్చరించారు. సమావేశంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విద్యవిల్సన్, రిమ్స్ సూపర్ స్పెషాలిటీ మెడికల్ సూపరింటెండెంట్ ఇద్రిస్ అక్బాని, వైద్యాధికారులు సంజయ్ మంజరి, రవీందర్‌రెడ్డి, హరీష్, ఓంప్రకాశ్, శ్యాంప్రసాద్, సుమలత, సింధుజ, విజయ, మెడికోలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

టీన్ డిప్రెషన్



ఇంటి ప్రేమే అసలు వైద్యం

సమాజంలో టీనేజ్ పిల్లల్లో డిప్రెషన్ పెరిగిందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఆత్మహత్యలు తార్కాణాలుగా నిలుస్తూనే ఉన్నాయి. కాని తల్లిదండ్రులు మేల్కొనడం లేదు. టీనేజ్‌లో ఉన్న పిల్లల మూడ్స్‌ను గమనించి వారిని అక్కున చేర్చుకోవాల్సింది మొదట తల్లిదండ్రులే. వైద్యం మొదలవ్వాల్సింది ఇంటి నుంచే. డిప్రెషన్ సూచనలు కనిపించే పిల్లల్ని ఎలా కాపాడుకోవాలి? తెలుసుకుందాం.

ఏదో భయం. ఆందోళన. తల్లిదండ్రుల అంచనాకు తగినట్టు లేనని భయం. మార్కులు తగినన్ని తేలేకపోతున్నానని భయం. పాఠాలంటే భయం. పరీక్షలంటే భయం. ఒంటరిగా ఉండాలంటే భయం. స్నేహితులు లేరని భయం. స్నేహితులతో స్నేహం చెడుతుందేమోనని భయం. ఎవరితో చెప్పుకోవాలో తెలియని భయం. ఎవరితోనూ చెప్పుకోలేనేమోనని భయం.

టీనేజ్ పిల్లలు ఎదిగీ ఎదగని లేత వయసు పిల్లలు. వారికి అన్నీ సందేహాలే. ఆందోళనలే. మన దేశంలో 13–17 ఏళ్ల మధ్య ఉన్న దాదాపు కోటిమంది టీనేజ్ పిల్లలు డిప్రెషన్ బారిన పడుతున్నారని ఒక అంచన. డిప్రెషన్‌లో భయం, ఆందోళన ఉంటాయి. ఈ వయసులో మొదలైన డిప్రెషన్ కొందరిని ముప్పైల్లో, నలభైల్లో ప్రవేశించే వరకు వెంటాడుతుంది. కొందరిని జీవితాంతం వెంటాడవచ్చు. ఇలాంటి స్థితిలో ఉన్న పిల్లలు చీమను కూడా భూతద్దంలో చూసి భయపడతారు. తమ సమస్యకు సమాధానం లేదేమో, ఎవరి నుంచీ దొరకదేమో అనిపించడమే డిప్రెషన్ అత్యంత ప్రమాదకరమైన స్థితి. సమస్యకు పరిష్కారం చావు అనిపించడం దీని పర్యవసానం. ఇంతవరకూ వచ్చే లోపు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి పిల్లల్ని కాపాడుకుంటే వారు ఆ స్థితిని దాటుతారు. లేదంటే అపాయంలో పడతారు.

కారణాలు

టీనేజ్ పిల్లల్లో డిప్రెషన్, యాంగ్జయిటీ రావడానికి కారణాలు ఇదమిత్థంగా తేల్చలేము. చదువుకు సంబంధించిన ఒత్తిడి, తల్లిదండ్రులతో బలమైన అనుబంధం మిస్ కావడం, ర్యాంకుల బరువు, భవిష్యత్తుపై బెంగ, రూపం గురించిన చింత, మెదడులో అసమతుల్యత... ఏమైనా కావచ్చు.

> **అసలు సమస్య**
>
> మనదేశంలో దాదాపు 4 వేల మంది సైకియాట్రిస్టులు, వెయ్యి మంది క్లినికల్ సైకాలజిస్టులు ఉన్నారు. వీరంతా పెద్ద ఆస్పత్రుల్లో లేదా సొంత క్లినిక్‌లలో ఉంటారు. టీనేజ్ పిల్లలకు వీరితో యాక్సెస్ ఉండదు. స్కూళ్లలో మానసిక సమస్యలు గమనించి భరోసా ఇచ్చే కౌన్సెలర్‌ల వ్యవస్థ ఇప్పటికీ ఏర్పడలేదు. ప్రభుత్వ బడులలో చదివే పిల్లలకు తమకు మానసికంగా ఇబ్బంది ఉన్నట్టు గ్రహించడం కూడా తెలియదు. కనుక పిల్లలు ఆత్మహత్యలు చేసుకునే వరకూ వెళుతున్నారు.

మనదేశంలోని సీబీఎస్‌ఈ స్కూళ్లల్లో సర్వే చేస్తే చాలామంది పిల్లలు తమకు క్లోజ్ ఫ్రెండ్స్ లేరని చెప్పారు.

లక్షణాలు

ఉత్సాహం చూపకపోవడం, చిరాకు, కోపం, ఆత్మవిశ్వాసం సన్నగిల్లడం, నిద్ర సరిగా ఉండకపోవడం, అలసట, ధ్యాస లేకపోవడం, సరిగా చదవలేక పోవడం...

ఏం చేయాలి?

ముందు తల్లిదండ్రులు, తదుపరి స్కూళ్లు శ్రద్ధ వహించాలి.

- తల్లిదండ్రులు టీనేజ్‌లో ఉన్న పిల్లలతో నిత్యం సంభాషణ జరపాలి. వారితో కూచుని వారు నిస్సంకోచంగా తమ సమస్యలు చెప్పుకోనివ్వాలి. వారు చెప్పేది కొట్టేయకుండా, బదులు తిట్టకుండా అర్థం చేసుకోవాలి. సమస్య మూలాల వరకూ వెళ్లాలి. వారికి చాలా ప్రేమను ఇస్తూ కౌన్సెలింగ్ చేయాలి. రెండు శాతం కంటే తక్కువ మంది పిల్లలకు మందులతో వైద్యం అవసరం కావచ్చు.
- తల్లిదండ్రులు పిల్లల శ్రద్ధ, శక్తిని అంచనా వేస్తూ వారికి లక్ష్యాలు ఇవ్వాలి. వారికి పూర్తిగా ఇష్టం లేని, వారు చేయలేని చదువులో ప్రవేశ పెట్టరాదు. వారు గట్టి స్నేహితులు కలిగి ఉండేలా చూడాలి. ఆ స్నేహితులను ఇంటికి ఆహ్వానించి పిల్లలు వారితో గడిపేలా చేయాలి. పిల్లలను గాయపరిచే మాటలు తల్లిదండ్రులు మాట్లాడటం బొత్తిగా మానుకోవాలి. మేమున్నామన్న భరోసా ఇవ్వాలి.
- స్కూళ్లు విధిగా కౌన్సిలర్లను ఉంచాలి. తరగతి వారీగా, ప్రతి విద్యార్థిని మెంటల్ హెల్త్ విషయంలో అంచనా కట్టాలి. వారి సమస్యను అర్థం చేసుకుని టీచర్లకు, లెక్చరర్లకు అవగాహన కల్పించడమే కాక తల్లిదండ్రులకు సమస్య తెలపాలి.

వ్యాధి కుంగదీసినా... కళ గెలిపించింది

స్కూలు అకడమిక్ పరీక్షల్లో కాస్త వెనకబడితేనే కుంగిపోతుంటారు. పిల్లలు. అలాంటిది పదేళ్ల వయసులో తన శరీరం మీద తెల్లని మచ్చలు రావడం చూసిన ఆశా ఖత్రికి ఏమీ అర్థం కాలేదు. తన స్నేహితులు, చుట్టుపక్కల వారి శరీరం మీద అలాంటి మచ్చలు ఏవీ కనపడకపోవడంతో తను ఏదో ప్రత్యేకంగా ఉన్నట్లు భావించి.. అందరిలా తను లేదని చాలా బాధపడింది. తనకొచ్చిన బొల్లి మచ్చలు పోవడం లేదని తీవ్ర నిరాశకు లోనైంది. ఏది ప్రయత్నించినా తనకి ఎదురే వచ్చాయి. అయినా తన చిన్ననాటి అలవాటునే ఉజ్వల భవిష్యత్‌గా మార్చుకుని, సక్సెస్‌ఫుల్ బిజినెస్ ఉమన్‌గా ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోంది ముప్పైరెండేళ్ల ఆశాఖత్రి.



ఆశాఖత్రి



రాజస్థాన్‌లోని చిత్తోర్‌ఘ‌ర్‌కు చెందిన ఆశా ఖత్రి పదేళ్ల వయసులో ఉన్నప్పుడు మిగతా పిల్లల్లా కాకుండా ఒళ్లంతా తెల్లని మచ్చలతో కొంచెం అసాధారణంగా ఉండేది. తన రూపాన్ని చూసుకుని చిన్నారి ఆశా చాలా కుంగిపోయింది. అది గమనించిన తల్లిదండ్రులు, స్నేహితులు ఆమెను ఎంతో ప్రేమగా చూసుకుంటూ ఆమెలో ధైర్యాన్ని నింపుతూ, వైద్యం చేయించేవారు. ఎంతోమంది డాక్టర్లకు చూపించినప్పటికీ పెద్ద మార్పు రాలేదు.

కుంగిపోయినప్పటికీ...

తన పరిస్థితి చూసుకుని ఎప్పుడూ బాధపడే ఆశ.. మందులు, హార్మోన్లలో మార్పుల వల్ల విపరీతమైన బరువు పెరిగిపోయింది. దీంతో సమాజంలో తిరగాలంటే చాలా బిడియంగా ఉండేది తనకు. అంగవైకల్యం ఉన్న అమ్మాయిలా అందరూ తనని చూసేవారు. ఇంత బాధలోనూ ధైర్యం తెచ్చుకుని ఎం.ఎ., బీఈడీ. చేసింది. చదువు పూర్తయ్యాక ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమైంది. సంవత్సరాలపాటు కష్టపడినప్పటికి కాలం కలిసిరాక ఉద్యోగం రాలేదు. ఎవరి మీదా ఆధారపడకుండా తన కాళ్లమీద తనే నిలబడాలనకునే ఆశ.. ఏదో ఒకటి చేసి సంపాదించాలన్న కోరికతో రకరకాలుగా ప్రయత్నిస్తూ చివరికి క్రొచెట్‌ను ఎంచుకుంది.



అలవాటునే సంపాదనగా...

క్రొచెట్ టాయిస్‌ను తయారు చేసే కళ ఒక తరం నుంచి మరోతరానికి బదిలీ అవుతుంటుంది. ఆశ చిన్నప్పుడు అల్లికలతో బొమ్మలు తయారుచేసే క్రొచెట్‌కళను తన అమ్మ, అమ్మమ్మల దగ్గర నేర్చుకుంది. వివిధ రకాల బొమ్మలు చేస్తుండేది. ఆ అవాటే తన డెస్టినీ అవుతుందని ఎప్పుడూ అనుకోలేదు. అనేకప్రయత్నాలు విఫలం అయ్యి దిక్కుతోచని రోజులవి. అది 2021 నవంబర్. ఒకరోజు ఆశ...తన చుట్టాల పిల్లలు క్రొచెట్ టాయిస్‌తో ఆడడం చూసింది. క్రొచెట్ టాయిస్‌తో ఆ పిల్లలు ఎంతో సంతోషంగా ఉండడం గమనించిన ఆశ.. తను కూడా ఆ టాయిస్‌ను తయారు చేసి ఆన్‌లైన్‌లో విక్రయించవచ్చన్న ఆలోచన వచ్చింది. అనుకున్న వెంటనే తనకు తెలిసిన క్రొచెట్ కళతో చిన్న ఆక్టోపస్‌ను తయారు చేసి అందరికి చూపించింది. అది చూసిన వారంతా చాలా బావుంది. క్యూట్‌గా ఉంది అని చెప్పడంతో.. మరికొన్ని టాయిస్ తయారు చేసి, ఎగ్జిబీషన్‌లో ప్రదర్శించింది. అక్కడ ఆ టాయిస్‌ను చూసిన వారంతా ఇష్టపడి కొనడం, ఆశకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చింది.

తన బొమ్మలకు వస్తోన్న ఆదరణను చూసి మరిన్ని టాయిస్‌ను రూపొందించి చిన్నచిన్న ఎగ్జిబిషన్ లలో విక్రయించేది. అక్కడ వచ్చిన స్పందనతో తన వ్యాపారాన్ని మరింత విస్తరించింది. తను తయారు చేసే టాయిస్‌ను ఇన్‌స్టాగ్రామ్, ఇంకా వెబ్‌సైట్ ఆశ్.టాయిస్.స్టూడియో పేరిట విక్రయిస్తోంది. రెండువేలకుపైగా బొమ్మలు అమ్ముడయ్యాయి. ఆశ టాయిస్‌కు దేశవ్యాప్తంగా కస్టమర్లు ఉన్నారు. పిల్లలు ఆడుకునే బొమ్మల నుంచి ఇల్లు,ఆఫీసు అలంకరణకు వాడే వివిధ రకాల వస్తువులను తయారు చేసి విక్రయిస్తోంది. జైపూర్‌లో బాగా పాపులర్ అయిన ''టాటూ కేఫ్'' కు డ్రీమ్ క్యాచర్స్‌ను తయారు చేసి ఇవ్వడం విశేషం.

ఒకపక్క బొల్లి, మరోపక్క అధిక బరువు ఉన్నప్పటికీ... తన టాలెంట్‌తో అందమైన క్రొచెట్ టాయిస్‌ను రూపొందిస్తూ కస్టమర్ల మనసులు గెలుచుకుంటోంది ఆశాఖత్రి. దారులన్నీ మూసుకు పోయినప్పటికీ... ఏదో ఒకదారి తెరిచే ఉటుంది. ఓపిగ్గా ఆ దారిని వెతికి పట్టుకుంటే బంగారు భవిష్యత్‌కు మార్గం సుగమం అవుతుందనడానికి ఆశాఖత్రి ఉదాహరణగా నిలుస్తోంది.



మినీషా భరద్వాజ్

భయాన్ని వదిలించిన బొమ్మలు!

ప్రతి మనిషికి ఏదో ఒక భయం ఉంటుంది. ఆ భయాన్ని జయించి ముందుకెళ్తుంటారు చాలామంది. మినీషా భరద్వాజ్ మాత్రం భయంతో ఇంట్లో గదికే పరిమితమైపోయింది. మినీషాకు ఉన్న 'అఘోరా ఫోబియా'తో... కొత్త వ్యక్తుల్ని కలిసినా, తెలియని ప్రాంతాలకు వెళ్లినా తెగ భయపడిపోయేది. గుంపుగా ఉన్న జనాలను చూసి ''అమ్మో అంతా నా వైపు చూస్తున్నారు'' అని వణికిపోయేది. చిన్నప్పటి నుంచి ఈ భయంతో పార్టీలు, ఫంక్షన్లకు ఎక్కడికీ వెళ్లనే లేదు. ఇక స్నేహితులు కూడా ఎవరు లేరు. జీవితాంతం ఇలానే ఉంటానేమో అనుకునే మినీషా..బొమ్మలు వేసే అలవాటు ద్వారా తన ఫోబియాను అధిగమించడమేగాక, ఆర్టిస్ట్‌గా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. బొమ్మలు వేస్తూ తన భయాన్ని ఎలా పోగొట్టుకుందో తన మాటల్లోనే.....





మాది గురుగావ్. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా నా బాల్యమంతా డెహ్రాడూన్‌లో గడిచింది. చిన్నప్పటి నుంచి తెల్లని పేపర్ మీద పెన్సిల్‌తో రకరకాల బొమ్మలు గీసేదాన్ని. ఏడో తరగతిలో ఉండగా ఒక మ్యాగజీన్‌లో ఉన్న తెల్లటి పేపర్‌పై నటి రేఖ చిత్రాన్ని గీసాను. అప్పుడు మా అమ్మానాన్నలు నా టాలెంట్‌ను చూసి ఆశ్చర్యపోయారు. పదోతరగతి వరకు పెయింటింగ్స్ వేస్తూనే ఉన్నాను. ప్రతి నోట్‌బుక్ చివరి పేజీలో నా పెయింటింగ్ ఒకటి కచ్చితంగా ఉండేది. కొన్నిసార్లు పరీక్షపేపర్‌లో జవాబు తెలియని ప్రశ్నకు బాధపడుతోన్న అమ్మాయి చిత్రాన్ని గీసేదాన్ని. పదో తరగతిలో అంతర జిల్లా పోటీలలో పాల్గొని డెహ్రాడూన్ మొత్తంలోనే మొదటి బహుమతి అందుకున్నాను. అలా ఎక్కువ సమయం బొమ్మలు గీస్తూ ఉంటే అఘోరా ఫోబియా కూడా గుర్తు వచ్చేది కాదు.

ప్రత్యేకమైన కోర్సు చేయలేదు...

నేను చార్టర్డ్ అకౌంటెంట్ కావాలని అమ్మావాళ్లు సీఏ చదివించారు. కానీ నా మనస్సంతా ఆర్ట్‌మీదే ఉండేది. చదువు పూర్తి అయినప్పటికీ కార్పోరేట్ ప్రపంచంలో కాలుపెట్టలేదు. 1995 లో పెళ్లి అయ్యింది. ఆయన ఉద్యోగం దుబాయ్‌లో కావడంతో అక్కడికి వెళ్లిపోయాను. అక్కడ ఓ పబ్లిషింగ్ హౌస్‌లో ఉద్యోగం చేసేదాన్ని. ఒకసారి ఖాళీ సమయం దొరకడంతో..పేపర్ మీద బొమ్మను గీసాను. బొమ్మ పూర్తయ్యే సమయానికి మా ఆయన, ఆయన స్నేహితుడు వచ్చారు. ఆ బొమ్మను చూసి.. ''చాలా బావుంది. బొమ్మలు గీయడంలో మంచి ప్రతిభ ఉంది. ఎందుకు దాచుకుంటావు. బొమ్మలు గీసి సోషల్ మీడియాలో పోస్టు చెయ్యచ్చు కదా...'' అని ప్రోత్సహించారు. అప్పటి నుంచి నాకెంతో ఇష్టమైన ఆర్ట్‌కు ప్రాణం పోస్తున్నాను.

చార్‌కోల్ పెన్సిల్స్‌తో..

ఆయన ప్రోత్సాహంతో స్కెచ్‌లు గీయడం మొదలు పెట్టాను. ఆయన ఒక ఆర్ట్‌గ్రూప్‌ను పరిచయం చేయడంతో అక్కడకు వెళ్లి స్కెచ్‌లు గీసేదాన్ని. కమ్యూనిటీకి వెళ్లిన రెండేళ్లలోనే 'జి ఆర్ట్ కమ్యూనిటీ' వాళ్లు నన్ను కలిసి ఆర్ట్‌ఎగ్జిబిషన్‌లో పాల్గొనమని ఆహ్వానించారు. ఆ ఎగ్జిబిషన్‌కు అంతర్జాతీయ ఆర్టిస్టులు వస్తున్నారు. మీరు ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించండి''అన్నారు. అది నాకు చాలా పెద్ద అవకాశం. కానీ ''అందరూ రంగులతో స్కెచ్‌లు గీస్తున్నారు. నేను మాత్రం పెన్సిల్, చార్‌కోల్‌తో గీస్తాను. నేను నిలబడగలనా'' అని నిర్వాహకులను అడిగాను. అందుకు వాళ్లు ... నువ్వుతప్ప ఎవరూ చార్ కోల్ వాడడం లేదు. అందరికంటే భిన్నంగా నీ స్కెచెస్ ఆకర్షిస్తాయి అని చెప్పి 'డేర్ టు డ్రీమ్' ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేశారు. అలా మొదలైన నా ప్రయాణం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. క్రమంగా వాటర్ కలర్స్ కూడా వేయడం ప్రారంభించాను. చార్‌కోల్ పెయింటింగ్స్‌కు అనేక అవార్డులు అందుకున్నాను. రోలెక్స్ టవర్‌పై నేను వేసిన పెయింటింగ్‌ను ఇప్పటికీప్రదర్శిస్తున్నారు. దీనికి గుర్తింపుగా 'పీపుల్స్ ఛాయిస్ అవార్డు' వచ్చింది. అబుదాబిలోని లువరే మ్యూజియంలో నా పెయింటింగ్స్ ఉన్నాయి.

ఏడు వేలమంది ముందు...

దుబాయ్ మాల్స్‌లో ఏడు వేల మంది ముందు చార్‌కోల్‌తో పెయింటింగ్ వేశాను. ఆ పెయింటింగ్ వెంటనే అమ్ముడు పోయింది. 'స్పెషల్ నీడ్ దుబాయ్ కేర్' తో కలిసి చికిత్స పొందుతోన్న పిల్లల కోసం 'లిటిల్ పికాసో'పేరిట పెయింటింగ్స్ వేసి వారికి సాయం చేశా. 2017లో గుర్‌గావ్ వచ్చేసి, ఇక్కడ పెయింటింగ్స్ నేర్పిస్తున్నాను. ఇండియా ఆర్ట్ కమ్యూనిటీ, ఇండియా స్పీకింగ్ ఆర్ట్ ఫౌండేషన్, వారి సాయంతో పెయింటింగ్ నేర్పిస్తున్నాను. దుబాయ్‌లో వేల మందికి నేర్పిన నేను, నా అనుభవాల ద్వారా నేర్చుకున్న ట్రిక్స్‌ను ఇక్కడి పిల్లలకు నేర్పిస్తున్నాను'' అలా నా భయాన్ని అధిగమించడంతో పాటు నా విద్యను అందరికీ నేర్పించగలగడం నాకెంతో సంతృప్తి కలిగిస్తోంది అని చెప్పింది మినీషా.

కొత్త దారి

సైన్స్ బడి

ఆస్క్ • డూ • లెర్న్ • రిపీట్

'సరిగా అర్థం చేసుకోవడం నుంచే ప్రతిభకు బీజాలు పడతాయి' అంటారు. 'నాకు అర్థం కాలేదు' అన్నంత మాత్రాన ఆ స్టూడెంట్ తెలివి తక్కువ అని కాదు. ఒక సబ్జెక్ట్ అర్థం కాకపోవడానికి, అవడానికి మధ్య ఏదో గ్యాప్ ఉండి ఉండవచ్చు. ఆ ఖాళీని పూరించగలిగితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని 'స్టెమాన్‌స్టర్' ద్వారా నిరూపించింది బెంగళూరుకు చెందిన సైంటిస్ట్ సోనాలి గుప్తా...


ఆరోజు స్కూలు నుంచి వచ్చిన శ్రిష్టి తల్లి సోనాలిని ఒక డౌట్ అడిగింది. 'లోహంతో తయారు చేసిన ఓడ నీటిలో ఎలా తేలుతుంది?'

నాల్గవ తరగతి చదువుతున్న శ్రిష్టి ఇలాంటి సందేహాలెన్నో తల్లిని అడుగుతుంటుంది. అప్పటికప్పుడు జవాబు చెప్పి చిన్నారి సందేహాన్ని తీరుస్తుంటుంది సోనాలి. ఇంట్లో శ్రిష్టి కోసం ఒక ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌ను పరిశీలించడం ద్వారా శ్రిష్టిలో శాస్త్రీయ విషయాలపై ఆసక్తి పెంచాలనేది సోనాలి కోరిక.

ఫిజిక్స్‌లో పీహెచ్‌డీ చేసిన సోనాలికి కూతురు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడం అత్యంత సులువైన పని. మరి శాస్త్రీయ విషయాలపై అవగాహన లేని తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటి?



స్టూడెంట్‌తో సోనాలి



ఓడకు సంబంధించిన కుమార్తె సందేహాన్ని ఇంట్లో అందుబాటులో ఉన్న వస్తువులతోనే చెప్పింది సోనాలి. తాను అలా చెప్పడం వల్ల శ్రిష్టికి సులభంగా అర్థమైంది. ఇదే విధానంలో ఇతర పిల్లలకు చెబితే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. ఈ ఆలోచన లాక్‌డౌన్ టైమ్‌లో పట్టాలకెక్కింది.

'అది నా జీవితంలో చెప్పుకోదగిన ముఖ్య సందర్భం' అంటుంది సోనాలి.

'లెర్నింగ్ బై డూయింగ్' అనే నినాదంతో పిల్లలకు శాస్త్రీయ విషయాలపై అవగాహన పెంచడానికి హ్యాండ్స్–ఆన్ లెర్నింగ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'స్టెమాన్‌స్టర్'కు శ్రీకారం చుట్టింది. రకరకాల సందేహాలను తీర్చేలా వాట్సాప్ వేదికగా ఎన్నో వీడియోలు చేసింది. సంప్రదాయ బోధన ఎలా మెరుగుపడాలో చెబుతున్నట్లుగా ఉండేవి ఆ వీడియోలు.

పరిచితులు, అపరిచితులు, మిత్రుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి.

'మీ వీడియోలు అంటే మా పిల్లలకు ఎంతో ఇష్టం' అని ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు చెప్పినప్పుడల్లా సోనాలికి ఉత్సాహంగా ఉండేది.

'చాలా స్కూళ్లలో సైన్స్ అనేది సూత్రాలు, నిర్వచనాల పరిధి దాటి బయటికి రాదు. నిర్వచనాలు నిర్వచనాలలాగే చెప్పడం వల్ల అందరు పిల్లలకు అర్థం కాకపోవచ్చు. అందుకే అందరికీ అర్థమయ్యేలా ప్రాక్టికల్‌గా చెప్పాలి. ప్రపంచంలో గొప్ప ల్యాబ్స్ అని చెప్పుకోదగ్గ ఎన్నో ల్యాబ్స్‌లో పనిచేశాను. ఎందరో పిల్లలు ఆ ల్యాబ్స్‌లో కనిపించేవారు. పిల్లలకు సైన్స్‌పై ఆసక్తి అక్కడినుంచే మొదలవుతుంది' అంటుంది సోనాలి.

'స్టెమాన్‌స్టర్' ద్వారా సైన్స్, గణితానికి సంబంధించి జటిలమైన కాన్సెప్ట్‌ల గురించి పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా వివిధ రకాల వస్తువులను ఉపయోగించి చెబుతున్నారు. ఎనిమిది నుంచి పద్నాలుగు సంవత్సరాల మధ్య వయసు ఉన్న పిల్లలను దృష్టిలో పెట్టుకొని వీటిని రూపొందించారు.

'పిల్లలు నా నుంచి మాత్రమే కాదు ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటున్నారు' నవ్వుతూ అంటుంది సోనాలి.



అయిదవ తరగతి చదువుతున్న ఆర్యన్ కేజ్రీవాల్‌కు సౌరవ్యవస్థ అనేది ఆసక్తికరమైన సబ్జెక్ట్. 'స్టెమాన్‌స్టర్' ప్లాట్‌ఫామ్ ద్వారా తనకు ఇష్టమైన సబ్జెక్ట్‌కు సంబంధించి ఎన్నో విషయాలను తెలుసుకోగలిగాడు.

'నేను ఒరిగామి స్టార్స్ తయారు చేస్తాను. వాటి ద్వారా ఎన్నో సైన్స్ విషయాలు ఫ్రెండ్స్‌కు చెబుతుంటాను' అంటాడు ఆర్యన్.

'మా అబ్బాయిలో ఎంత మార్పు వచ్చిందంటే ఇప్పుడు మ్యాథ్స్, సైన్స్ వాడి ఫేవరెట్ సబ్జెక్ట్‌లు' అంటుంది ఆనందంగా ఆర్యన్ తల్లి ఆంచల్.

ప్రశ్న–జవాబుల నుంచి వర్క్‌షాప్‌ల వరకు 'స్టెమాన్‌స్టర్' ద్వారా రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

'ఆస్క్, డూ, లెర్న్, రిపీట్' అంటూ పిల్లలకు దగ్గరవుతోంది స్టెమాన్‌స్టర్.

ఇంటిప్స్

- వేడి నీళ్లలో బేకింగ్ సోడా, కొద్దిగా నిమ్మరసం వేసి కలపాలి. ఈ నీటిలో టూత్ బ్రష్‌ను మునిగేలా వేసి ఇరవై నిమిషాలు నానబెట్టాలి. తరువాత సాధారణ నీటితో కడిగితే



బ్రష్‌లో ఉన్న మురికి, బ్యాక్టీరియా పోతుంది. పదిరోజులకొకసారి బ్రష్‌లను ఇలా శుభ్రం చేసుకుంటే, దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి.
- రెండు టేబుల్ స్పూన్ల కార్న్‌ఫ్లోర్, రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిని కలపాలి. ఈ మిశ్రమంలో ముంచిన టిక్కాను, తరువాత గుడ్లసొనలో ముంచి డీప్‌ఫ్రై చేస్తే టిక్కా క్రిస్పీగా మరింత రుచిగా వస్తుంది.





పతాకధారులుగా హర్మన్‌ప్రీత్ సింగ్, లవ్లీనా

ఆసియా క్రీడల ప్రారంభ వేడుకల్లో భారత బృందానికి పతాకధారులుగా పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మహిళా స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ వ్యవహరించనున్నారు. ఈనెల 23న చైనాలోని హాంగ్జౌ నగరంలో ఆసియా క్రీడలకు తెర లేవనుంది. అస్సాంకు చెందిన 25 ఏళ్ల లవ్లీనా టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం, ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. పంజాబ్‌కు చెందిన హర్మన్ భారత్ తరఫున 191 మ్యాచ్‌లు ఆడి 155 గోల్స్ చేశాడు.

రష్మిక శుభారంభం



అంతర్జాతీయ మహిళల టెన్నిస్ (ఐటీఎఫ్) టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేసింది. సింగిల్స్‌లో ప్రీక్వార్టర్ ఫైనల్ చేరిన ఆమె, డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పెర్త్‌లో జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6-3, 6-3తో జెస్సీ కులే (ఆస్ట్రేలియా)పై గెలిచింది. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక (భారత్)-మోనిక్ బ్యారీ (న్యూజిలాండ్) ద్వయం 6-4, 7-6 (7/5)తో ఎలీనా మిసిచ్ (ఆస్ట్రేలియా)-మిచికా ఒజెకి (జపాన్) జంటను ఓడించింది.

భారత్ సంచలనం

వాలీబాల్‌లో కొరియాపై విజయం ● ఆసియా క్రీడల్లో నాకౌట్ దశకు అర్హత



హాంగ్జౌ (చైనా): మూడున్నర దశాబ్దాల పతక నిరీక్షణకు తెరదించాలనే లక్ష్యంతో ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత పురుషుల వాలీబాల్ జట్టు తొలి అడ్డంకిని అధిగమించింది. గ్రూప్ 'సి'లో టాప్ ర్యాంక్‌లో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. మంగళవారం కంబోడియా జట్టును ఓడించిన భారత జట్టు బుధవారం పెను సంచలనం సృష్టించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానంలో ఉన్న దక్షిణ కొరియా జట్టును భారత్ బోల్తా కొట్టించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో భారత జట్టు 25-27, 29-27, 25-22, 20-25, 17-15తో దక్షిణ కొరియాపై గెలిచింది. 1966 నుంచి ప్రతి ఆసియా క్రీడల్లో దక్షిణ కొరియా స్వర్ణ, రజత, కాంస్య పతకాల్లో ఏదో ఒక పతకం సాధిస్తూ వస్తోంది. భారత జట్టు చివరిసారి 1986 సియోల్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకం గెలిచింది. కొరియాతో 2 గంటల 38 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు సమష్టి ప్రదర్శన కనబరిచింది. ముఖ్యంగా అమిత్ అత్యధికంగా 24 పాయింట్లు స్కోరు చేశాడు. వినిత్ కుమార్, అశ్వల్ రాయ్ 19 పాయింట్ల చొప్పున సాధించారు. మనోజ్ ఎనిమిది పాయింట్లు, ఎరిన్ వర్గీస్ ఏడు పాయింట్లు అందించారు. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో కొరియా రజత పతకం నెగ్గగా, భారత్ 12వ స్థానంలో నిలిచింది.

రోయింగ్‌లో జోరు...

రోయింగ్‌లో భారత క్రీడాకారులు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. జస్విందర్ సింగ్, భీమ్ సింగ్, పునీత్ కుమార్, ఆశిష్‌లతో కూడిన భారత పురుషుల జట్టు కాక్స్‌లెస్ ఫోర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరింది. మహిళల కాక్స్‌డ్ ఎయిట్ ఈవెంట్‌లో అశ్వతి, మృణమయి సాల్గావ్‌కర్, ప్రియా దేవి, రుక్మిణి, సొనాలీ, రీతూ, వర్ష, తెన్‌దోన్‌తోయ్ సింగ్, గీతాంజలిలతో కూడిన భారత జట్టు కూడా ఫైనల్లోకి ప్రవేశించింది.

నేడు మలేసియాతో భారత మహిళల పోరు



మహిళల టి20 క్రికెట్‌లో భారత నేరుగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. మలేసియాతో నేడు జరిగే పోరులో స్మృతి మంధాన బృందం బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సెమీఫైనల్‌కు చేరడంతో పాటు పతకం రేసులో నిలుస్తుంది. ఉదయం గం. 6:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

సిరాజ్ మళ్లీ నంబర్‌వన్

ఐసీసీ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి భారత పేసర్



దుబాయ్: ఆసియా కప్ ఫైనల్లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన భారత పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 694 పాయింట్లతో నంబర్‌వన్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు 9వ స్థానంలో ఉన్న ఈ హైదరాబాదీ ఏకంగా ఎనిమిది స్థానాలు మెరుగుపర్చుకొని అగ్రస్థానానికి చేరుకోవడం విశేషం. వన్డే ర్యాంకింగ్స్‌లో సిరాజ్ టాప్‌గా నిలవడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో నంబర్‌వన్‌గా నిలిచిన అతను రెండు నెలల తర్వాత ఆసీస్ పేసర్ జోష్ హాజెల్‌వుడ్‌కు ఆ స్థానాన్ని కోల్పోయాడు. ఆసియా కప్ ఫైనల్లో 21 పరుగులకే 6 వికెట్లు తీసిన ప్రదర్శనతో ఇప్పుడు మళ్లీ శిఖరానికి చేరాడు. కెరీర్‌లో అత్యుత్తమ దశను చూస్తున్న సిరాజ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ చేశాడు. కొంత కాలం క్రితం చనిపోయిన తన తండ్రిని గుర్తు చేసుకుంటూ 'మిస్ యు పాపా' అంటూ క్యాప్షన్ పెట్టాడు. తనను తల్లిదండ్రులు ఆశీర్వదిస్తున్న ఫోటోను వారిద్దరు చూస్తున్న చిత్రానికి తాను గ్రౌండ్‌లో ఆడుతున్న ఫోటోను అతను జత చేశాడు.

అమెరికాలోని మూడు నగరాల్లో...

టి20 ప్రపంచకప్ వేదికలు ఖరారు



దుబాయ్: వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌నకు సంబంధించి అమెరికాలోని మూడు వేదికల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. న్యూయార్క్, డాలస్, ఫ్లోరిడా నగరాల్లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు జరుగుతాయి. బ్రోవార్డ్ కౌంటీ (ఫ్లోరిడా), గ్రాండ్ ప్రయరీ (డాలస్), ఐసన్‌హోవర్ పార్క్ (న్యూయార్క్) స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తామని ఐసీసీ పేర్కొంది. టి20 ప్రపంచకప్ అమెరికాలో జరగడం ఇదే మొదటిసారి. 2024 టోర్నీని వెస్టిండీస్‌తో కలిసి యూఎస్‌ఏ సంయుక్తంగా నిర్వహించనుంది. ఈ టోర్నీలో మొదటిసారి 20 జట్లు పాల్గొనబోతున్నాయి. ఇటీవలి వరకు ఈ టోర్నీని అమెరికాలో నిర్వహించడంపై సందేహాలు ఉన్నా ఐసీసీ తాజా ప్రకటనతో సందిగ్ధత తొలగింది. వచ్చే ఏడాది జూన్ 4-జూన్ 30 మధ్య టోర్నీ జరిగే అవకాశాలు ఉన్నాయి.

'నా అకౌంట్‌లో 80 వేలే ఉన్నాయి'

భారత నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్ ఆవేదన



న్యూఢిల్లీ: అతను భారత నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు... ఏడాది మొత్తం ప్రపంచవ్యాప్తంగా ఏటీపీ టోర్నీలలో పాల్గొంటున్నాడు. టోర్నీల్లో ప్రదర్శనకు ప్రైజ్‌మనీ కూడా దక్కుతుంది. మామూలుగా అయితే టెన్నిస్ ఆటగాళ్లు బాగా డబ్బున్నవాళ్లు అయి ఉంటారని, ఏ స్థాయిలో ఆడినా విలాసవంతమైన జీవితం ఉంటుందనిపిస్తుంది. కానీ ప్రపంచ టెన్నిస్‌లో వాస్తవ పరిస్థితి వేరు. అది ఎంత ఖరీదైందో... అగ్రశ్రేణి స్టార్లు తప్ప 100 కంటే ఎక్కువ ర్యాంక్ ఉన్న ఆటగాళ్ల స్థితి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో చెప్పేందుకు ఇది చక్కటి ఉదాహరణ! భారత్‌కు చెందిన ప్రపంచ 159వ ర్యాంకర్ సుమీత్ నగాల్ ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. తన బ్యాంక్ అకౌంట్‌లో ఇప్పుడు 900 యూరోలు (సుమారు రూ. 80 వేలు) మాత్రమే ఉన్నాయని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ప్రైజ్‌మనీల ద్వారా వచ్చిన డబ్బు, ఐఓసీఎల్ కంపెనీ జీతం, మహా టెన్నిస్ ఫౌండేషన్ ఇచ్చే ఆర్థిక సహాయం మొత్తం టెన్నిస్‌లోనే పెడుతున్నానని, అయినా సరే పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని వెల్లడించాడు. డబ్బులు లేకపోవడంతో ఫిజియో కూడా లేకుండా ఒకే ఒక కోచ్‌తో తాను పోటీల్లో పాల్గొంటున్నానని అన్నాడు. టెన్నిస్ సర్క్యూట్‌లో నిలకడగా ఆడుతూ టాప్-100లో చేరాలంటే ఏడాదికి కనీసం రూ. 1 కోటి ఖర్చు అవుతుందని నగాల్ చెప్పాడు. 'కొన్నేళ్లుగా నిలకడగా ఆడుతూ భారత నంబర్‌వన్‌గా ఉన్నా నాకు కనీస మద్దతు కరువైంది. ప్రభుత్వం 'టాప్స్' పథకంలో నా పేరు చేర్చలేదు. డబ్బులు లేక జర్మనీలోనే టెన్నిస్ అకాడమీలో శిక్షణకు దూరమయ్యాను. నేను గాయపడి ఆటకు దూరమైనపుడు అసలు ఎవరూ నన్ను పట్టించుకోలేదు. రెండుసార్లు కోవిడ్ రావడంతో ర్యాంక్ పడిపోయింది. మన దేశంలో ఆర్థికంగా మద్దతు లభించడం చాలా కష్టం. నా వద్ద ఉన్న డబ్బంతా ఆటకే పెడుతున్నా. గత రెండేళ్లలో ఏమీ సంపాదించలేదు. నేనేమీ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ఉండటం లేదు. అన్నీ కనీస అవసరాలే. ఏం చేయాలో అర్థం కావడం లేదు. పూర్తిగా చేతులెత్తేశాను' అని నగాల్ తన బాధను చెప్పుకున్నాడు.

పతకానికి విజయం దూరంలో...

- సెమీస్‌లో పోరాడి ఓడిన అంతిమ్
- నేడు కాంస్య పతక బౌట్‌లో గెలిస్తే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత
- తొలి రౌండ్‌లో ప్రపంచ చాంపియన్‌పై నెగ్గిన భారత రెజ్లర్



అంతిమ్ పంఘాల్

బెల్‌గ్రేడ్ (సెర్బియా): భారత రెజ్లింగ్ రైజింగ్ స్టార్ అంతిమ్ పంఘాల్ సీనియర్ స్థాయిలోనూ సత్తా చాటుకుంది. అండర్-20 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండేళ్లు స్వర్ణ పతకాలు నెగ్గిన తొలి భారతీయ రెజ్లర్‌గా చరిత్ర సృష్టించిన అంతిమ్... ప్రస్తుతం ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతక రేసులో నిలిచింది. సెమీఫైనల్లో అంతిమ్ 4-5 పాయింట్ల తేడాతో వనెసా కలాద్‌జిన్‌స్కాయా (బెలారస్) చేతిలో పోరాడి ఓడిపోయింది. నేడు జరిగే కాంస్య పతక బౌట్‌లో అంతిమ్ గెలిస్తే పతకంతోపాటు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ కూడా ఖరారవుతుంది. సోఫ్‌టెల్‌విరా ఒర్‌షుష్ (హంగేరి), ఎమ్మా జోనా డెనిస్ మాల్మ్‌గ్రెన్ (స్వీడన్) మధ్య బౌట్ విజేతతో కాంస్య పతకం పోరులో అంతిమ్ తలపడుతుంది. అంతకుముందు తొలి రౌండ్‌లో అంతిమ్ 3-2తో డిఫెండింగ్ చాంపియన్ డొమినిక్ ఒలివియా పారిష్ (అమెరికా)ను బోల్తా కొట్టించింది. ప్రీక్వార్టర్ ఫైనల్లో అంతిమ్ 10-0తో రొక్సానా మార్తా జసినా (పోలాండ్)పై, క్వార్టర్ ఫైనల్లో 9-6తో నటాలియా మలిషెవా (రష్యా)పై గెలుపొందింది. భారత్‌కే చెందిన మనీషా (62 కేజీలు), ప్రియాంక (68 కేజీలు) ప్రీక్వార్టర్ ఫైనల్లో, జ్యోతి బెర్వాల్ (72 కేజీలు) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. భారత రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో భారత రెజ్లర్లు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) పతాకంపై, ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ రెజ్లర్లు తటస్థ అథ్లెట్లుగా ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు.

సినిమా

మళ్లీ జోడీగా...



● సాయి పల్లవి, నాగచైతన్య

హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయి పల్లవి మళ్లీ జోడీగా కనిపించనున్నారు. 'లవ్ స్టోరీ' (2021) వంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత ఈ ఇద్దరూ 'ఎన్‌సీ 23'లో (వర్కింగ్ టైటిల్) మరోసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. చందు మొండేటి ఈ చిత్రానికి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమాలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు బుధవారం మేకర్స్ ప్రకటించారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కనున్న చిత్రమిది. నాగచైతన్య, చందు మొండేటి కెరీర్‌లో భారీ బడ్జెట్ చిత్రం అవుతుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

తెలుగోడి జానపదం దమ్ము చూపించింది

– నిర్మాత 'బన్నీ' వాసు



● విద్య, శ్రీకాంత్, శివానీ, రాహుల్, 'బన్నీ' వాసు

''ఒక పాట హిట్ అయితే సక్సెస్ మీట్ చేయడం మాకు తెలిసి ఇదే తొలిసారి. మా 'కోట బొమ్మాళి పీఎస్' సినిమాలోని 'లింగి లింగి లింగిడి...' పాట తెలుగోడి జానపదం దమ్ము చూపించింది. ఈ పాటకి పి. రఘు సాహిత్యం అందించడంతో పాటు పాడారు'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, శ్రీకాంత్ మేక, వరలక్ష్మీ శరత్‌కుమార్ నటిస్తున్న చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్నారు. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగి లింగిడి...' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేశారు. ఈ పాటకి అద్భుతమైన స్పందన వస్తోందంటూ సక్సెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ– ''చాలా కాలం తర్వాత మంచి సినిమా చేశాననే అనుభూతి ఉంది'' అన్నారు. ''నా జీవితంలో గుర్తుండిపోయే పాట వచ్చినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు రాహుల్ విజయ్. ''ఈ పాట ఎంత పాపులర్ అయ్యిందో సినిమా కూడా అలాగే ఉంటుంది'' అన్నారు శివానీ రాజశేఖర్. ''నా సినిమాలో జానపదం పాట పెట్టాలనే కల ఈ చిత్రంతో నెరవేరింది'' అన్నారు తేజ మార్ని.

హిట్ అయినదే పెద్ద సినిమా

– శ్రీకాంత్



● 'రుద్రం కోట' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఓ దృశ్యం

''రుద్రం కోట' చిత్రం ట్రైలర్, పాటలు బాగున్నాయి. ఇప్పుడు ఏది హిట్ అయితే అదే పెద్ద సినిమా అవుతోంది. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించి, కొత్తవారిని ప్రోత్సహించాలి'' అన్నారు నటుడు శ్రీకాంత్. రుద్ర హీరోగా, శక్తి, విభీష హీరోయిన్లుగా రాము కోన దర్శకత్వం వహించిన చిత్రం 'రుద్రం కోట'. నటి జయలలిత కీలక పాత్రలో నటించి, సమర్పించారు. అనిల్ ఆర్కా కండవల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న స్క్రీన్ మాక్స్ సంస్థ ద్వారా విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని శ్రీకాంత్, నటి రాశీ విడుదల చేశారు. రాశీ మాట్లాడుతూ– ''రుద్రం కోట' టీజర్, ట్రైలర్ బాగున్నాయి. సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమాను సపోర్ట్ చేస్తున్నవారికి కృతజ్ఞతలు'' అన్నారు జయలలిత. ''ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించి పెద్ద సినిమాగా చేస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు అనిల్ ఆర్కా.

నాగేశ్వరరావుగారు నట విశ్వవిద్యాలయం

– మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



● విగ్రహావిష్కరణ చేస్తున్న వెంకయ్య నాయుడుతో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అక్కినేని వెంకట్, నాగార్జున

''తెలుగు సినీ రంగానికి ఎన్టీఆర్, ఏయన్నార్ రెండు కళ్లు అని ఎప్పుడూ చెబుతుంటాను. తన జీవితాన్ని ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకోవడం నాగేశ్వరరావుగారిలోని గొప్పతనం. అమరశిల్పి జక్కన్న, విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ, మహా కవి కాళిదాసు.. ఇలా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఎలాంటి సినిమాలో అయినా ఒదిగిపోయేవారు. నాగేశ్వరరావుగారు ఒక పెద్ద నటనా విశ్వవిద్యాలయం. ఈ రోజు పరిశ్రమలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ ఆ విశ్వ విద్యాలయంలో విద్యార్థిననుకుని, ఆ గుణగణాలను అందిపుచ్చుకుంటే భవిష్యత్‌కు మంచి ప్రణాళికలు వేసుకున్నట్లవుతుంది'' అన్నారు భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు. బుధవారం (సెప్టెంబరు 20) ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అక్కినేని నాగేశ్వరరావు విగ్రహాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించి, మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారు మహానటులు.. మహా మనిషి. సినిమా రంగంలో విలువలు పాటించిన వ్యక్తి నాగేశ్వరరావు గారు. అవతలివాళ్లు నేర్చుకోదగ్గ కొన్ని మంచి సంప్రదాయాలు, విలువల్లో ఆయన జీవించి, నటించి మనకు చూపించారు. ఆ మార్గంలో ప్రయాణిస్తే అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి. నాగేశ్వరరావుగారు పరిపూర్ణమైన జీవితాన్ని గడిపి, జీవిత చరమాంకంలోనూ నటిస్తూనే ఉన్నారు. కొంతమంది జీవిత కాలంలో జీవిస్తారు. జీవిత కాలం పూర్తయిన తర్వాత కూడా జీవించే మహానుభావులు కొందరు. వారిలో అక్కినేని నాగేశ్వరరావుగారు అగ్రగణ్యులు. ఆయన మంచి నటులే కాదు.. పరిణతి చెందిన గొప్ప ఆశావాది కూడా. ఆయన నాస్తికుడు. గొప్ప తాత్త్వికుడు. ఆయన పెద్దగా చదువుకోలేదని అంటారు. కానీ జీవితాలను చదివారు. జీవితంలో ఆయన పోరాటం చేశారు.. జీవితాన్ని ప్రేమించారు.. ఆస్వాదించారు. జీవితంలో నేర్చుకున్న దాన్ని ఆచరణలో పెట్టి చూపించారు'' అని అన్నారు.

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ– ''1950 సమయంలో నాగేశ్వరరావుగారు సినిమాల్లో నటించడం ప్రారంభించాక, సొంతిల్లు కట్టుకోవడానికి ముందే మద్రాస్ విశ్వ విద్యాలయానికి పాతికవేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆ తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పాతిక వేలు ఇచ్చారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయానికి కూడా పాతిక వేలు విరాళం ఇచ్చారు. ఇవన్నీ ఒక ఎత్తైతే.. 1959లో లక్ష రూపాయల విరాళం ఇచ్చి గుడివాడ కళాశాలను నిలబెట్టారు. నాలాంటివారు ఎందరో చదువుకోగలిగారు. ఆ విధంగా ఆ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఓ విప్లవానికి ఆయన నాంది పలికారు'' అన్నారు.

డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ – ''అక్కినేని నాగేశ్వరరావుగారి కష్టం, కళల పట్ల ఆయనకు ఉన్న ప్రేమ ఆయన్ను ఓ లెజెండ్‌ని చేశాయి. యువ నటీనటులకు నాగార్జునగారు స్ఫూర్తి అని నా ఫ్రెండ్స్ సర్కిల్స్‌లో చెబుతుంటారు. నాగార్జునగారేమో తన తండ్రి చూపించిన మార్గంలో నడిచానని చెబుతుంటారు'' అన్నారు.

నాగార్జున మాట్లాడుతూ– ''ఎవరి విగ్రహాన్ని అయినా చూస్తే.. ఆయన ఓ మహానుభావుడు... ఆయన మనతో లేరనే భావన నా మనసులో చిన్నతనం నుంచే ముద్రపడింది. ఏ విగ్రహం చూసినా నాకు అదే అనిపించేది. అందుకే వెంకయ్యనాయుడుగారు ఆవిష్కరించేంతవరకూ నేను నాన్నగారి విగ్రహాన్ని చూడలేదు. చూడబుద్ధి కాలేదు. ఎందుకంటే నాన్నగారు మాతో లేరనే విషయాన్ని అంగీకరించాల్సి వస్తుందేమోనని... శిల్పి వినీత్ ఈ విగ్రహాన్ని అద్భుతంగా చెక్కాడు. నాన్నగారు అద్భుతమైన జీవితాన్ని జీవించారు. తరతరాలుగా గుర్తుపెట్టుకునే పాత్రలు చేసిన నటుడు. కోట్లమంది తెలుగు ప్రజలు, అభిమానులు ప్రేమించిన వ్యక్తి.. ఇలా వివిధ రకాలుగా నాన్నగారు అందరికీ తెలుసు. మాకు మాత్రం నాన్నగారు మా గుండెలను ప్రేమతో నింపిన వ్యక్తి. నన్ను, నా తోబుట్టువులను, మా పిల్లలను.. అందర్నీ చల్లగా చూసిన వ్యక్తి. మాకు మనసు బాగున్నా, బాగోలేకున్నా నాన్నగారి దగ్గరికి వెళ్లి కూర్చుంటే చాలు అన్నీ సర్దుకునేవి. అన్నపూర్ణ స్టూడియోస్ నాన్నగారికి నచ్చిన స్థలం. నచ్చిన చోట విగ్రహం పెడితే ప్రాణ ప్రతిష్ఠ చేసినట్లు అంటారు. సో.. ఆయన ప్రాణంతో మా దగ్గరే ఉన్నారని, ప్రాణంతో మా మధ్యనే నడుస్తున్నారని అనుకుంటున్నాము. నా ఆలోచనల్లోనే కాదు.. ప్రతి ఒక్కరి ఆలోచనల్లో నాన్నగారు ఎప్పటికీ జీవించే ఉంటారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వచ్చిన వారికి, ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి వచ్చిన నాన్నగారి అభిమానులకు ధన్యవాదాలు'' అన్నారు.



● అఖిల్ ● నాగచైతన్య

నాగచైతన్య మాట్లాడుతూ– "ఏయన్నార్‌గారంటే తెలుగు చిత్ర పరిశ్రమలో ఓ పెద్ద, ఓ గొప్ప నటుడు. క్లాసిక్ ఐకాన్‌గా పరిచయం. ఆయన చిత్రాలు, ఆయన చేసిన ప్రయోగాలు ప్రేరణ కలిగించే కేస్ స్టడీగా చాలా మంది ఫిల్మ్ స్కూల్స్‌లో చదువుతుంటారు. ఈ జాబితాలో నేనూ ఉన్నాను. తాతగారితో నేను కలిసి నటించడం నా అదృష్టం. మన పుట్టుక మన చేతిలో ఉండదు. అలాంటిది అక్కినేని నాగేశ్వరరావుగారి మనవడిగా పుట్టడం నా అదృష్టం" అని అన్నారు.

తాత ఏయన్నార్‌కు అఖిల్ నివాళులర్పించారు.

ఏయన్నార్ పెద్ద కుమారుడు వెంకట్ అక్కినేని మాట్లాడుతూ– ''మనిషి ఎంత కీర్తి సంపాదించినా, ఎంత ధనం గడించినా తలగడ మీద తల పెట్టగానే నిద్రపోవడం అనే ఆస్తి, సౌకర్యం ఏ ధనం ఇవ్వలేదు. ఏయన్నార్‌గారు తలగడ మీద తల పెట్టగానే హాయిగా నిద్రపోయేవారు. 1974లో బైపాస్ సర్జరీ జరిగింది. సర్జరీ ముందు రోజు నర్సు నిద్రకోసం మాత్ర ఇస్తే తీసుకోలేదు. ఏ మాత్ర వేసుకోకుండానే హాయిగా నిద్రపోయారు. ఆ తర్వాత ఆయన జీవితం అందరికీ తెలిసిందే. నాకు మరుజన్మ అంటూ ఉంటే ఆయన సన్నిధిలోనే ఉండాలనుకుంటున్నాను. అన్నపూర్ణ సంస్థ, ఏయన్నార్ ఫిల్మ్ స్కూల్, కాలేజీ, ఆయన చిత్రాలు, ఫ్యాన్స్ తీపి గుర్తులు'' అన్నారు.

మోహన్‌బాబు మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారు ఒక గ్రంథం. ఆయన 'మరపురాని మనుషులు' సినిమాకు అసోసియేట్‌గా చేశాను. అన్నపూర్ణ సంస్థలో ఎన్నో సినిమాల్లో నటించాను'' అన్నారు.

బ్రహ్మానందం మాట్లాడుతూ– ''రైతు కుటుంబంలో పుట్టి అద్భుతమైన స్థితికి చేరుకున్న వ్యక్తి నాగేశ్వరరావుగారు. మహానట వృక్షం. కళాకారులకు గొప్ప వరం. స్వయంశిల్పి. స్నేహశీలి. అద్భుతమైన క్రమశిక్షణ కలిగిన వ్యక్తి'' అన్నారు.

ఎస్‌ఎస్ రాజమౌళి మాట్లాడుతూ– ''ఓ వేడుకలో నాగేశ్వరరావుగారితో మాట్లాడే అవకాశం లభించింది. స్టార్ అయిన మీరు 'మిస్సమ్మ' సినిమాలో కమెడియన్‌గా ఎందుకు చేశారు? అని ఆయన్ను అడిగాను. 'దేవదాసు' తర్వాత అన్నీ తాగుబోతు పాత్రలే వస్తున్నాయని, ఇమేజ్ మార్చుకోకపోతే ఇబ్బందవుతుందేమోనని, ఆ పాత్రను తానే అడిగి మరీ చేశానని చెప్పారు. నాగేశ్వరరావుగారికి ఆయనపై ఆయనకు ఉన్న నమ్మకానికి నమస్కారం చేయాలనిపించింది'' అన్నారు.



● రామ్‌చరణ్, నమ్రత, మహేశ్ బాబు

జయసుధ మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారితో ఎక్కువ సినిమాలు చేయడం నా అదృష్టం. క్రమశిక్షణతో పాటు ఆయన దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నాను'' అన్నారు.

ఏయన్నార్ కుమార్తె నాగ సుశీల మాట్లాడుతూ– ''అందరికీ పండగలు ఉంటాయి. కానీ మా అక్కినేని అభిమానులకు నాన్నగారి జయంతే పండగ. అభిమానుల ప్రోత్సాహం వల్లే ఈ కార్యక్రమం సాధ్యమైంది. అమ్మానాన్నలు మేం ఎప్పుడూ కలిసే ఉండాలని కోరుకునేవారు. అలా మేమందరం కలిసే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేశాం'' అన్నారు.

సుశాంత్ మాట్లాడుతూ– ''తాతగారు తన జీవితంలో కృతజ్ఞతకు విలువ ఇచ్చేవారు. ఇండస్ట్రీలో తారాస్థాయికి ఎదిగిన ఆయనకు కళామతల్లికి తిరిగి ఇవ్వాలని ఉండేది. అన్నపూర్ణ స్టూడియోస్, అక్కినేని ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్, ఏయన్నార్ నేషనల్ అవార్డు, అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా.. ఇలా ఎన్నో ఆయన కృతజ్ఞతలోంచి వచ్చిన ఆలోచనలే'' అన్నారు.

''నాగేశ్వరరావుగారి విగ్రహం పనులను నాకు అప్పగించిన అక్కినేని కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. దాదాపు ఐదున్నర నెలలు వర్క్ చేశాం'' అన్నారు విగ్రహ రూపకర్త వినేష్ విజయన్.

ఈ కార్యక్రమంలో అమల, సుప్రియ, సుమంత్.. ఇలా అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్, జగపతిబాబు, శ్రీకాంత్, మంచు విష్ణు, నాని, నాజర్, అనుపమ్ ఖేర్, అల్లు అరవింద్, అశ్వినీదత్, సి. కల్యాణ్, కేఎల్ నారాయణ, 'దిల్' రాజు, చినబాబు, నాగవంశీ, బి. గోపాల్, వైవీఎస్ చౌదరి, పి. కిరణ్, గుణ్ణం గంగరాజు, విజయ చాముండేశ్వరి తదితరులు పాల్గొని, అక్కినేని నాగేశ్వరరావుకి నివాళులు అర్పించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
796	232
66,801	19,901

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	13,672	▽	7
డోజోన్స్	34,747	△	229
ఎఫ్‌టీఎస్ఈ 100	7,732	△	72
డాక్స్	15,782	△	117
షాంఘై	3,109	▽	16
నికాయ్	33,023	▽	209

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారెట్)	59,317
బంగారం (22 క్యారెట్)	59,097
వెండి (కేజీ)	72,204

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.46	84.13
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	101.50	104.89
€	యూరో	ఎస్‌బీఐ	87.44	90.55
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.50	57.23
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.69	54.99
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.07	62.01
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.20	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.72	23.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.26	12.34

మణిపాల్ చేతికి ఆమ్రి హాస్పిటల్స్

- 84 శాతం వాటా కొనుగోలు
- డీల్ విలువ రూ. 2,300 కోట్లు



కోల్‌కతా/న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ సంస్థ మణిపాల్ హాస్పిటల్స్ తాజాగా ఇమామీ గ్రూప్ సంస్థ ఆమ్రి హాస్పిటల్స్‌లో 84% వాటాను సొంతం చేసుకుంది. సింగపూర్ కంపెనీ టిమాసెక్ హోల్డింగ్స్‌కు 59% వాటాగల మణిపాల్ ఇందుకు రుణాలుసహా రూ. 2,300 కోట్లు చెల్లించినట్లు తెలుస్తోంది. ఆమ్రి హాస్పిటల్స్‌లో 15% వాటాతో ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఇమామీ గ్రూప్ ఇన్వెస్టర్‌గా కొనసాగనుంది. తాజా కొనుగోలుతో మణిపాల్ హాస్పిటల్స్ దేశ తూర్పు ప్రాంతంలో కార్యకలాపాలు విస్తరించనుంది. సంయుక్త సంస్థ దేశవ్యాప్తంగా 17 పట్టణాలు, నగరాలలో 9,500 పడకలతో 33 ఆసుపత్రులను నిర్వహించనుంది. వెరసి దేశీయంగా రెండో పెద్ద హెల్త్‌కేర్ సేవల సంస్థగా ఆవిర్భవించనుంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఆమ్రి రుణ భారం రూ.1,600 కోట్లు కాగా.. రూ.2,400 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో డీల్ జరిగినట్లు తెలుస్తోంది. క్లినికల్ నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలుగల ఆమ్రి హాస్పిటల్స్‌ను జత కలుపుకోవడం ద్వారా భారీ నెట్‌వర్క్‌కు తెరలేవనున్నట్లు మణిపాల్ పేర్కొంది. తద్వారా దేశ తూర్పుప్రాంతంలో అత్యంత నాణ్యమైన ఆరోగ్యపరిరక్షణ సేవలకు పెరుగుతున్న డిమాండుకు అనుగుణమైన సేవలు అందించేందుకు వీలు చిక్కనున్నట్లు తెలియజేసింది. అయితే మణిపాల్ 2021లో కోల్‌కతాలోని కొలంబియా ఏషియా హాస్పిటల్స్‌ను కొనుగోలు చేయడం ద్వారా తూర్పు భారతంలో కార్యకలాపాలు ప్రారంభించింది. కాగా.. హెల్త్‌కేర్ రంగ మరో దిగ్గజం అపోలో హాస్పిటల్స్ 10,000 పడకల సామర్థ్యంతో 64 ఆసుపత్రులను నిర్వహిస్తోంది.

అదానీ గ్రీన్‌లో టోటల్ ఎనర్జీ
రూ. 2,500 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్‌తో ఏర్పాటు చేయనున్న శుద్ధ ఇంధన భాగస్వామ్య కంపెనీ(జేవీ)లో 30 కోట్ల డాలర్లు(రూ. 2,500 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఫ్రెంచ్ దిగ్గజం టోటల్‌ఎనర్జీస్ తాజాగా వెల్లడించింది. కొత్తగా నెలకొల్పనున్న జేవీలో 50 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. మిగిలిన 50 శాతం వాటాను అదానీ గ్రీన్ ఎనర్జీ పొందనుంది. ఈ జేవీ మొత్తం 1,050 మెగావాట్ల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉండనుంది. వీటిలో 300 మెగావాట్ల సామర్థ్యం ఇప్పటికే ప్రారంభంకాగా.. 500 మె.వా నిర్మాణంలో ఉంది. మరో 250 మె.వా సోలార్, విండ్ కలయికతో అభివృద్ధి దశలో ఉంది. కాగా.. యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణల తదుపరి గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీతో ఫ్రెంచ్ దిగ్గజం టోటల్ తొలిసారి పబ్లిక్ డీల్‌ను కుదుర్చుకోవడం గమనార్హం! శుద్ధ ఇంధన ప్రాజెక్టుల పోర్ట్‌ఫోలియో విస్తరణలో భాగంగా టోటల్ తాజా పెట్టుబడులను చేపట్టింది. ఇప్పటికే అదానీ గ్రీన్ ఎనర్జీలో 19.7 శాతం వాటాను కలిగిన టోటల్.. 2,353 మె.వా. పోర్ట్‌ఫోలియోగల ఏజీఈ23ఎల్(జేవీ)లో అదానీ గ్రీన్‌తో సమాన వాటాను కలిగి ఉంది. ఇక 2019లోనే అదానీ టోటల్ గ్యాస్‌లో 37.4 శాతం వాటాను టోటల్ పొందింది. ఇందుకు 30 కోట్ల డాలర్లు(రూ. 2,500 కోట్లు) ఇన్వెస్ట్ చేసింది.

ఏషియా హెల్త్‌కేర్ గూటికి ఏఐఎన్‌యూ

రూ. 600 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ(ఏఐఎన్‌యూ)లో మెజారిటీ వాటాను సొంతం చేసుకున్నట్లు ఏషియా హెల్త్‌కేర్ హోల్డింగ్స్(ఏహెచ్‌హెచ్) తాజాగా పేర్కొంది. తదుపరి దశలో రూ. 600 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. పెట్టుబడులను ప్రైమరీ, సెకండరీ ఈక్విటీ మార్గంలో చేపట్టనున్నట్లు తెలియజేసింది. తాజా కొనుగోలు ద్వారా ఏహెచ్‌హెచ్ యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లోకి ప్రవేశించనుంది. డాక్టర్లయిన సి. మల్లికార్జున్, పి.సి. రెడ్డిల నేతృత్వంలో ప్రముఖ యూరాలజిస్టులు, నెఫ్రాలజిస్టులు కలిసి 2013లో ఏఐఎన్‌యూను ఏర్పాటు చేశారు. దీనికి హైదరాబాద్, విశాఖపట్టణం, సిలిగురి, చెన్నైలలో 7 ఆసుపత్రులు ఉన్నాయి. రోబోటిక్ యూరాలజీ సర్జరీలో ప్రత్యేకతను కలిగి ఉంది. 500కుపైగా పడకలతో సేవలను అందిస్తోంది. 4 లక్షలకుపైగా రోగులకు సేవలు అందించడంతోపాటు యూరాలజీలో 1,000కి పైగా రోబోటిక్ సర్జరీలను పూర్తి చేసింది. తమ ప్లాట్‌ఫామ్‌కు ఏఐఎన్‌యూ కొత్త స్పెషాలిటీలను జత చేయడమేకాకుండా సంస్థ విజన్ మరింత పటిష్టమయ్యేందుకు దోహదపడనుందంటూ ఏహెచ్‌హెచ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ విశాల్ బాలి పేర్కొన్నారు. నగరాలలోనేకాకుండా టైర్–2 పట్టణాలలోనూ యూరాలజీ రోబోటిక్ సర్జరీలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఏఐఎన్‌యూ ఎండీ, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున్ తెలియజేశారు. భవిష్యత్‌లో యూరోఆంకాలజీ, యూరోగైనకాలజీ, పీడియాట్రిక్ యూరాలజీ సేవలకు డిమాండ్ పెరిగే వీలున్నట్లు ఈడీ పి.సి. రెడ్డి వివరించారు. సంస్థ తదుపరి దశ వృద్ధికి ఏహెచ్‌హెచ్ దోహదపడగలదని పేర్కొన్నారు. 2017లో ప్రారంభమైన ఏహెచ్‌హెచ్ పోర్ట్‌ఫోలియోలో మదర్‌హుడ్ హాస్పిటల్స్, నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ వంటి సంస్థలు ఉన్నాయి. మదర్‌హుడ్ హాస్పిటల్స్‌కు 11 నగరాల్లో 23 మహిళా, శిశు ఆస్పత్రులు, నోవా ఐవీఎఫ్‌కు 44 నగరాల్లో 68 ఐవీఎస్ సెంటర్లు ఉన్నాయి.

ఫెడ్ వడ్డీ రేట్లు యథాతథం

5.25–5.5 శాతం వద్దే ఫండ్స్ రేట్లు

న్యూయార్క్: ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లను ప్రభావితం చేయగల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచేందుకు తాజాగా నిర్ణయించింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 5.25–5.5 శాతం వద్దే కొనసాగనున్నాయి. ఉపాధి, హౌసింగ్ గణాంకాలు నీరసించడంతోపాటు ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతున్న సంకేతాలు యథాతథ పాలసీ అమలుకు కారణమైనట్లు ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ పేర్కొన్నారు.



వెరసి రెండు రోజుల పాటు సమావేశమైన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ).. గత 18 నెలల్లో రెండోసారి వడ్డీ రేట్ల పెంపునకు విముఖత చూపింది. ప్రస్తుత రేట్లు గత రెండు దశాబ్దాలలోనే అత్యధికంకాగా.. 2022 మార్చి నుంచి దశలవారీగా ఫెడ్.. 5.25 శాతంమేర వడ్డీ రేట్లను పెంచింది. దీంతో రుణాలు, క్రెడిట్ కార్డు చెల్లింపులపై వడ్డీలు భారంగా మారినట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఫలితంగా ధరలు ఫెడ్ లక్ష్యాన్ని మించుతున్నప్పటికీ లేబర్ మార్కెట్, హౌసింగ్ రంగం మందగించడంతో భవిష్యత్‌లోనూ ఎఫ్‌వోఎంసీ రేట్ల పెంపునకు ఆసక్తి చూపకపోవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

20 వేల దిగువకు నిఫ్టీ

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్ల పతన ప్రభావం
- ఫెడ్ వడ్డీ రేట్ల వెల్లడికి ముందు జాగ్రత్త
- 796 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- గత రెండు నెలల్లో అతిపెద్ద పతనం

ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(4%), రిలయన్స్ ఇండస్ట్రీస్(2%) షేర్ల పతనంతో స్టాక్ సూచీలు బుధవారం ఒకశాతానికి పైగా నష్టపోయాయి. యూఎస్ ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధాన వైఖరి వెల్లడి (బుధవారం రాత్రి)కి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు సైతం సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 796 పాయింట్లు క్షీణించి 66,801 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 232 పాయింట్లు పతనమై 20 వేల స్థాయి దిగువన 19,901 వద్ద నిలిచింది. వెరసి గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. ట్రేడింగ్ ప్రారంభం అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా ఫైనాన్స్, మెటల్, బ్యాంకింగ్ రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 868 పాయింట్లు నష్టపోయి 66,728 వద్ద, నిఫ్టీ 254 పాయింట్లు క్షీణించి 19,879 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని నమోదు చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,111 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.573 కోట్ల ఈక్విటీలను విక్రయించారు. సెన్సెక్స్ రెండు రోజుల పతనంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.89 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.320 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ బుధవారం జీవితకాల కనిష్ట స్థాయి (83.32) నుంచి కోలుకుంది. డాలర్ మారకంలో 21 పైసలు బలపడి 83.11 స్థాయి వద్ద స్థిరపడింది. యూఎస్ ఫెడ్ రిజర్వ్ పాటు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఆఫ్ జపాన్ ద్రవ్య విధాన వైఖరి వెల్లడికి ముందు చోటు చేసుకున్న అప్రమత్తతతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో బేరిష్ ట్రెండ్ నెలకొని ఉంది.



మార్కెట్లో మరిన్ని సంగతులు ...

- ఆర్ ఆర్ కేబుల్ షేరు లిస్టింగ్ పర్లేదనిపించింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.1,035)తో పోలిస్తే 14% ప్రీమియంతో రూ.1,179 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 17% ఎగసి రూ.1,213 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 16% లాభంతో 1,197 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.13,500 కోట్లుగా నమోదైంది. పబ్లిక్ ఇష్యూ ముగిసిన రెండురోజుల్లోనే ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యి టీ+2 టైంలైన్ విధానంలో లిస్టయిన తొలి కంపెనీగా రికార్డుకెక్కింది.
- చివరి రోజు నాటికి యాత్రా ఆన్‌లైన్ ఐపీఓకు 1.61 రెట్ల అధిక స్పందన లభించింది. కంపెనీ 3.09 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయగా 4.98 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 2.11 రెట్లు సబ్‌స్క్రిప్షన్ సాధించింది.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో విలీనం తర్వాత జూలై ఒకటి నుంచి స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) పెరిగే అవకాశం ఉందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సోమవారం ప్రకటించింది. అలాగే నోమురా బ్రోకరేజ్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు రేటింగ్‌ను 'బై' నుంచి 'న్యూట్రల్'కి డౌన్‌గ్రేడ్ చేసింది. దీంతో ఈ బ్యాంకు షేరు 4% నష్టపోయి రూ.1564 వద్ద స్థిరపడింది. షేరు భారీ పతనంతో ఒక్క రోజులోనే దాదాపు రూ.50 వేల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కోల్పోయింది. సెన్సెక్స్, నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే.
- ఎంఅండ్ఎం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2 లక్షల కోట్లను అధిగమించింది. ఎస్‌యూవీ విభాగం, ట్రాక్టర్లకు బలమైన ఆర్డర్లు లభించడం ఇందుకు తోడ్పడిందని కంపెనీ తెలిపింది. బీఎస్ఈలో ఈ కంపెనీ షేరు రూ.1634 వద్ద ముగిసింది.

వాట్సాప్ పేమెంట్స్ సేవల విస్తరణ

వ్యాపార సంస్థల కోసం మరిన్ని ఫీచర్లు



ముంబై: మెసేజింగ్ యాప్ వాట్సాప్ తాజాగా భారత మార్కెట్లో తమ చెల్లింపుల సేవలను మరింతగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా వ్యాపార సంస్థలకు కొనుగోలుదారులు చేసే పేమెంట్స్ ప్రక్రియను సులభతరం చేసింది. 'వాట్సాప్ బిజినెస్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించే భారతీయ వ్యాపార సంస్థలన్నింటికీ మా పేమెంట్స్ సర్వీసును విస్తరిస్తున్నాం. కొనుగోలుదారులు తమకు కావాల్సిన ఉత్పత్తులను వాట్సాప్‌లోనే కార్ట్‌కి జోడించుకోవడంతో పాటు తమకు నచ్చిన పేమెంట్ విధానం ద్వారా .. అంటే వాట్సాప్ లేదా యూపీఐ యాప్‌లు, డెబిట్ .. క్రెడిట్ కార్డులతో కూడా చెల్లించవచ్చు. ఇందు కోసం ఇతర వెబ్‌సైట్‌కి గానీ, మరో యాప్‌కి గానీ వెళ్లనక్కర్లేదు. వ్యక్తిగతంగా వెళ్లి చెల్లించనక్కర్లేదు' అని సంస్థ తెలిపింది. ఈ ఫీచర్ ఇప్పటికే సింగపూర్, బ్రెజిల్‌లో చిన్న వ్యాపార సంస్థల కోసం కంపెనీ అమలు చేస్తోంది. వ్యాపార సంస్థలు, కొనుగోలుదారులు మెసేజింగ్ ఫీచర్‌ను సమర్థంగా వినియోగించుకునే విషయంలో ప్రపంచానికి భారత్ సారథ్యం వహిస్తోందని బిజినెస్ మెసేజింగ్ సదస్సు 'కన్వర్సేషన్స్' కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న వాట్సాప్ మాతృసంస్థ మెటా వ్యవస్థాపకుడు, సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ తెలిపారు.

వాట్సాప్ ఫ్లోస్, వెరిఫైడ్ బ్యాడ్జ్ ..

మెసేజింగ్ ఫార్మాట్లు, గ్రూప్ చాట్స్, బ్రాడ్‌కాస్ట్ చానల్స్ విషయంలో మెటా ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లను ఆవిష్కరిస్తోందని జుకర్‌బర్గ్ చెప్పారు. ఇందులో భాగంగా వ్యాపార సంస్థల కోసం వాట్సాప్ ఫ్లోస్, మెటా వెరిఫైడ్ బ్యాడ్జ్‌లను విస్తృతంగా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్ బుకింగ్, ఉత్పత్తులను ఆర్డర్ చేయడం, ఫ్లయిట్స్‌లో చెకిన్ చేయడం వంటి అంశాల్లో కస్టమర్లకు వెసులుబాటు కల్పించేలా వాట్సాప్ ఫ్లోస్‌ను వ్యాపార సంస్థలు ఉపయోగించుకోవచ్చు. మరోవైపు, మెటా వెరిఫైడ్ బ్యాడ్జ్‌లను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లకు విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నాబార్డ్‌లో అసిస్టెంట్ మేనేజర్

» నాబార్డ్‌లో 150 అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఎ పోస్టులు
» ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక
» ఎంపికైతే నెలకు రూ.లక్ష వరకు స్థూల వేతనం

నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్..నాబార్డ్! వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి విభాగాల్లో.. బ్యాంకింగ్ ప్రోత్సాహకాలను అందించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన బ్యాంకు! ఇందులో కొలువు సొంతమైతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం దక్కించుకున్నట్లే! వేతనాలు, ఇతర ప్రోత్సాహకాలు కూడా భారీ స్థాయిలోనే ఉంటాయి. నాబార్డ్ తాజాగా 150 అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఎ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. నాబార్డ్ పోస్టులకు దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్(రూరల్ డెవలప్‌మెంట్ బ్యాంకింగ్ సర్వీస్) గ్రేడ్–ఎ హోదాలో మొత్తం 150 పోస్టులను భర్తీ చేయనుంది. మూడంచెల ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపి.. నియామకం ఖరారు చేసుకున్న వారికి నెలకు రూ.44,500 మూల వేతనం అందిస్తారు. ఇతర అలవెన్సులు అన్ని కలిపి నెలకు రూ.లక్ష స్థూల వేతనం లభిస్తుంది.

అర్హతలు

పోస్టును అనుసరించి 60% మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ/బీటెక్ లేదా సంబంధిత స్పెషలైజేషన్‌తో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

సెప్టెంబర్ 1, 2023 నాటికి 21–30 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్స్ గ్రేడ్–ఎ నియామకాలకు మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ.

ప్రిలిమ్స్ 200 మార్కులు

ఎంపిక ప్రక్రియలో తొలిదశ ప్రిలిమ్స్ పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. ఇందులో టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 20 ప్రశ్నలు–20 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 20 ప్రశ్నలు–20 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 20 ప్రశ్నలు–20 మార్కులు, డెసిషన్ మేకింగ్ 10 ప్రశ్నలు–10 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు–20 మార్కులు, ఎకనామిక్ అండ్ సోషల్ ఇష్యూస్ 40 ప్రశ్నలు –40 మార్కులు, అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ 40 ప్రశ్నలు–40 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. పరీక్షకు కేటాయించిన సమయం 120 నిమిషాలు.

జనరలిస్ట్.. స్పెషలిస్ట్‌లకు వేర్వేరుగా

ఎంపిక ప్రక్రియలో రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్. ప్రిలిమినరీలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు 25 మందిని చొప్పున(1:25 నిష్పత్తిలో) మెయిన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్ష జనరలిస్ట్ పోస్ట్‌లకు, స్పెషలిస్ట్ పోస్ట్‌లకు వేర్వేరుగా ఉంటుంది. ఈ పరీక్షను ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానాల్లో నిర్వహిస్తారు.

200 మార్కులకు జనరలిస్ట్ మెయిన్

- జనరలిస్ట్ మెయిన్ ఎగ్జామ్ రెండు పేపర్లుగా ఉంటుంది. పేపర్–1లో జనరల్ ఇంగ్లిష్‌లో 3 ప్రశ్నలు(100 మార్కులు) అడుగుతారు. వీటికి డిస్క్రిప్టివ్ విధానంలో కంప్యూటర్‌పై సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.
- పేపర్–2లో ఎకనామిక్ అండ్ సోషల్ ఇష్యూస్, అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగం నుంచి ప్రశ్నలు అడుగుతారు. 30 ప్రశ్నలు(50 మార్కులు) ఆబ్జెక్టివ్ విధానంలో, ఆరు ప్రశ్నలు(90 మార్కులు) డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటాయి.
- డిస్క్రిప్టివ్ విధానంలోని ఆరు ప్రశ్నల్లో కనీసం నాలుగు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్షకు లభించే సమయం మూడున్నర గంటలు.

స్పెషలిస్ట్ పోస్ట్‌లకు ఇలా

- స్పెషలిస్ట్ పోస్ట్‌లకు కూడా రెండు పేపర్లుగా(పేపర్–1, పేపర్–2) పరీక్ష నిర్వహిస్తారు. పేపర్–1లో..జనరల్ ఇంగ్లిష్‌లో 3 ప్రశ్నలు(100 మార్కులు) ఉంటాయి. వీటికి డిస్క్రిప్టివ్ విధానంలో కంప్యూటర్‌పై సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.



- పేపర్–2లో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌పై 30 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు(50 మార్కులు), ఆరు డిస్క్రిప్టివ్ ప్రశ్నలు(50 మార్కులు) అడుగుతారు. డిస్క్రిప్టివ్ ప్రశ్నల్లో కనీసం నాలుగు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. మొత్తంగా 200 మార్కులకు స్పెషలిస్ట్ పోస్ట్‌లకు మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు.

తుది దశ ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలో చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూ 50 మార్కులకు జరుగుతుంది. మెయిన్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని(1:3 నిష్పత్తిలో) చొప్పున ఎంపిక చేసి.. వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులోనూ ప్రతిభ చూపి తుది విజేతలుగా నిలిస్తే నియామకం ఖరారు చేస్తారు.

ప్రిపరేషన్ పక్కాగా

ఎకనామిక్ అండ్ సోషల్ ఇష్యూస్

ఈ విభాగంలో రాణించేందుకు భారత ఆర్థిక వ్యవస్థ స్వరూపం, గ్లోబలైజేషన్, ఆర్థిక సంస్కరణలు, ద్రవ్యోల్బణం, పేదరిక నిర్మూలన–ఉపాధి కల్పన, దీనికి సంబంధించి ప్రభుత్వ పథకాలు, జనాభా వృద్ధి; వ్యవసాయం–ప్రస్తుత పరిస్థితులు, సంస్థాగత మార్పులు,సాంకేతిక మార్పులు, ఆహార భద్రత సమస్యలు,ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్, వరల్డ్ ట్రేడ్ ఆర్గనేజేషన్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. సోషల్ ఇష్యూస్‌కు సంబంధించి సామాజిక వ్యవస్థ, బహుళ సంస్కృతి విధానం, పట్టణీకరణ, వలసలు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, విద్య, ఆరోగ్యం, పర్యావరణం, నిరక్షరాస్యత –సామాజిక, ఆర్థిక సమస్యలు, సామాజిక న్యాయం, సామాజిక ఉద్యమాలు, భారత రాజకీయ వ్యవస్థ, మానవాభివృద్ధి తదితర అంశాలను అధ్యయనం చేయాలి.

అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్

వ్యవసాయం, పంటల వర్గీకరణ, ఆగ్రో క్లైమేటిక్ జోన్స్, సాగు పద్ధతులు, సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్, వాటర్ రిసోర్స్, ఫార్మ్ అండ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, ప్లాంటేషన్ అండ్ హార్టికల్చర్, యానిమల్ హజ్బెండరీ, పౌల్ట్రీ ఇండస్ట్రీ, ఫారెస్ట్రీ, ఫిషరీస్, వ్యవసాయ విస్తరణ, పర్యావరణం–మార్పులు తదితర అన్ని అంశాలను అధ్యయనం చేయాలి. రూరల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి గ్రామీణ ప్రాంత భావనలు, భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్వరూపం–ప్రాధాన్యం; ఆర్థిక, సామాజిక, భౌగోళిక అంశాల్లో గ్రామీణ విభాగం ప్రాధాన్యత, గ్రామీణ జనాభా, పంచాయతీ రాజ్ సంస్థలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

మిగిలిన విభాగాలకు ఇలా

- రీజనింగ్‌లో.. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో.. బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.
- కంప్యూటర్ నాలెడ్జ్‌కు సంబంధించి బేసిక్ కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్స్, కంప్యూటర్ టెర్మినాలజీ, బేసిక్ హార్డ్‌వేర్స్(సీపీయూ, మానిటర్)ల గురించి తెలుసుకోవాలి.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో..స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్,పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్,ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- జనరల్ అవేర్‌నెస్‌లో రాణించాలంటే.. ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో పరిణామాలు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:సెప్టెంబర్ 23, 2023
- ప్రిలిమినరీ రాత పరీక్ష తేదీ: అక్టోబర్ 16, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.nabard.org
- ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: https://ibpsonline.ibps.in/nabardaug23

వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌లో 153 కొలువులు

జాబ్స్ ఇన్ఫో

ప్రభుత్వ మినీరత్న సంస్థ..సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ 153 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆయా పోస్టులను అనుసరించి ఇంజనీరింగ్ డిగ్రీ, బీఎస్సీ, బీకాం, బీఏ, సీఏ, పీజీ ఉత్తీర్ణత ఉండాలి. ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 153

అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)–18, అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–05, అకౌంటెంట్–24, సూపరింటెండెంట్(జనరల్)–11, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్–81, సూపరింటెండెంట్(జనరల్)–ఎస్ఆర్‌డీ(ఎన్ఈ)–2, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ –ఎస్ఆర్‌డీ(ఎన్ఈ)–10, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్–ఎస్ఆర్‌డీ(లద్దాఖ్ యూటీ)–2 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- **అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్):** ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు సివిల్ ఇంజనీరింగ్‌లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి.
- **అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్):** ఈ పోస్టులకు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీఈ /బీటెక్ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **అకౌంటెంట్:** బీకాం/బీఏ(కామర్స్) లేదా చార్టర్ అకౌంటెంట్ గా మూడేళ్ల పని అనుభవం ఉన్న వారు దరఖాస్తుకు అర్హులు.
- **సూపరింటెండెంట్(జనరల్):** ఏదైన విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సు పూర్తిచేసిన వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్:** అగ్రికల్చర్/జూవాలజీ/కెమిస్ట్రీ/బయో–కెమిస్ట్రీ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసిన వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- అన్ని పోస్టులకూ కంప్యూటర్ నాలెడ్జ్‌ను అదనపు అర్హతగా పరిగణిస్తారు.

వయసు: 24.09.2023 నాటికి జేటీఏ పోస్టులకు 28 ఏళ్లలోపు ఉండాలి. మిగతా ఉద్యోగాలకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ కలిగిన అభ్యర్థులకు వయోసడలింపు లభిస్తుంది.

వేతనాలు

అసిస్టెంట్ ఇంజనీర్, అకౌంటెంట్, సూపరింటెండెంట్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.40,000–రూ.1,40,000(ఈ–1) వేతనంగా లభిస్తుంది. అలాగే జూనియర్ అసిస్టెంట్ ఎంపికైన వారు రూ.29,000–రూ.93,000 వేతనంగా పొందవచ్చు.

రాత పరీక్ష

- **అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)/(ఎలక్ట్రికల్):** ఈ పోస్టులకు సంబంధించి రాత పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 145 ప్రశ్నలకు–200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో 6 విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది.
- **అకౌంటెంట్:** ఆన్‌లైన్ పరీక్షలో 200 ప్రశ్నలు–200 మార్కులకు ఉంటాయి. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35 ప్రశ్నలు–35 మార్కులు. డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలకు–20 మార్కులకు ఉంటుంది. ప్రొఫెషనల్ నాలెడ్జ్ 65 ప్రశ్నలకు–65 మార్కులు. పరీక్ష వ్యవధి 3 గంటలు.



- **సూపరింటెండెంట్(జనరల్):** ఈ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో రెండున్నర గంటల వ్యవధిలో ఉంటుంది. మొత్తం 200 ప్రశ్నలకు–200 మార్కులు ఉంటాయి. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలకు–50 మార్కులు. డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలకు–50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు–50 మార్కులు. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది.
- **జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్:** ఈ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో రెండున్నర గంటల వ్యవధిలో ఉంటుంది. మొత్తం 200 ప్రశ్నలకు–200 మార్కులు ఉంటాయి. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలకు–40 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35 ప్రశ్నలు–35 మార్కులు. డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలకు–40 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 20 –ప్రశ్నలు 20 మార్కులు. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: 24.09.2023
- వెబ్‌సైట్: https://www.cewacor.nic.in

క్లుప్తంగా...

మల్టీజోన్-1 హెచ్ఎం పదోన్నతికి ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: మల్టీజోన్-1 పరిధిలో ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందేందుకు గురువారం నుంచి వెబ్ ఆప్షన్లు తీసుకోనున్నారు. శుక్రవారం వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని విద్యాశాఖ పేర్కొంది. ఇటీవల హెచ్ఎంలను బదిలీ చేయడంతో మల్టీజోన్-1 పరిధిలో 1,093 హెచ్ఎం ఖాళీలు ఏర్పడ్డాయి. మల్టీజోన్-2 పరిధిలో 821 ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిని స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించడం ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. అయితే రంగారెడ్డి జిల్లాకు చెందిన కొంతమంది ఉపాధ్యాయులు సీనియారిటీ సరిగా లేదంటూ కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో మల్టీజోన్-2 పరిధిలో పదోన్నతులు చేపట్టడం లేదు. మల్టీజోన్-1 పరిధిలో పదోన్నతికి అర్హులైన వారి జాబితాలను ఇప్పటికే వెల్లడించారు. ఎవరు ఏ ప్రాంతానికి వెళ్లాలనేది, లేదా పదోన్నతికి ఇష్టపడని వారు (నాట్ విల్లింగ్) ఆప్షన్స్ ద్వారా తెలియజేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రమోషన్ల జాబితాలను వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

గాంధీలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఏర్పాటు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. డీఎంఈ, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు, పలు విభాగాలకు చెందిన హెచ్ఓడీలు ఎస్‌పీఎస్‌పీ ప్రసాద్‌మూర్తి, ఎన్‌వీఎస్ రెడ్డి, వాల్యా, వినోదిని, రమాదేవి, కృపాల్‌సింగ్, భువనేశ్వరి, జ్యోతిలక్ష్మి, నరేంద్రకుమార్, సంగీతషా, మంజూషా, అసిస్టెంట్ వార్డెన్‌లు రజనీశ్, అర్చన, అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) పద్మలత, ఎన్జీవో సౌజన్య, చిలకలగూడ సీఐ మట్టంరాజు, మీడియా ప్రతినిధిగా కొండ్రేటి శ్రీనివాస్, పేరెంట్స్, ఫ్రెషర్స్, సీనియర్ స్టూడెంట్, పీజీ ప్రతినిధులుగా జగదీశ్‌కుమార్, రజనీశ్‌కుమార్, చిలుముల సరయు, శ్రీరాముల తేజ, అభినవ్‌మిత్రాలను నియమించినట్లు రమేశ్‌రెడ్డి తెలిపారు. ఈ కమిటీ ఏడాది పాటు పనిచేస్తుందని, ర్యాగింగ్ నిరోధానికి తగిన చర్యలు చేపడుతుందని, సలహాలు, సూచనలు స్వీకరిస్తుందని, త్వరలోనే యాంటీ ర్యాగింగ్ కమిటీతో సమావేశమై పలు అంశాలపై చర్చిస్తామని వివరించారు.

రోజుకు రెండు విడతలుగా టీఆర్టీ

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించిన పరీక్షల పూర్తి షెడ్యూల్ విడుదలైంది. ప్రభుత్వం మొత్తంగా 5,089 పోస్టుల భర్తీ కోసం ఇప్పటికే నోటిఫికేషన్ ఇవ్వగా.. తాజాగా రాత పరీక్ష, నియామక విధి విధానాల సమగ్ర వివరాలతో బులెటిన్ జారీ చేసింది. నవంబర్ 20వ తేదీ నుంచి రోజూ రెండు సెషన్లలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) ఉంటుందని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు ఒక సెషన్.. మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు రెండో సెషన్ ఉంటుందని తెలిపింది. పూర్తి ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొంది. అభ్యర్థులు ఇచ్చే ఆప్షన్లను బట్టి పరీక్ష కేంద్రాల కేటాయింపు ఉంటుందని వెల్లడించింది.
–సాక్షి, హైదరాబాద్

ఒక్కో ప్రశ్నకు అర మార్కు

స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ), సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) పోస్టులకోసం నిర్వహిస్తున్న ఈ పరీక్షల్లో 160 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కోదానికి అర మార్కు ఉంటుంది. టీఆర్టీ నియామకాల్లో టెట్ మార్కులకు వెయిటేజీ ఉంటుంది. అంటే 80శాతం మార్కులను రాత పరీక్ష నుంచి, 20 శాతం మార్కులను టెట్ నుంచి కలిపి తుది మార్కులను నిర్ణయిస్తారు.

- ఇక ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సంబంధించిన పరీక్షలో వంద మార్కులకు 200 ప్రశ్నలుంటాయి.
- ఎస్జీటీలకు ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు.. మిగతా పోస్టులకు ఇంటర్మీడియేట్ వరకు రాష్ట్ర సిలబస్ నుంచి ప్రశ్నలిస్తారు.
- దివ్యాంగులకు గతంలో 75శాతంపైగా వైకల్యం ఉండాలనే నిబంధన ఉండగా.. దీనిని 40శాతానికి తగ్గించారు.

పరీక్ష కేంద్రాలు ఇవీ..


అభ్యర్థులు అక్టోబర్ 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి, రూ.వెయ్యి పరీక్ష ఫీజుగా చెల్లించాలి. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్,వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి జిల్లాల్లో ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలు ఉంటాయి. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులుఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. ఆప్షన్లను బట్టి అభ్యర్థులకు పరీక్ష కేంద్రాన్ని కేటాయిస్తారు.

పోస్టుల వారీగా అర్హతలివీ..

- స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులతో పీజీ లేదా డిగ్రీతో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి. (రిజర్వేషన్ కేటగిరీల వారు 45శాతం మార్కులతో ఉత్తీర్ణులైతే చాలు).ఏ సబ్జెక్టు పోస్టుకు దరఖాస్తు చేస్తున్నారో, సంబంధిత సబ్జెక్టును డిగ్రీలో చదివి ఉండాలి.
- లాంగ్వేజ్ పండిట్లు సంబంధిత భాషలో డిగ్రీ, బీఈడీ చేసి ఉండాలి.
- ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులకు దరఖాస్తు చేసే వారు ఇంటర్‌లో కనీసం 50% (రిజర్వేషన్ వారికి 45%) మార్కులు పొంది.. డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ చేసి ఉండాలి. డిగ్రీతోపాటు బీపీఈడీ చేసిన వారు కూడా దీనికి అర్హులే.
- అన్ని పోస్టులకు అభ్యర్థుల వయసు 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.ఆయా వర్గాల రిజర్వేషన్ల మేరకు మినహాయింపులు వర్తిస్తాయి.

నవంబర్ 20వ తేదీ నుంచి పరీక్షలు మొదలు

- ప్రతీ ప్రశ్నకు అర మార్కు.. జనరల్ కేటగిరీలో 90 మార్కులొస్తేనే పాస్
- 11 కంప్యూటర్ పరీక్ష కేంద్రాలు.. కావాల్సిన కేంద్రం కోసం ఆప్షన్లు
- ఉపాధ్యాయ నియామక బులెటిన్ విడుదల చేసిన సర్కారు



ఎవరికి ఎప్పుడు పరీక్ష?

పరీక్ష తేదీలు	కేటగిరీ
నవంబర్ 20, 21	స్కూల్ అసిస్టెంట్లు (నాన్–లాంగ్వేజెస్) మేథ్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ (అన్ని విభాగాలు)
22వ తేదీ	స్కూల్ అసిస్టెంట్స్ (లాంగ్వేజెస్) ఇంగ్లిష్, తెలుగు, హిందీ, ఉర్దూ, తమిళ్, కన్నడ, సంస్కృతం
23వ తేదీ	ఫిజికల్ ఎడ్యుకేషన్ (అన్ని విభాగాలు)
24వ తేదీ	భాషా పండితులు (తెలుగు, హిందీ, ఉర్దూ, తమిళ్, కన్నడ, సంస్కృతం)
25 నుంచి 30వ తేదీ వరకు	సెకండరీ గ్రేడ్ టీచర్స్ (అన్ని విభాగాలు)

పరీక్షలు, సిలబస్ తీరు ఇదీ..

- స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులకు 160 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు అరమార్కు చొప్పున 80 మార్కులుంటాయి. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, విద్యలో పురోగతి, టీచింగ్ మెథడ్ నుంచి వివిధ అంశాలతో ప్రశ్నలుంటాయి.
- ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షలో 200 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి అర మార్కు చొప్పున వంద మార్కులు ఉంటాయి. ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ ఇంగ్లిష్ తోపాటు క్రీడా విద్యకు సంబంధించి వివిధ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- ఎస్జీటీలకు 160 ప్రశ్నలుంటాయి. ఒక్కో దానికి అరమార్కు చొప్పున 80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. వివిధ సబ్జెక్టులు, టీచింగ్ విధానాలు, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలుంటాయి. ఇవి 8వ తరగతి వరకూ ఉండే సిలబస్ నుంచి ఇస్తారు.
- పరీక్షలో కనీసం ఓసీలు 90 మార్కులు, బీసీలు 75, ఎస్సీ,ఎస్టీ, వికలాంగులు 60 మార్కులు సాధిస్తేనే ఉత్తీర్ణులైనట్టుగా భావిస్తారు. అభ్యర్థులు సాధించే మార్కులు, రోస్టర్‌ను అనుసరించి ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున ఎంపిక చేస్తారు. వారి నుంచి డీఎస్సీ ఒకరిని ఎంపిక చేస్తుంది.

మబ్బులు చెదిరి..నిప్పులు కురిసి..

రాష్ట్రవ్యాప్తంగా పెరిగిపోయిన ఉష్ణోగ్రతలు

- సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు అధికంగా నమోదు
- మళ్లీ వానలు మాయం..ఎండాకాలం తరహాలో ఉక్కపోత
- మరో నాలుగైదు రోజులు ఇదే తరహా వాతావరణం
- ఈ నెల 28 తర్వాత వర్షాలు పడే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వాతావరణం మళ్లీ ఎండాకాలంలా మారిపోయింది. ఈసారి వానాకాలం మొదట్లో చినుకు జాడ లేక, తర్వాత భారీ వర్షాలు కురిసి.. ఆగస్టులో అయితే నెలంతా వానలు పడక చిత్రమైన పరిస్థితి నెలకొంది. ఈ నెల మొదట్లో మంచి వర్షాలే పడినా.. మళ్లీ వాతావరణం భిన్నంగా మారిపోయింది. సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికి తోడు ఉక్కపోతతోనూ ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పటికే నాలుగు రోజులుగా ఈ పరిస్థితి ఉండగా.. మరో నాలుగైదు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి వాతావరణమే ఉంటుందని వాతావరణ నిపుణులు చెప్తున్నారు.

మబ్బులు మాయమై..

సాధారణంగా వానాకాలం చివరిలో తేలికపాటి వర్షాలే కురిసే పరిస్థితి ఉన్నా.. ఆకాశం మేఘావృతమై కనిపిస్తుంటుంది. రుతుపవనాల కదలిక ఎక్కువగా ఉంటే భారీ వర్షాలు కూడా పడుతుంటాయి. కానీ ఇప్పుడు వాతావరణం ఇందుకు భిన్నంగా ఉంది. ఆకాశంలో మబ్బులు కానరావడం లేదు. సూర్యతాపం ఎక్కువై ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వాతావరణంలో తేమశాతం ఎక్కువై ఉక్కపోత పెరిగిందని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. ఈ నెల 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణమే ఉంటుందని, ఆ తర్వాత వానలు పడే అవకాశం ఉందని వివరిస్తున్నారు.

గణనీయంగా ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో ఎండాకాలంలో నమోదయ్యే స్థాయిలో ఇప్పుడు ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. బుధవారం అత్యధికంగా నల్లగొండలో 36.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. సెప్టెంబర్ మూడో వారంలో సాధారణంగా గరిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల మేర.. కనిష్ట ఉష్ణోగ్రతలు 22 డిగ్రీల మేర ఉండాలని..కానీ ఇప్పుడు 3 డిగ్రీల నుంచి 5 డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయని అధికారులు చెప్తున్నారు. రెండు మూడు రోజుల తర్వాత ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి చేరవచ్చని అంటున్నారు.

ప్రధాన కేంద్రాల్లో ఉష్ణోగ్రతల తీరు ఇదీ.. (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నల్లగొండ	36.5	24.0
ఖమ్మం	34.4	27.6
ఆదిలాబాద్	34.3	24.2
హనుమకొండ	33.5	25.5
నిజామాబాద్	33.5	24.7
రామగుండం	33.2	26.6
మెదక్	33.0	23.5
హైదరాబాద్	32.7	24.4
భద్రాచలం	32.6	26.5
హకీంపేట్	32.2	24.3
దుండిగల్	32.2	23.1
మహబూబ్‌నగర్	29.0	23.5

మట్టిని కాపాడుకోవాలి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



సదస్సులో నిరంజన్‌రెడ్డి, దాజి తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'మన జీవితాల్లో అత్యంత కీలకమైనది..అందుకు తగ్గ గుర్తింపు లేని అంశం ఏదైనా ఉంది అంటే.. అది మన పాదాల కింది మట్టినే' అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. సూక్ష్మజీవులు, క్రిమికీటకాలు, మొక్కలు, వృక్షాల వేళ్లతో కూడిన ఈ సంక్లిష్ట జీవావరణ వ్యవస్థను కాపాడుకోవడం ఇప్పుడు మనిషికి అత్యవసరమన్నారు. హైదరాబాద్ సమీపంలోని 'కాన్హా శాంతివనం'లో '4 పర్ 1000' పేరుతో మట్టి సంరక్షణ లక్ష్యంగా బుధవారం ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సుకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జర్మనీ, ఫిజీలతోపాటు సుమారు 18 దేశాల వ్యవసాయశాఖల మంత్రులు పాల్గొన్న ఈ సమావేశంలో నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ నీరు, పోషకాలతో కూడిన మట్టి అటు వాతావరణాన్ని నియంత్రించడమే కాకుండా, జీవవైవిధ్యాన్ని కాపాడేందుకూ సాయపడుతోందని చెప్పారు. అయితే వివిధ కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా మట్టి సారం తగ్గిపోతుండటం, సారవంతమైన మట్టి కొట్టుకుపోవడం మానవాళి మనుగడకు ముప్పు కలిగించేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహారభద్రత, పర్యావరణ సమతుల్యతలకూ ప్రమాదకరంగా మారిన ఈ సమస్యను పరిష్కరించేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరముందన్నారు.

ఆర్థిక విలువ జోడించాలి: దాజి, ఆధ్యాత్మిక గురువు

దేశంలోనే అత్యంత వేగంగా పచ్చదనం పెంచుకుంటున్న రాష్ట్రంగా తెలంగాణ ఎదుగుతోందని, అయితే మొక్కల పెంపకం ఏదో మొక్కుబడి తంతుగా కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేదిగా మార్చాలని 'హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్' ఆధ్యాత్మిక మార్గదర్శి, రామచంద్రమిషన్ అధ్యక్షుడు దాజి తెలిపారు. బంజరుభూమిని కూడా ఎంత అద్భుతమైన, జీవవంతమైన నేలగా మార్చవచ్చో కాన్హా ద్వారా స్పష్టంగా తెలుస్తుందని ఆయన చెప్పారు. తెలంగాణలోని ప్రతిగ్రామంలో మొక్కల నర్సరీలు ఏర్పాటు చేయడం బాగుందని.. అయితే ప్రభుత్వం చెట్లు నరికేయకుండానే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికదన్ను అందించేలా చర్యలు తీసుకోవాలని, ఇంధన అవసరాలు తీర్చే దిశగా ప్రయత్నాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజీ వ్యవసాయశాఖ మంత్రి సకయాసీ రాల్‌సెవూ డిటోకా, ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ (బెంగళూరు) థియరీ బెర్త్‌లాట్, వ్యవసాయశాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు, '4 పర్ 1000' ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి డాక్టర్ పాల్‌లూ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో వాతావరణ మార్పులు, ఆహార భద్రతను ఎదుర్కొనేందుకు మట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎలా అన్న అంశంపై చర్చలు జరుగుతాయి.

బుల్లెట్ రైలులో కదలిక

కొలిక్కి వస్తున్న భూసేకరణ సమస్య • ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధికారులతో కలిసి హైదరాబాద్ పాత్రికేయ బృందం అధ్యయనం

(ముంబై నుంచి సాక్షి ప్రతినిధి)

దేశంలోనే తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టు పనులు మళ్లీ ఊపందుకున్నాయి. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యల్లో కొన్ని పరిష్కారం కావడంతో నిర్మాణ సంస్థ పనులు పునరుద్ధరించింది. ముంబై–అహ్మదాబాద్ మధ్య ప్రతిపాదిత బుల్లెట్ రైలు ప్రాజెక్టును 2026 ఆగస్టు నాటికి పూర్తి చేయాలనేది టార్గెట్. అయితే భూసేకరణలో జాప్యం కారణంగా ఏడాదిన్నర ఆలస్యమయ్యే అవకాశముంది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోతో కలిసి హైదరాబాద్‌కు చెందిన పాత్రికేయ బృందం పశ్చిమ రైల్వే, మధ్య రైల్వే కార్యాలయాలు, మ్యూజియం సందర్శించి రైల్వే కార్యకలాపాలు సహా వివిధ కార్యక్రమాలను అధ్యయనం చేసింది.



పాత్రికేయ బృందానికి వివరిస్తున్న రైల్వే అధికారి

ఇవీ ముంబై హెచ్ఎస్ఆర్ స్టేషన్ ప్రత్యేకతలు

ముంబై–అహ్మదాబాద్–హెచ్ఎస్ఆర్ కారిడార్‌లో ఉన్న ఏకైక భూగర్భస్టేషన్ ముంబై హెచ్ఎస్ఆర్ స్టేషన్. ఈ స్టేషన్‌లో 6 ప్లాట్‌ఫారాలు ఉంటాయి. ప్రతీ ప్లాట్‌ఫారం పొడవు సుమారు 415 మీటర్లు. గ్రౌండ్ లెవల్ నుంచి 24 మీటర్ల లోతులో ఈ ప్లాట్‌ఫారం నిర్మించాలని యోచిస్తున్నారు. ఇందులో ప్లాట్‌ఫాం, కాన్‌కోర్స్, సర్వీస్ ఫ్లోర్ సహా మూడు అంతస్తులు ఉంటాయి.

- స్టేషనుకు రెండు ప్రవేశ ద్వారాలు/నిష్క్రమణ గేట్లు ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఒకటి మెట్రో లైన్ 2బీ సమీపంలో మెట్రో స్టేషన్‌కు, మరొకటి ఎంటీఎస్ఎల్ నిర్మాణం వైపు ప్రయాణికుల రాకపోకలకు తగినంత స్థలం, కాన్‌కోర్స్, ప్లాట్‌ఫాం స్థాయిలో సౌకర్యాలు కల్పించే విధంగా ఎగ్జిట్ గేట్లు రూపొందించారు.
- ప్రయాణికుల సౌకర్యానికి సంబంధించి, సహజ లైటింగ్ వ్యవస్థకు ప్రత్యేక స్కైలైట్ ఏర్పాటు చేశారు.
- స్టేషన్‌లో ప్రయాణికుల కోసం సెక్యూరిటీ, టికెటింగ్, వెయిటింగ్ ఏరియా, బిజినెస్ క్లాస్ లాంజ్, నర్సరీ, రెస్ట్‌రూమ్, స్మోకింగ్ రూమ్, ఇన్ఫర్మేషన్ కియోస్క్, రిటైల్, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అండ్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, సీసీటీవీ నిఘా తదితర సౌకర్యాలు కల్పించారు.

ప్రయాణికులు ఇబ్బంది పడకుండా : సీపీఆర్ఓ సుమిత్ ఠాకూర్

రైల్వేకు చెందిన పలు ప్రాజెక్టులు శరవేగంగా అభివృద్ధి చేస్తున్నామని పశ్చిమరైల్వే చీఫ్ పబ్లిక్‌రిలేషన్స్ ఆఫీసర్ సుమిత్‌ఠాకూర్ చెప్పారు.రైల్వేస్టేషన్ల పునరుద్ధరణ పనులు ప్రోత్సాహకరంగా సాగుతున్నాయని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిత్యం 80 లక్షల మంది ముంబై రైల్వే పరిధిలో ప్రయాణిస్తున్నారని, భారత్‌లో సెమీ స్పీడ్ రైళ్ల ప్రవేశానికి మంచి స్పందన లభిస్తోందని, త్వరలోనే అభివృద్ధి చెందిన దేశాల్లో మాదిరిగా హైస్పీడ్ రైళ్ల శకం కూడా ప్రారంభమవుతుందని తెలిపారు. ముంబైలో బుల్లెట్ ట్రైన్ పనులు వివిధ స్థాయిల్లో జరుగుతున్నాయని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సుష్మ తెలిపారు.

సీఎంఓ వాట్సాప్ చానల్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) బుధవారం వాట్సాప్ చానల్‌ను ప్రారంభించింది. సీఎంఓ నుంచి వెలువడే ప్రకటనలను దీని ద్వారా ఎప్పటికప్పుడు పౌరులకు చేరవేయనుంది. 'తెలంగాణ సీఎంఓ'అనే పదాన్ని 'ఫైండ్ చానల్'టూల్‌లో సెర్చ్ చేసి అందులో చేరవచ్చని బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఫిబ్రవరిలో సమతాకుంభ్ వేడుకలు



శంషాబాద్ రూరల్: వాల్మీకి రామాయణంపై అందరికీ అవగాహన, స్పష్టత కలిగించాలనే ఉద్దేశంతో 'శ్రీరామాయణ గ్లోబల్ కాంటెస్ట్' పేరిట క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి తెలిపారు. రామాయణంపై క్విజ్ పోటీలను మూడు విభాగాలుగా నిర్వహించి ఆయా విభాగాల విజేతలకు రూ.9 లక్షల నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ముచ్చింతల్‌లోని ఆశ్రమంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నవంబర్‌లో క్వార్టర్ ఫైనల్, జనవరి మూడో వారంలో సెమీ ఫైనల్ పోటీలను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు వివరించారు. ఫిబ్రవరి 24న స్ఫూర్తి కేంద్రం వద్ద జరిగే ఫైనల్ పోటీలకు మాత్రం భౌతికంగా హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 21 నుంచి వెబ్‌సైట్‌లో రూ.100 ఫీజుతో ఎన్‌రోల్ చేసుకోవాలని సూచించారు. సమతాస్ఫూర్తి కేంద్రం రెండో వార్షికోత్సవాన్ని సమతా కుంభ్–2024 పేరుతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 20 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో శ్రీదేవనాథ జీయర్‌స్వామి, మైహోం గ్రూపు సంస్థల అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వినియోగదారుల చెంతకే డీజిల్ సరఫరా

జియో బీపీ– ఎనీ టైం డీజిల్ సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం



ఎనీ టైం డీజిల్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న నితిన్ ఘోర్పడే తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: వినియోగదారుల చెంతకే డీజిల్‌ను సరఫరా చేసేందుకు హైదరాబాద్ స్టార్టప్ కంపెనీ ఎనీ టైం డీజిల్ సంస్థ నూతన పద్ధతికి శ్రీకారం చుట్టింది. ఇందుకుగాను దేశంలోనే అతిపెద్ద డీజిల్ కంపెనీ రిలయన్స్ జియో బీపీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ రెండు సంస్థలు తెలుగు రాష్ట్రాల్లో డీజిల్ సరఫరా సేవలను ప్రారంభించాయి. హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం సమీపంలో విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న జియో బీపీ పెట్రోల్ బంకులో బుధవారం ఎనీ టైం డీజిల్ సేవలను ప్రారంభించారు. జియో బీపీ టీం సౌత్ రీజినల్ సేల్స్ మేనేజర్ నితిన్ ఘోర్పడే, ఆంధ్రా, తెలంగాణ హెడ్ శ్రీప్రాథ్, సీనియర్ మేనేజర్లు జితేందర్‌రెడ్డి, కార్తీక్ కుమార్, ఎనీ టైం డీజిల్ ఫౌండర్, సీఈఓ కే రాహుల్‌రెడ్డి, డైరెక్టర్ ప్రశాంత్‌రెడ్డితో కలిసి డీజిల్ ట్యాంకర్లను ప్రారంభించి, ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.